
'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 132

బుధవారం 2-8-2023



సిరీస్ కోసం భారీ స్కోరు

భారత్ 351/5. హార్దిక్, సామ్సన్, గిల్, ఇషాన్ మెరుపులు. -12లో



88 % పెద్ద నోట్లు వచ్చేశాయ్

88% రూ.2,000 నోట్లు బ్యాంకింగ్‌లోకి తిరిగి వచ్చాయన్న ఆర్‌బీఐ -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అవిశ్వాసం ఉంటే అభివృద్ధి ఉండదు

అవిశ్వాసం ఉన్నచోట అభివృద్ధి సాధ్యం కాదని ప్రధాని మోదీ చెప్పారు. పుణేలో 'లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు'ను మోదీ స్వీకరించారు.

- వివరాలు 6లో



సమస్యల పరిష్కారంపై ఒత్తిడి

శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలు లేవనెత్తి వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ శాసనసభాపక్షం నిర్ణయించింది.

- వివరాలు 2లో



సీఎం నితీశ్‌కు హైకోర్టులో ఊరట

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కులగణన చేస్తామంటూ ఆ క్రతువుకు శ్రీకారం చుట్టిన బిహార్ సీఎంకు హైకోర్టులో ఊరట దక్కింది.

- వివరాలు 6లో



సూకీ జైలు శిక్ష తగ్గింపు

పదవీచ్యుతురాలైన అంగ్ సాన్ సూకీకి ఆరేళ్ల జైలు శిక్షను తగ్గిస్తున్నట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది.

- వివరాలు 6లో



8న అవిశ్వాసం

లోక్‌సభలో మూడు రోజులపాటు జరగనున్న చర్చ

10వ తేదీన సమాధానం ఇవ్వనున్న ప్రధాని మోదీ

- లోక్‌సభ బీఏసీ సమావేశంలో నిర్ణయం
- పార్లమెంట్‌లో కొనసాగిన 'మణిపూర్' అలజడి
- ఉభయసభలు బుధవారానికి వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పకపోవడాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 8వ తేదీ నుంచి 3 రోజులపాటు లోక్‌సభలో చర్చ జరుగనుంది. 10వ తేదీన ప్రధాని మోదీ దీనిపై సమాధానమిచ్చే అవకాశం ఉంది. మంగళవారం లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై బుధవారం నుంచే చర్చ చేపట్టాలంటూ తాము డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ విపక్ష 'ఇండియా' కూటమి సహా ఇతర ప్రతిపక్ష ఎంపీలు బీఏసీ సమావేశం నుంచి మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. కేంద్రంపై గత నెల 26న విపక్ష 'ఇండియా' కూటమి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2014 తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటుండడం ఇది రెండోసారి. 2018 జూలై 20న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. తీర్మానానికి వ్యతిరేకంగా 325 మంది ఎంపీలు ఓటేశారు. మోదీ సర్కారు సునాయాసంగా గట్టెక్కింది. ఈసారి కూడా గెలుపు లాంఛనమే. ప్రస్తుత లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి కనీసం 332 మంది ఎంపీల మద్దతు ఉంది. నంబర్ గేమ్‌లో తాము ఓడిపోతామని తెలుసని, మణిపూర్ అంశంపై మాట్లాడేలా ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలన్నదే తమ ఉద్దేశమని విపక్షాలు చెబుతున్నాయి.

మణిపూర్ అంశంపై విపక్షాల ఆందోళన

మణిపూర్ వ్యవహారంపై పార్లమెంట్‌లో రగడ కొనసాగుతూనే ఉంది. వాయిదాల పర్వం ఆగడం లేదు. మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో చర్చించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సైతం ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు

మిగతా 6వ పేజీలో ▶



బీజేపీ ఎంపీ రాజేంద్ర అగర్వాల్ లోక్‌సభలో స్పీకర్ స్థానంలో ఆసీనులై సభను నిర్వహిస్తుండగా పోడియం వద్దకు వచ్చి మణిపూర్ అంశంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విపక్ష సభ్యులు

రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది

మణిపూర్‌లో శాంతిభద్రతలు అస్సలు లేవు

- దర్యాప్తు చేసే దమ్ము అక్కడి పోలీసులకు లేదు
- మణిపూర్ ఉదంతంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- వ్యక్తిగతంగా హాజరుకావాలని డీజీపీని ఆదేశించిన కోర్టు

వివరాలు 6లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బీఆర్‌ఎస్ నేతలను ఆదేశించారు. వీఆర్‌ఏ ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికుల గుర్తింపు, హైదరాబాద్‌లో మెట్రోవిస్తరణ తదితరాలపై రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు నిర్వహించాలన్నారు.

- వివరాలు 2లో▶

నేడు కాంగ్రెస్‌లోకి జూపల్లి, కూచుకుళ్ల




మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్‌రెడ్డి తదితరులు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

- వివరాలు 2లో▶

రాష్ట్రంలో 39 'అమృత్' స్టేషన్లు



అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా తెలంగాణలోని మొత్తం 39 రైల్వే స్టేషన్లను గుర్తించి వీటిని సంపూర్ణంగా ఆధునీకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో మొదటి విడతగా 21 స్టేషన్లకు సంబంధించిన పనులను ఆగస్టు 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

- వివరాలు 10లో▶

'జైపూర్ రైలు' మృతుల్లో హైదరాబాదీ

రైలులో జరిగిన కాల్పుల్లో మరణించిన వారిలో హైదరాబాద్‌వాసి కూడా ఉన్నారు. సోమవారం తెల్లజామున జైపూర్ నుంచి ముంబై సెంట్రల్‌కు వెళ్లే జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాల్పుల ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

- వివరాలు 5లో▶



తగ్గని వరద.. తీరని కష్టాలు

వాగుల్లో వరద ఉధృతి తగ్గకపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు మంచంపై పడుకోబెట్టి లక్మాపూర్ వాగు దాటించిన ఘటన మంగళవారం కుమ్రంభీం జిల్లాలో చోటుచేసుకుంది.

- కెరమెరి(ఆసిఫాబాద్)

• సహాయక చర్యలేం చేపట్టారు..?



- భవిష్యత్‌లో వరదలతో నష్టం వాటిల్లకుండా ఏం చేస్తున్నారు?
- ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం
- రెండు వేర్వేరు అఫిడవిట్లు దాఖలు చేయాలన్న ధర్మాసనం
- టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరద నివారణ, బాధితులకు సహాయం, పరిహారం అందజేత లాంటి వివరాలపై, అలాగే భవిష్యత్‌లో వరదలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా శాశ్వత నివారణ చర్యలు ఏం చేపట్టారో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. తాజా వర్షాలు, వరదల నేపథ్యంలో దీనికి సంబంధించి ఓ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలైంది. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 'వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలి. వాతారణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా భవిష్యత్ చర్యలు చేపట్టాలి. బాధితులను గుర్తించి పునరావాసం సహా ఇతర సహాయక చర్యలు చేపట్టాలి. బాధితుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు

మిగతా 3వ పేజీలో ▶

ఏ వైపూ లేము

మహారాష్ట్రలో ముఖ్యమంత్రి కేసీఆర్

- ఇండియా.. ఎన్డీయే.. దేంట్లోనూ లేము
- ఒంటరిగా మాత్రం లేం.. మిత్రులతో కలిసి ఉన్నాం
- ఎన్నికల యుద్ధ గంట మోగించామన్న ముఖ్యమంత్రి
- అన్నాభావ్ సాఠేకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్
- ఈ అంశంపై ప్రధాని మోదీకి లేఖ రాస్తానని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తాము 'ఇండియా' వైపు కానీ లేదా ఎన్డీయే వైపు కానీ లేమని భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ఎవరి వైపూ లేమని, ఉండబోమని అన్నారు. అయితే తాము ఒంటరిగా మాత్రం లేమని, మిత్రులతో కలిసి ఉన్నామని చెప్పారు. మంగళవారం మహారాష్ట్రలో పర్యటించిన

మిగతా 2వ పేజీలో ▶

ఎమర్జెన్సీ సేవలు మరింత పటిష్టం

- 466 వాహనాలు ప్రారంభించిన సీఎం కేసీఆర్
- 108 రాక సమయం 30 నుంచి 15 నిమిషాలకు తగ్గుదల
- వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

5లో




హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా వద్ద 466 అంబులెన్స్, అమ్మ ఒడి, పార్థివదేహాల తరలింపు వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు



గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నాల, శ్రీధర్‌బాబు, అంజన్

సర్కార్ వైఫల్యంతోనే భారీ నష్టం

- వర్ష బీభత్సం వివరాలను గవర్నర్‌కు వివరించిన సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నేతలు

వరద బాధితులకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా తీవ్ర స్థాయిలో ఆస్తి, పంట నష్టపోయిన వారిని వెంటనే ఆదుకోవాలని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క కోరారు. మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్ కుమార్ యాదవ్, మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి భట్టి రాజ్‌భవన్‌కి వెళ్లి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టం వివరాలను అందజేశారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అప్రమత్తం చేసినప్పటికీ , రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగాన్ని సమాయత్తం చేయకుండా నిర్లిప్తంగా వ్యవహరించడం వల్లనే ఇంత నష్టం జరిగిందన్నారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం అశాస్త్రీయంగా జరగడం వల్లనే అనేక ప్రాంతాలు, గిరిజన గూడేలు ముంపునకు గురయ్యాయన్నారు. మున్నేరు, కిన్నెరసాని నదులపై నిర్మించిన

మిగతా 2వ పేజీలో ▶

ప్రతీ అంశంపై సమగ్ర చర్చ జరగాలి

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సన్నాహక సమావేశంలో స్పీకర్ పోచారం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం. చిత్రంలో గుత్తా, వేముల

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో సభ హుందాతనం, ఔన్నత్యం కాపాడుకుంటూ ప్రతీఅంశంపై సమగ్రంగా చర్చ జరగాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సన్నాహక సమావేశం నిర్వహించారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, అసెంబ్లీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని పోచారం అన్నారు. సమావేశాలు జరిగే రోజుల్లో అధికారులు అందుబాటులో ఉండటంతో పాటు ప్రతీశాఖ తరఫున ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు.

జిల్లాల్లో ప్రొటోకాల్ వివాదాలు : మండలి చైర్మన్ గుత్తా

జిల్లాల్లో ప్రొటోకాల్ అంశంలో ఇబ్బందులు వస్తున్నాయని, వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶

మంత్రి కొప్పులకు చుక్కెదురు

ఆయన పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేయాలంటూ వేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను కోర్టు కొట్టివేసింది. ప్రధాన పిటిషన్‌లో ఇన్నాళ్లు విచారణ సాగిన తర్వాత ఇప్పుడు ఐఏ దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. ఎన్నికల పిటిషన్ విచారణార్హమేనని పేర్కొంటూ, రోజువారీ విచారణ చేపడతామని వ్యాఖ్యానించింది. వాస్తవాలను దాచి పిటిషన్ వేశారన్న మంత్రి ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రీని ఆదేశించింది. మంత్రి గతంలోనూ ఇదే అంశంపై దాఖలు చేసిన

మిగతా 2వ పేజీలో ▶

వరద సహాయం సరిపోదు!



- ఊహించిన దానికంటే పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి
- పునరావాస కేంద్రాలను పెంచాలి: గవర్నర్

2లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE — Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు

గుడ్డు రిటైల్ ధర ₹ 53 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	100 కిలో	బ్రాయిలర్ స్కిన్‌తో	189 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	130 కిలో	స్కిన్‌లెస్	215 కిలో



మన పెళ్లికి మా ఇంట్లో వారు ఒప్పుకున్నారు!

సెప్టెంబర్ 15న టెట్

నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ

- బీఈడీ అభ్యర్థులకు రెండు పేపర్లు రాసే చాన్స్
- అర్హత సర్టిఫికెట్ జీవితకాలం చెల్లుబాటు



షెడ్యూల్ ఇలా...

- నేటి నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 16 వరకు దరఖాస్తులకు చివరి గడువు
- సెప్టెంబర్ 9 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- పేపర్ -1 సెప్టెంబర్ 15న ఉదయం 9:30 నుంచి 12:00 గంటల వరకు
- పేపర్ -2 అదే రోజు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- సెప్టెంబర్ 27న ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ మంగళవారం వెలువడింది. వచ్చే సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా టెట్ నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది. అర్హులైన అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల 16 వ తేదీ వరకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెట్ ఫలితాలను సెప్టెంబర్ 27వ తేదీన వెల్లడిస్తారు. టెట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ జీవితకాలం చెల్లుబాటులో ఉంటుంది. బీఈడీ, డీఎడ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2016, 17, 22 సంవత్సరాల్లో టెట్ నిర్వహించారు. తాజాగా నిర్వహించే దానితో కలుపుకుంటే ఇది నాలుగోసారి. అయితే 2017లో మాత్రమే టీచర్ల నియామక పరీక్ష నిర్వహించారు. ఇందులో 8,700 మంది అర్హత సాధిస్తే, 2020లో 8 వేలమందికి టీచర్ పోస్టులు ఇచ్చారు. ఇప్పటివరకు

మిగతా 3వ పేజీలో ▶

లక్షల్లో ఉత్తీర్ణులు.. వేలల్లో పోస్టులు 3లో

టెట్ సరే.. టీచర్ అయ్యేదెప్పుడో • విద్యాశాఖలో 22 వేల పోస్టులు ఖాళీ



మంచిరేవుల భూములు ప్రభుత్వానివే

గ్రేహౌండ్స్‌కు బదలాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు

వివరాలు 10లో

'కడెం' కష్టమే

- ప్రాజెక్టు నిర్వహణపై చేతులెత్తేసిన నీటిపారుదలశాఖ
- పూర్తిగా ఆధునీకరించాల్సిందే..

వివరాలు 3లో



ప్రాజెక్టు డిజైన్ ఇలా...

- నిర్మాణం 1956లో
- ప్రాజెక్టు ఎత్తు 700 అడుగులు
- దిగువకు నీటి విడుదల సామర్థ్యం 3.82 లక్షల క్యూసెక్కులు
- ప్రాజెక్టు గేట్లు : 18 (జర్మనీ టెక్నాలజీతో 9, ఇండియన్ టెక్నాలజీతో 9)

క్లుప్తంగా...

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే మెట్రో విస్తరణ

బీఆర్ఎస్ తీరుపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయనే 270 కి.మీ. మెట్రో రైలు నిర్మాణం చేస్తామంటూ బీఆర్ఎస్ సర్కార్ నిర్ణయించిందని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే ఈ మెట్రో విస్తరణ అని అందరూ అనుకుంటున్నారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. తొమ్మిదేళ్లలో కనీసం పాతబస్తీలో 5.5 కి.మీ మెట్రోరైలు సదుపాయం కల్పించలేని రాష్ట్ర ప్రభుత్వం, ఒకేసారి రూ.69 వేల కోట్ల అంచనా వ్యయంతో దీనిని నిర్మిస్తామనడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వరదలో మునిగిపోయి ప్రజలు అల్లాడుతుంటే ముఖ్యమంత్రి వరద ప్రాంతాల్లో పర్యటించకుండా బీఆర్ఎస్ పార్టీ విస్తరణ కోసం మహారాష్ట్ర వెళ్లారన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్



అలంపూర్: ముఖ్యమంత్రి పీఠంపై బహుజనుడిని కూర్చోబెట్టడమే లక్ష్యంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీఎస్పీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అలంపూర్‌లో మంగళవారం జరిగిన బీఎస్పీ సోషల్ మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాలో 99% ఉన్న బహుజనులకు రాజ్యాధికారం దక్కాలన్నదే తమ పార్టీ లక్ష్యమన్నారు.

కేబినెట్ నిర్ణయాలు అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



హనుమకొండ: రాష్ట్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'అనాథలు ప్రభుత్వబిడ్డలేనని 8 ఏళ్ల కిందనే సీఎం కేసీఆర్ చెప్పారు. సబ్‌కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. తాజాగా సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ అనాథలను ప్రభుత్వ బిడ్డలుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కేసీఆర్ మరోసారి చెప్పడంలో ఆంతర్యమేమిటి' అని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే దీనికి చట్టబద్ధత కల్పించాలని, అనాథా శ్రమాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో బీఆర్ఎస్ మేనిఫెస్టోపై చర్చించాలి

వైఎస్సార్‌టీపీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీఆర్ఎస్ మేనిఫెస్టోపై చర్చించాలని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే దమ్ము సీఎం కేసీఆర్‌కు ఉందా అని ఆమె ప్రశ్నించారు. రుణమాఫీ నుంచి దళితబంధు వరకు కేసీఆర్ చేసినవన్నీ మోసాలేనని ఆరోపించారు. బంగారు తెలంగాణ పేరుతో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నట్టేట ముంచారని మంగళవారం ఓ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ఆ సంస్థ కార్మికులు సాధించిన ఘనత, అమరవీరుల త్యాగఫలితమని అభివర్ణించారు. ప్రభుత్వం వాడుకున్న రూ.1000కోట్ల కార్మికుల సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతీ అంశంపై చర్చ జరగాలి

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఉభయసభలు సజావుగా నడిచేందుకు అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. గతంలో అసెంబ్లీ సగటున రోజుకు రెండుగంటల చొప్పున జరగ్గా, ప్రస్తుతం ఎనిమిదిగంటలపాటు జరుగుతోందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నోడల్‌అధికారి శాఖల వారీగా సమాచారం కోసం సమన్వయం చేసుకునేందుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్పీకర్, మండలి చైర్మన్ సూచనలు పాటిస్తూ కొత్త ప్రొటోకాల్ బుక్ డ్రాఫ్ట్ తయారు చేయాల్సిందిగా అసెంబ్లీ కార్యదర్శికి సూచించారు. శాసనసభ భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు లిఫ్ట్‌లను పోచారం శ్రీనివాసరెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, ఆర్థిక, మున్సిపల్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, అర్వింద్‌కుమార్, డీజీపీ అంజనీకుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్బరుద్దీన్‌తో మంత్రి వేముల భేటీ

మంత్రి ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ ఆవరణలోని ఎంఐఎం కార్యాలయంలో ఆ పార్టీ శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీతో భేటీ అయ్యారు. గంటన్నర పాటు ఇద్దరి మధ్య సమావేశం కొనసాగింది. ప్రస్తుతం అసెంబ్లీలో ఎంఐఎం ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

ఏ వైపూ లేము



అన్నాభావ్ సాఠే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం కేసీఆర్ స్థానిక మీడియాతో, బహిరంగ సభలో మాట్లాడారు. 'నయా ఇండియా ఏంటి? 50 సంవత్సరాలు వాళ్లు అధికారంలో ఉన్నా మార్పు రాలేదు. మార్పు జరగాల్సి ఉంది..' అని అన్నారు. వివిధ స్థాయిల్లో తమ పార్టీకి సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల యుద్ధ గంట మ్రోగించామని, మహారాష్ట్రలో తమ పని ప్రారంభించామని చెప్పారు. 14.10 లక్షల మంది పదాధికారులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం పని పూర్తయిందని, మరో 15 నుంచి 20 రోజుల్లో గ్రామగ్రామాన పూర్తిస్థాయిలో పని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మహారాష్ట్ర లాంటి అద్భుతమైన రాష్ట్రం మరొకటి లేదని, అనేక వనరులున్నాయని కేసీఆర్ చెప్పారు. అయినా ఔరంగాబాద్ వంటి నగరంలో నీటి ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. దళిత సమాజం ఇంకా ఎన్ని రోజులు ఇబ్బంది పడాలని ప్రశ్నించారు.

మాతంగి సమాజానికి సరైన ఆదరణ లేదు.. బీఆర్ఎస్ అండగా ఉంటుంది

అన్నాభావ్ సాఠే జన్మించిన మాతంగి సమాజం గొప్పదనాన్ని మహాకవి కాళిదాసు కీర్తించిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. సాఠేకు భారతరత్న బిరుదు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేస్తూ ఆయనకు స్వయంగా లేఖ రాస్తానని ప్రకటించారు. మాతంగి సమాజానికి మహారాష్ట్ర ప్రభుత్వం సరైన ఆదరణ, గుర్తింపు ఇవ్వడం లేదని, ఎమ్మెల్యేలుగా, ప్రజా ప్రతినిధులుగా చట్టసభల్లో భాగస్వామ్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మాతంగి సమాజానికి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అన్నాభావ్ సాఠే ప్రతిమను ఆయన కుటుంబ సభ్యులు కేసీఆర్‌కు బహూకరించారు. అన్నాభావ్ మనవడు సచిన్ భావ్ సాఠే, సచిన్ సాఠే తల్లి సావిత్రిభాయ్ సాఠే, మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కె.వంశీధర్ రావు, హరిభావ్ రాథోడ్ , ఖదీర్ మౌలానా, భానుదాస్ ముర్కుటే, ఘన్ శ్యాం శేలార్, భగీరథ్ బాల్కే, బీజే దేశ్‌ముఖ్, శంకరన్న డోంగే, మాలిక్ కదం, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్, యశ్‌పాల్ బీంగే పాల్గొన్నారు.

అంబాబాయికి ప్రత్యేక పూజలు

కేసీఆర్ మంగళవారం ఉదయం 11 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి మహారాష్ట్ర పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట ప్రభుత్వ ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్, తెలంగాణ, మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. కొల్హాపూర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేసీఆర్ నేరుగా మహాలక్ష్మి మాతా అంబాబాయి దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంగ్లి జిల్లా వాటేగావ్‌లో అన్నాభావ్ సాఠే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహిరంగ సభ వేదికపై అన్నాభావ్ సాఠే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, సాహు మహారాజ్, మహాత్మ జ్యోతిరావు పూలే తదితరుల చిత్రపటాలకు పుష్పాంజలి అర్పించారు. సభ అనంతరం ఇస్లాంపూర్‌లోని షేత్కారి సంఘటన్ నేత రఘునాథ్ దాదాపాటిల్ నివాసంలో పార్టీ నేతలతో కలసి భోజనం చేశారు. తర్వాత సాహు మహారాజ్ సమాధి వద్ద నివాళి అర్పించారు. రాత్రి ప్రత్యేక విమానంలో తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

సర్కార్ వైఫల్యంతోనే భారీ నష్టం

▶ మొదటి పేజీ తరువాయి

చెక్ డ్యాములను ఇంజనీరింగ్ అధికారులతో శాస్త్రీయంగా డిజైన్ చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు.

మహారాష్ట్రకు విమానాలు పంపించారు కానీ..

ప్రజల అవసరాల కోసం కాకుండా కేసీఆర్ తన రాజకీయ అవసరాల కోసం అధికార యంత్రాంగాన్ని వాడుకున్నారని భట్టి ఆరోపించారు. మహారాష్ట్రకు ప్రత్యేక విమానాలు పంపించి అక్కడి నాయకులను ప్రగతిభవన్‌కు పిలిపించుకొని గులాబీ కండువాలు కప్పే దానిపై ఉన్న శ్రద్ధ వరద బాధితులను ఆదుకోవడంలో లేకుండా పోయిందని విమర్శించారు. మహారాష్ట్రకు విమానాలు పంపించిన సీఎం కేసీఆర్ గోదావరి వరదలతో మునిగిపోయిన ఏజెన్సీ ఏరియాలో గిరిజన ప్రజలను ఆదుకోవడానికి హెలికాప్టర్లు పంపించలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వరదలతో ప్రజలు అల్లాడుతుంటే బాధితులను, ఏజెన్సీ ప్రాంతాలను సందర్శించకుండా కేసీఆర్ మహారాష్ట్ర టూర్‌కి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు.

విలీనం చేయడం కాంగ్రెస్ విజయమే

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని గతంలో తాము కోరినప్పుడు సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా దుర్భాషలాడుతూ నీతిమాలిన, పనికిమాలిన, ఆలోచన లేని నాయకులంటూ తప్పు పట్టారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించిందని, ఆ భయంతోనే కేసీఆర్ విలీన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఆర్టీసీకి ఆస్తులు కూడబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ సంపాదించి పెట్టిన ఆర్టీసీ ఆస్తులను బీఆర్ఎస్ ప్రభుత్వం కొల్లగొట్టడానికి చూస్తే రోడ్లపైకి వస్తామని భట్టి హెచ్చరించారు.

మంత్రి కొప్పులకు చుక్కెదురు

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషన్‌ను ఇదే న్యాయస్థానం కొట్టివేసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని సవాల్ చేస్తూ ఆయనపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అడ్లూరి లక్ష్మణ్ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. వీవీపీఏటీ స్లిప్స్‌లో తేడాలున్నాయని, రీకౌంటింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. దీనిపై హైకోర్టు విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేయాలని మంత్రి పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. మంత్రి దాఖలు చేసిన ఐఏను కొట్టివేసిన న్యాయమూర్తి..విచారణను బుధవారానికి వాయిదా వేశారు. ప్రభుత్వంలోని ముగ్గురు మంత్రులపై హైకోర్టులో విచారణ కొనసాగుతుండటం గమనార్హం.

ప్రభుత్వ నిర్ణయాలు | ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీఆర్ఎస్ నేతలతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ నేతలను ఆదేశించారు. వీఆర్ఏ ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికుల గుర్తింపు, హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ తదితరాలపై రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు నిర్వహించాలన్నారు. మంగళవారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తాజాగా కేబినెట్‌లో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 21 వేల మంది వీఆర్ఏలు, 43 వేలకు పైగా ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వం మానవీయతను చాటుకుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులతో కలిసి బస్సు డిపోల ఎదుట సంబురాలు నిర్వహించాలని, ఒకటి రెండు రోజుల్లో వీఆర్ఏ, ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయాలని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. అనాథల కోసం తెస్తున్న పాలసీ కూడా మానవీయపాలనకు అద్దం పడుతుందని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 415 కిలోమీటర్లకు విస్తరించేలా భారీ ప్రణాళిక ప్రభుత్వం ప్రకటించిందని, విస్తరణ తర్వాత మెట్రో అందుబాటులోకి వచ్చే నియోజకవర్గాల్లో స్థానిక పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని చెప్పారు.ఈ నిర్ణయంతో హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ మరింతగా బలోపేతం అవుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలన్నింటిపైనా జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ ఆదేశించారు.

నేడు కాంగ్రెస్‌లోకి జూపల్లి, కూచుకుళ్ల

సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్‌రెడ్డి, వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన నాయకుడు శ్రీవర్ధన్ తదితరులు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఇందుకోసం వీరంతా ఢిల్లీ వెళ్లారు. లోక్‌సభ సమావేశాలకు హాజరవుతున్న పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఢిల్లీలో ఉండగా, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మరో ముఖ్య నేత, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి కూడా ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ ఇద్దరు నేతలు, మల్లికార్జున ఖర్గే సమక్షంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జూపల్లి తదితరులు పార్టీలో చేరుతారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. వీలైతే కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ లేక ప్రియాంకాగాంధీ ఈ చేరిక కార్యక్రమానికి రావొచ్చని అంటున్నారు.

ప్రియాంకా సమక్షంలో చేరాల్సి ఉన్నా..

వాస్తవానికి, కొల్లాపూర్‌లో జరగాల్సిన బహిరంగ సభలో ప్రియాంకాగాంధీ సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరాల్సి ఉంది. కానీ, ఇప్పటికే రెండు సార్లు ఈ సభ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ప్రియాంకాగాంధీ సభ ఇక రద్దయినట్టేనని తెలుస్తోంది. అయితే సభ రద్దు కాలేదని, ఈనెల 7–14 తేదీల్లో ప్రియాంకాగాంధీ మహబూబ్‌నగర్ జిల్లాకు వస్తారని కానీ పార్టీ కార్యకలాపాల్లో విస్తృతంగా పాల్గొనేందుకే ఖర్గే సమక్షంలో జూపల్లి అండ్ టీం ఢిల్లీ వెళ్లి పార్టీలో చేరుతోందని సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పుకొచ్చారు.

మంత్రి కేటీఆర్‌కు సుకేశ్ లీగల్ నోటీసు


బహిరంగ క్షమాపణ చెప్పాలని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ట్విట్టర్ వేదికగా తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ మంత్రి కేటీఆర్‌కు మండోలి జైలులో మనీలాండరింగ్ నిందితుడు సుకేశ్ చంద్రశేఖర్ లీగల్ నోటీసు పంపారు. రోగ్, నోటెడ్ క్రిమినల్, ఫ్రాడ్ అంటూ చేసిన వ్యాఖ్యలు తనను కించపరిచేలా ఉన్నాయంటూ అనంతరం లీగల్ అడ్వొకేట్, సొలిసిటర్స్ ద్వారా నోటీసుఇచ్చారు. రాజకీయ, సినిమా వ్యాపార రంగాల్లో తనకు మంచి పేరుందని, అయితే కేటీఆర్ వ్యాఖ్యలతో తన సర్కిల్‌లో కీర్తిప్రతిష్టలు దెబ్బతిన్నాయని సుకేశ్ ఆరోపించారు. వారంలోగా తనపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆ నోటీసులో పేర్కొన్నారు.

వరద సహాయం సరిపోదు!

- ఊహించిన దానికంటే పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి
- పునరావాస కేంద్రాలను పెంచాలి: గవర్నర్ తమిళిసై
- ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలి



సాక్షి, హైదరాబాద్: కుంభవృష్టిగా కురిసిన వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఊహించిన దానికంటే పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయం సరిపోదని తాను భావిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వరదల విధ్వంసం కొనసాగుతున్న నేపథ్యంలో వీటి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఉత్తర తెలంగాణలోని 10 జిల్లాలతో పాటు మధ్య తెలంగాణకు పరీక్షా సమయమని, ఇక్కడ తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు సాధ్యమైనంతగా సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, స్వచ్ఛంద సంస్థలకు పిలుపునిచ్చారు. వరద బాధిత కుటుంబాలకు తక్షణమే సహాయం అందించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర, కేంద్ర, జిల్లా కార్యాలయాలకు పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగంతో కలిసి వరద బాధితులకు ఇప్పటికే రెడ్‌క్రాస్ సహాయం అందిస్తోందన్నారు. వరద బాధిత కుటుంబాలకు తక్షణమే ఆహారం, ఆశ్రయం, వంట సామాగ్రి, ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, వరద నష్టాన్ని వేగంగా అంచనా వేయాలని సూచించారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, యూఎన్డీపీ, యూనిసెఫ్, సీఎస్ఆర్ ఫౌండేషన్లు, వైద్యులు, మీడియా భాగస్వామ్యంతో కింది సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

- తక్షణ ఉపశమనంగా షెల్టర్ హోమ్స్, ఆహారం, తాగునీటి సరఫరా, అత్యవసర వైద్య బృందాలను పంపించాలి. శిథిలాల తొలగింపు చేపట్టాలి. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చర్యలు తీసుకోవాలి.
- చిన్నారులు, బాలికలు, మహిళల రక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రాణ, ఆస్తి, ఉపాధికి జరిగిన నష్టాన్ని కచ్చితంగా మదించి పునరావాసం కల్పించాలి.

బిల్లులు తిప్పి పంపడానికి కారణాలున్నాయి..

ప్రభుత్వానికి మూడు బిల్లులు వెనక్కి పంపించడానికి కారణాలున్నాయని గవర్నర్ తమిళిసై వ్యాఖ్యానించారు. గవర్నర్ తిప్పి పంపిన బిల్లులను అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు పంపిస్తామని, అప్పుడు ఆమోదించక తప్పదంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె మీడియాతో మాట్లాడుతూ స్పందించారు. 'నేను పంపించిన మూడు బిల్లులు ఎందుకు పంపించానో వివరంగా పేర్కొన్నాను. అందుకు సహేతుక కారణాలున్నాయి. ప్రతి బిల్లుపై నాకున్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరా. కావాలని ఏ బిల్లునూ కారణం లేకుండా తిప్పి పంపలేదు. బిల్లులు ఆపేశానని అనవసరంగా నిందించడం సరి కాదు' అని గవర్నర్ వ్యాఖ్యానించారు.

రాజకీయాలు చేయాల్సిన టైం ఇదా.. కేసీఆర్?

- వరదలతో రైతులు నష్టపోతే తెలంగాణ సొమ్ముతో మహారాష్ట్రలో రాజకీయాలా?
- ప్రజల ప్రాణాలను గాలికి వదిలేశారు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజం
- త్వరలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం: ఎంపీ కోమటిరెడ్డి



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వరదలతో రైతులు నష్టపోతే.. సీఎం కేసీఆర్ రాజకీయాలు చేయాల్సిన సందర్భం ఇదా? అసలు మానవత్వం ఉన్న వారు ఇలాంటి రాజకీయాలు చేస్తారా? అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు వస్తే కేసీఆర్ ప్రజల ప్రాణాలు గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. అధికారిక లెక్కల ప్రకారం వరదల్లో 40 మంది చనిపోయారని, 20 లక్షల ఎకరాల్లో రూ.5వేల కోట్ల పంట నష్టం వాటిల్లిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అఖిలపక్షం తీసుకుని ఢిల్లీ వచ్చి ప్రధాని, హోం మంత్రిని కలిసి నిధులు కోరాల్సిన ముఖ్యమంత్రి... వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా తెలంగాణ సొమ్ముతో మహారాష్ట్రలో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఏమాత్రం సిగ్గులేకుండా మహారాష్ట్రకి వెళ్లి పార్టీ ఫిరాయించిన వారికి కేసీఆర్ కండువా కప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వరదలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి నిరసన తెలిపారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, సీఎం ఢిల్లీకి వచ్చి వరద నష్టంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలని... కేంద్రం తెలంగాణను ఆదుకోకపోతే పార్లమెంట్‌ను స్తంభింపజేసి వరద సహాయం సాధిస్తామని తెలిపారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని, పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు మానవత్వం లేదు

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌కి మానవత్వం లేదని, రైతులను ఆదుకోకుంటే త్వరలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని... రాగానే పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ రైతు రుణమాఫీ అమలు చేయలేదని.. కాంగ్రెస్ కౌలు రైతులను కూడా ఆదుకుంటుందన్నారు. తెలంగాణలో పంట నష్టం జరిగితే కేసీఆర్ ఎందుకు ఢిల్లీ రాలేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఓట్ల కోసమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నారని ఆరోపించారు.

చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో ప్రశ్నించు

- కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకో
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎంపీల ఆగ్రహం



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కె.కేశవరావు. చిత్రంలో బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డికి తెలంగాణ పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ఎంపీలు డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌పై చేసిన రేవంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎం అయ్యాకే ఎడారిలా వున్న తెలంగాణను అభివృద్ధి చేశారని.. నోరు ఉందని అడ్డగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీలకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీ కేశవరావు మాట్లాడుతూ, దేశం మొత్తం తెలంగాణను భేష్ అంటుంటే, కొందరు దురుద్దేశపూర్వకంగా అనరాని మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలను ఆదుకుంటోందని కానీ ప్రతిపక్షాలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎంను అంత మాట అంటారా?

ఎంపీ నామా మాట్లాడుతూ, అసలు కాంగ్రెస్ వాళ్ళకు కేసీఆర్‌ను రైతు హంతకుడు అని అనడానికి నోరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. రేవంత్ సహా కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్‌పై చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్నేరు వాగు సమస్యపై గతంలో ఎన్నో సార్లు కాంగ్రెస్ ప్రభుత్వాలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందనీ, కానీ కేసీఆర్ శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులే నరరూప హంతకులు అని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ వల్ల ప్రజలకు మేలు కంటే నష్టమే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు విహార యాత్రలకు, హనీమూన్‌లకు వెళ్తారని, కేసీఆర్ మాత్రం రైతుల కోసం, ప్రజల కోసం మహారాష్ట్ర వెళ్లారని ఎంపీ రంజిత్‌రెడ్డి చెప్పారు. పార్లమెంటులో మాట్లాడేందుకు ఎన్నో అంశాలున్నాయని... అవన్నీ వదిలి కేసీఆర్ పర్యటనల గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతారని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఏం చేస్తున్నారో చెప్పాలని రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎన్నికల అఫిడవిట్‌పై దుష్ప్రచారం

- త్వరలో కోర్టుకు అన్ని విషయాలు నివేదిస్తా: మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కోర్టు పిటిషన్ల వెనుక రేవంత్‌రెడ్డి హస్తం ఉందని ధ్వజం




సాక్షి, హైదరాబాద్: తన ఎన్నికల అఫిడవిట్‌లో ఎలాంటి ట్యాంపరింగ్ జరగలేదని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పినా దుష్ప్రచారం జరుగుతోందని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కోర్టులో ఎవరు పిటిషన్ దాఖలు చేసినా కేసు నమోదు చేయడం సహజమన్నారు. ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మంగళవారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు నాంపల్లి కోర్టు పిటిషన్ పంపించినంత మాత్రాన ఏదో జరిగిందనే ప్రచారం కొందరు చేస్తున్నారన్నారు. తనకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన క్లీన్‌చిట్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేయకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని చెప్పారు. త్వరలో కోర్టుకు అన్ని విషయాలు నివేదిస్తామని, తమవైపే న్యాయం ఉందన్నారు. మోసగించడం, బ్లాక్‌మెయిలింగ్ ప్రవృత్తిగా కలిగిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజాక్షేత్రంలో తమను ఎదుర్కొనలేక కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేయిస్తున్నారని విమర్శించారు. సమాచార హక్కు చట్టాన్ని అడ్డు పెట్టుకుని కోట్లాది రూపాయలు సంపాదించిన రేవంత్‌రెడ్డి వక్ఫ్ భూముల విషయంలోనూ అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను వక్ఫ్‌భూములు కబ్జా చేసినట్లు నిరూపించకపోతే రేవంత్ టీపీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. కోర్టు కేసులతో నోట్లు సంపాదించగలిగినా ఓట్లు సంపాదించలేవంటూ రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బురద చల్లేందుకు ఒక్కటయ్యారు

మహబూబ్‌నగర్‌లో ఎవరికీ సాధ్యం కాని మెజారిటీతో తాను విజయం సాధించినందువల్లే తన మీద బురద జల్లేందుకు అన్ని పార్టీల్లోని కొందరు నేతలు ఒక్కటయ్యారని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. తనది క్యాస్ట్ తక్కువైనా క్యారెక్టర్ తక్కువ కాదని వ్యాఖ్యానించారు. చిల్లర గ్యాంగ్‌ను వెంటేసుకుని తనపై ఇష్టారీతిన మాట్లాడుతున్న రేవంత్ చిట్టా విప్పుతానని, రేవంత్ ఎక్కడ పోటీ చేసినా ఆయనకు ఓటేయొద్దని ప్రచారం చేస్తానని చెప్పారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ నాయకులది ముగిసిన అధ్యాయమని, బీసీలకు బీఆర్ఎస్ చేసినంత మేలు ఎవరూ చేయలేదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ఒత్తిడి

బీజేఎల్పీ భేటీలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలు లేవనెత్తి వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ శాసనసభాపక్షం నిర్ణయించింది. సభలో వివిధ సమస్యలు, ఇతర అంశాలపై చర్చ సందర్భంగా పార్టీ సభ్యులకు అవకాశమివ్వకపోతే తదనుగుణంగా స్పందించాలని, అధికారపార్టీ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. అధికారపక్షం అనుసరించే వైఖరిని బట్టి వ్యూహాలు మార్చుకోవాలనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. మంగళవారం బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన బీజేఎల్పీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. గురువారం నుంచి జరగనున్న సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించారు. అయితే ఈ భేటీ సాగుతుండగానే ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో కిషన్‌రెడ్డి మధ్యలోనే వెళ్లిపోయారు. ప్రభుత్వం అమలు చేయని హామీలు, వివిధ అంశాల్లో వైఫల్యాలు తదితర విషయాలను ఎత్తిచూపుతూ.. వీటన్నింటిపై చర్చకు అసెంబ్లీని కనీసం నెలరోజుల పాటు నిర్వహించాలని కోరుతూ రఘునందన్‌రావు లేఖ రాసిన విషయం తెలిసిందే. అయితే ఆరు నెలల కనీస గడువు ముగిసినందున తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వహిస్తున్న సమావేశాలైనందున..అధికార పక్షం మొక్కుబడిగా మూడు, నాలుగు రోజుల్లోనే సమావేశాలు ముగించే అవకాశాలున్నాయని బీజేఎల్పీ అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా ఈ భేటీ అనంతరం ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రజల గొంతుకగా, ప్రశ్నించే గొంతుకగా ప్రతి సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ ఫైనల్‌ కీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్‌–1 కొలువుల భర్తీలో భాగంగా జూన్‌ 11వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫైల్‌ 'కీ'ని కమిషన్‌ మంగళవారం సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని జూన్‌ 28వ తేదీన అందుబాటులోకి తీసుకువచ్చిన కమిషన్‌ దీనిపై అభ్యంతరాలను జూలై 1 నుంచి 5వ తేదీ వరకు స్వీకరించింది. ఆ తర్వాత అభ్యంతరాలను నిపుణుల కమిటీ దృష్టికి తీసుకువెళ్లి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కమిషన్‌ తుది 'కీ'ని ఖరారు చేసింది. దీనిని మంగళవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ 'కీ'పై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించేది ఉండదని, ఇదే ఫైనల్‌ కీ అని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. జూన్‌ 11న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 2,33,506 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

27న ఓయూ ఇంజనీరింగ్‌ పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్‌): ఓయూ క్యాంపస్‌ ఇంజనీరింగ్‌ కాలేజీలో ప్రత్యేకంగా కొనసాగుతున్న ఎంఈ, ఎంటెక్‌ ప్రవేశ పరీక్షలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్‌ శ్రీరామ్‌ వెంకటేశ్‌ మంగళవారం తెలిపారు. ఇంతవరకు దరఖాస్తు చేయని అభ్యర్థులు ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని..రూ.1,500 అపరాధ రుసుముతో 16 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 22వ తేదీ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు.

రేపు అంతర్జాతీయ సాహిత్య సమ్మేళనం 'ఉన్మేష' ప్రారంభం

న్యూఢిల్లీ: ఆసియాలోకెల్లా అతిపెద్ద అంతర్జాతీయ సాహిత్య సమ్మేళనం 'ఉన్మేష'ను ఈ నెల 3 నుంచి 6 వరకు మధ్యప్రదేశ్‌ రాజధాని భోపాల్‌లో నిర్వహించనున్నట్లు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్‌ కె. శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే వేడుకలో సంగీత నాటక అకాడమీ గిరిజన కళా నృత్యరీతులను ఉత్కర్ష్‌ పేరిట నిర్వహించనుందని చెప్పారు. ఈ కార్యక్రమాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభిస్తారని పేర్కొన్నారు. భారత్‌తోపాటు మరో 13 దేశాల నుంచి 100 భాషలకు చెందిన 575 మందికిపైగా రచయితలు ఈ వేడుకలో పాల్గొంటారన్నారు. తెలంగాణ గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌, ఛత్తీస్‌గఢ్‌ గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌, కేరళ గవర్నర్‌ ఆరిఫ్‌ మొహమ్మద్‌ ఖాన్‌లతోపాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరవుతారని పేర్కొన్నారు.

'మైనారిటీ గురుకుల టీచర్ల వేతనాలివ్వండి'

సాక్షి, హైదరాబాద్‌: మైనారిటీ గురుకుల జూనియర్‌ కళాశాలల్లో ఇంటర్‌ మొదటి సంవత్సరం విద్యార్థుల నమోదు తగ్గిందనే సాకుతో అధ్యాపకుల జూలై నెల వేతనాలు నిలిపివేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (టీఎస్‌ యూటీఎఫ్‌) తీవ్రంగా ఖండించింది. తక్షణమే అధ్యాపకుల వేతనాలు విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్‌ చేసింది. మైనారిటీ విద్యార్థులు 80% కంటే తక్కువ నమోదైన 81 కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు షోకాజ్‌ నోటీసులు జారీ చేసి, అధ్యాపకులందరికీ వేతనాలు నిలిపివేయాలని సొసైటీ కార్యదర్శి ఆదేశించారని టీఎస్‌యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి షఫీయుల్లాకు టీఎస్‌యూటీఎఫ్‌ నేతలు వినతిపత్రం అందజేశారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి

కేంద్రమంత్రి భూపేందర్‌ యాదవ్‌తో బీసీ నేతల చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఢిల్లీలో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి బీసీ సమస్యలపై చర్చించారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతంకు పెంచాలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ విద్యార్థులకు కేంద్రస్థాయి స్కాలర్‌ షిప్‌ పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పథకం జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నట్లు హాస్టళ్లు, గురుకుల పాఠశాల స్కీములు దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. కాగా బీజేపీ ప్రభుత్వం కులాల వారిని లెక్కలు తీయడానికి సుముఖంగా ఉందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఆర్‌.కృష్ణయ్య తెలిపారు. ఈ చర్చలలో గుజ్జ కృష్ణ తదితరులు ఉన్నారు.

'కడెం' కష్టమే

- ప్రాజెక్టు నిర్వహణపై చేతులెత్తేసిన నీటిపారుదలశాఖ
- పూర్తిగా ఆధునీకరించాల్సిందే..

సాక్షి, హైదరాబాద్‌: కడెం ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ చేతులెత్తేసింది. నిర్వహణతో నెట్టుకురాలేమని, తరచూ సమస్యలు ఉత్పన్నం అవుతాయని, గేట్లు మొరాయిస్తూనే ఉంటాయని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నుంచి దిగువకు 3.82 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే సామర్థ్యం ఉన్నా, గతేడాది జూలై 13న రికార్డు స్థాయిలో 5,09,025 క్యూసెక్కుల వరద పోటెత్తడంతో ప్రాజెక్టు తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంది. ప్రాజెక్టు ఎత్తు 700 అడుగులు కాగా అప్పట్లో ప్రాజెక్టుపై నుంచి 706 అడుగుల ఎత్తులో వరద ప్రవహించింది. గతనెల చివరి వారంలో భారీ వర్షాలు కురవడంతో కడెం ప్రాజెక్టుపై నుంచి 702 అడుగుల ఎత్తులో వరద పారింది.

గేట్ల మొరాయింపుతోనే సమస్య

గేట్లు మొరాయించడంతో వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు పంపించడం సాధ్యం కావడం లేదు. టాప్‌సీల్‌ గేట్ల కారణంగా వీటి నిర్వహణ సమస్యాత్మకంగా మారింది. గతేడాది వచ్చిన వరదలకు 4 గేట్లు మొరాయించడంతో వచ్చిన వరదను పూర్తి స్థాయిలో దిగువకు వదలడం సాధ్యం కాలేదు. మళ్లీ ఆ గేట్లకు మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. గత నెలలో వచ్చిన వరదల సమయంలోనూ మరో 4 గేట్లు మొరాయించడంతో ఇదే పరిస్థితి నెలకొంది. రెండు గేట్లకు అప్పటికప్పుడు మరమ్మతులు చేసి పైకి ఎత్తగలిగారు. మరో గేటుకు తర్వాత మరమ్మతులు పూర్తి చేశారు. చివరి గేటుకు మరమ్మతులు సాధ్యం కాలేదు. గేట్ల విడి భాగాలు లభించడం లేదు. ప్రత్యేకంగా ఆర్డర్‌ చేసి తయారు చేయించుకోవాలనుకున్నా, వీటి డిజైన్లు, డ్రాయింగ్స్‌ అందుబాటులో లేవు. కడెం ప్రాజెక్టు 18 గేట్లను పైకి ఎత్తడానికి కనీసం 2 గంటల సమయం పడుతుంది. అయితే కడెం నదిపరీవాహక ప్రాంతాల్లో ఆకస్మిక వరదలతో గంట వ్యవధిలో కడెం ప్రాజెక్టుకు గత నెలలో 3 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరింది.



ఆధునీకరణ ప్రతిపాదనలు ఇలా..

- కొత్తగా రేడియల్‌ గేట్లు ఏర్పాటు చేయాలి.
- అదనంగా 1.5 లక్షల నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేలా డిజైన్‌ చేయాలి.
- అదనపు గేట్లు, కొత్త స్పిల్‌వే నిర్మించాలి.
- గతేడాది డ్యామ్‌ సేఫ్టీ అండ్‌ రిహాబిలేషన్‌ ప్రోగ్రామ్‌(డీఎస్‌ఆర్‌పీ) కింద నిపుణులతో అధ్యయనం చేయించినా ఇదే సూచనలు చేసినట్టు సమాచారం.

మూడు చోట్ల పగుళ్లు..

ప్రాజెక్టు గేట్ల మధ్య పిల్లర్‌ తరహాలో ఉంటే కట్టడాన్ని పీయర్స్‌ అంటారు. కడెం ప్రాజెక్టుకు సంబంధించి మూడు పీయర్స్‌కు అర్ధ అంగుళం నుంచి అంగుళం నిడివితో పగుళ్లు వచ్చాయి. వీటికి సిమెంట్‌ మిశ్రమంతో మూసి గ్రౌటింగ్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. భవిష్యత్‌లో ప్రాజెక్టుకు భారీ వరదలు వస్తే పగుళ్లు వచ్చిన పీయర్స్‌ ఉధృతిని తట్టుకోవడం కష్టమేనని, అకస్మాత్తుగా కొట్టుకుపోతే దిగువన ఉన్న గ్రామాలు నీటమునిగే ప్రమాదముందని నీటిపారుదలశాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కుప్తీ కడితే పెద్దగా ప్రయోజనం ఉండదు..

ఎగువ పరీవాహక ప్రాంతంలో కుప్తీ డ్యాం నిర్మిస్తే కడెం ప్రాజెక్టుపై వరద ఉధృతి తగ్గుతుందని గతంలో నీటిపారుదల శాఖ భావించింది. అయితే కుప్తీ ప్రాజెక్టు నిర్మాణంతో కడెంపై పెద్దగా వరద ఒత్తిడి తగ్గదని, ఎగువ నుంచి వచ్చే వరదను ముందస్తుగా అంచనా వేసేందుకు అవసరమైన సమయం మాత్రం లభిస్తుందని తాజాగా నీటిపారుదలశాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది.

గురుకుల పరీక్షలకు 86.54 శాతం హాజరు

పక్కాగా ఏర్పాట్లు చేసిన టీఆర్‌ఈఐఆర్‌బీ

సాక్షి, హైదరాబాద్‌/ సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 9వేల ఉద్యోగాల భర్తీకి ఈనెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టీఆర్‌ఈఐఆర్‌బీ అధికారులు పక్కాగా ఏర్పాటు చేశారు. గురుకుల ఉద్యోగాల భర్తీలో ఈసారి కొత్తగా కంప్యూటర్‌ బేస్డ్‌ రిక్రూట్‌మెంట్‌ టెస్ట్‌ (సీబీఆర్‌టీ) విధానంలో పరీక్షలు నిర్వహించారు. గురుకుల బోర్డు ద్వారా నిర్వహిస్తున్న మొట్టమొదటి సీబీఆర్‌టీ పరీక్షలను టీఆర్‌ఈఐఆర్‌బీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు తొలిరోజు సజావుగా సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా 104 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభం కాగా మొదటి రోజున మూడు సెషన్లలో సగటున 86.54 శాతం అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజున మూడు సెషన్లలో ఆర్ట్‌ టీచర్‌ పేపర్‌–1, క్రాఫ్ట్‌ టీచర్‌ పేపర్‌–1, మ్యూజిక్‌ టీచర్‌ పేపర్‌–1 పరీక్షలు జరిగాయి. ఈ మూడు పరీక్షలకు మొత్తంగా 10,920 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా... కేవలం 9,450 మంది మాత్రమే హాజరయ్యారు.

ప్రశ్నపత్రం ఆంగ్లంలో ఇచ్చారని ఆందోళన

మంగళవారం ప్రారంభమైన పోటీ పరీక్షల్లో మొదటిరోజు ఆర్ట్‌, క్రాఫ్ట్‌, మ్యూజిక్‌ విభాగాలకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ప్రశ్నపత్రం పూర్తిగా ఆంగ్లంలో మాత్రమే ఇచ్చారు. నోటిఫికేషన్‌లో మాత్రం తెలుగు, ఆంగ్లంలో ప్రశ్నపత్రం ఇస్తామని ప్రకటించారని, ఇప్పుడు ఇలా చేయడమేమిటని పలుచోట్ల అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. పైగా సరిపడా కంప్యూటర్లు లేకుండానే ఆఫ్‌లైన్‌కు బదులు ఆన్‌లైన్‌ విధానంలో పరీక్షలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. ఈ విషయాలపై తాము కోర్టుకు వెళ్లనున్నట్లు అభ్యర్థులు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల కేటాయింపుపై గందరగోళం..

ఆప్షన్‌ ఇచ్చిన జిల్లా, చుట్టుపక్కల జిల్లాలు కాకుండా 200 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో పరీక్ష కేంద్రాలు కేటాయించడం పట్ల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మహిళా, గర్భిణి, బాలింత అభ్యర్థులు పరీక్షలను రాయలేని పరిస్థితి నెలకొంది. ఇతర అభ్యర్థులు సైతం వేల రూపాయలు చార్జీలకోసం వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు అభ్యర్థులు డిగ్రీ లెక్చరర్‌, జూనియర్‌ లెక్చరర్‌, పీజీటీ, టీజీటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీటికి పేపర్‌–1, పేపర్‌–2, పేపర్‌–3 రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షలకు సైతం ఒక్కో పరీక్షను ఒక్కో జిల్లాలో వందల కిలోమీటర్ల దూరం వెళ్లి రాయాల్సిన విధంగా కేంద్రాలు ఇచ్చారు.

గోదావరికి గోడలొద్దు

- భద్రాచలం, పరిసర గ్రామాల రక్షణపై ప్రత్యామ్నాయ ఆలోచనలు
- కేబినెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: గోదావరి వరదల నుంచి భద్రాచలంటౌన్‌, పరిసర గ్రామాలకు శాశ్వత రక్షణ కల్పించేందుకు నదికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. వరద రక్షణ గోడల నిర్మాణానికి భారీఎత్తున భూసేకరణ చేయడం తలకుమించిన భారం కానుందనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. నది ప్రవాహాన్ని కట్టడి చేస్తూ వరద రక్షణ గోడలు కడితే ఇతర సమస్యలొస్తాయని, ప్రత్యామ్నాయంగా ముంపు గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి శాశ్వత పరిష్కారం చూపాలని భావిస్తోంది. భద్రాచలం ఆలయం, పర్ణశాల, మణుగూరు భార జల ప్లాంట్‌ వంటివి తరలించడానికి వీలులేని కీలక నిర్మాణాల(క్రిటికల్‌ ఇన్‌స్టలేషన్స్‌)కు మాత్రమే వరద రక్షణ గోడలు నిర్మిస్తారు. సీఎం కేసీఆర్‌ అధ్యక్షతన సోమవారం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈనేపథ్యంలోనే నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రజత్‌కుమార్‌ మంగళవారం జలసౌధలో ఈఎన్‌సీలతో సమావేశమై వరద రక్షణ చర్యలపై చర్చించారు.

టెక్నికల్‌ కమిటీ ఏర్పాటు

గంగా, బ్రహ్మపుత్ర నదుల నుంచి రక్షణకు పరిసర ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయాలని భావిస్తోంది. ఇందుకు నీటిపారుదలశాఖ ఇంజనీర్లు, నిపుణులతో ఓ టెక్నికల్‌ కమిటీని నియమించనుంది. నెలరోజుల్లోగా ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

గోదావరి రివర్‌ కోర్సుకూ మార్పులు !

వరదల ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన చోట గోదావరి నది ప్రవాహ దిశ (రివర్‌ కోర్సు)లో స్వల్ప మార్పులు చేయాలని, ఇందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై పరిశీలన జరపాలని ప్రభుత్వం భావిస్తోంది.

శాశ్వత మరమ్మతులకు రూ.294 కోట్లు

ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న 890 చెరువులు, కాల్వలు, ఇతర జలవనరుల తాత్కాలిక మరమ్మతులకు రూ.30 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. శాశ్వత మరమ్మతులకు రూ.294 కోట్ల వరకు వ్యయం కానుందని నీటిపారుదల శాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది.

రాష్ట్రంలో 68 శాతం శిశువులకు తల్లి పాలు

వైద్య, ఆరోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: జాతీయ కుటుంబ ఆరోగ్య సమీక్ష గణాంకాల ప్రకారం శిశువులకు తల్లి పాలు అందించడంలో దేశ సగటు 63 శాతం ఉంటే, తెలంగాణలో మాత్రం 68 శాతంతో అగ్రగామిగా నిలిచిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాన్ని పురస్కరించుకుని తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించే లోగోను మంగళవారం సచివాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారత్‌ సీరమ్స్‌ అండ్‌ వ్యాక్సిన్స్‌ లిమిటెడ్‌ సీవోవో విశ్వనాథ్‌ స్వరూప్‌, ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. భవిష్యత్‌లో బిడ్డలకు రోగాలు రాకుండా కాపాడటంలో తల్లి పాలు కీలకపాత్ర వహిస్తాయన్నారు. అందుకే తల్లిపాలను ద్రవ బంగారంగా పిలుస్తారని పేర్కొన్నారు. నవజాత శిశువులకు పాలు పట్టడం ద్వారా తల్లికి కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో జరిగిన నష్టంపై అధ్యయనం



భద్రకాళి బండ్‌ తెగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వరంగల్‌ అర్బన్‌/హనుమకొండ అర్బన్‌: వరంగల్‌, హనుమకొండ జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల తాకిడికి నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులు మొదట హనుమకొండ, వరంగల్‌ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్‌, ప్రావీణ్య, బల్దియా కమిషనర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషాతో కలిసి నగరంలోని జవహర్‌ నగర్‌, పోతననగర్‌, భద్రకాళిబండ్‌ చెరువు, బొందివాగు ప్రాంతాలను పరిశీలించారు. ముంపు బాధితులతో మాట్లాడి వరదతీరు, నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలంలోని ఊకల్‌, కొండాపురం గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రహదారిని పరిశీలించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో ఇరు జిల్లాల అధికారులతో సమావేశమై చర్చించారు. హనుమకొండ జిల్లాలో 58 సెం.మీ. వర్షపాతం నమోదైందని, భారీ వర్షాల వల్ల మొత్తం 14 మండలాలు ప్రభావితమయ్యాయని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ వివరించారు. మొత్తంగా రూ.450 కోట్ల నష్టం వాటిల్లినట్లు కేంద్ర బృందానికి తెలిపారు. వరంగల్‌ జిల్లాలోని 13 మండలాల్లో వర్షాలు, వరదల వల్ల నష్టం వాటిల్లినట్లు కలెక్టర్‌ ప్రావీణ్య తెలిపారు. కాగా, గ్రేటర్‌ వరంగల్‌లో సుమారు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కమిషనర్‌ వివరించారు.

సెప్టెంబర్‌ 15న టెట్‌

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో టెట్‌ అర్హత సాధించినవారు 4,19,030 మంది ఉన్నారు.

డీఎడ్‌ అభ్యర్థులకు పేపర్‌–1

- టెట్‌ రెండు పేపర్లుగా ఉంటుంది. డిప్లొమా ఇన్‌ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌ పూర్తి చేసినవారు పేపర్‌–1 రాసేందుకు అర్హులు. వీరి ఇంటర్‌లో 50 శాతం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు అయితే 45 శాతం) మార్కులు పొంది ఉండాలి.

పేపర్‌–2

- బీఏ, బీకాం, బీఎస్సీ 50 శాతం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు 45 శాతం)తోపాటు బీఈడీ చేసిన అభ్యర్థులు పేపర్‌–2కు అర్హులు. వీరికి పేపర్‌–1 కూడా రాసేందుకు కూడా అవకాశం కల్పించారు.

పరీక్ష విధానం ఇలా..

- పేపర్‌–1లో 150 మల్టిపుల్‌ చాయిస్‌ ప్రశ్నలుంటాయి. చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ పెడగాజీ, లాంగ్వేజి–1, లాంగ్వేజి–2 (ఇంగ్లిష్‌), మేథమెటిక్స్‌, ఎన్విరాన్‌మెంటల్‌ స్టడీస్‌ నుంచి ప్రతీవిభాగంలో 30 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒకమార్కు.
- పేపర్‌–2లో చైల్డ్‌ డెవలప్‌మెంట్‌, పెడగాజీ(30), లాంగ్వేజ్‌–1 (30), లాంగ్వేజ్‌–2 (30), మ్యాథ్స్‌, సైన్స్‌ టీచర్లకు మ్యాథ్స్‌, సైన్స్‌, సోషల్‌ టీచర్లకు సోషల్‌ సబ్జెక్ట్‌ 60 మార్కులకు ఉంటుంది. మొత్తం 150 మార్కులకు పేపర్‌ మల్టిపుల్‌ చాయిస్‌లోనే ఉంటుంది. ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్‌ నుంచే ప్రశ్నలు వస్తాయి.

అర్హత మార్కులెన్ని?

150 మార్కుల ప్రశ్నపత్రంలో జనరల్‌ కేటగిరీ అభ్యర్థులు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం మార్కులు సాధిస్తే టెట్‌ అర్హులుగా పరిగణిస్తారు. దివ్యాంగులు 75 శాతం వైకల్యం కలిగి ఉండాలి.

లక్షల్లో ఉత్తీర్ణులు.. వేలల్లో పోస్టులు

టెట్‌ సరే..టీచర్‌ అయ్యేదెప్పుడో ● విద్యాశాఖలో 22 వేల పోస్టులు ఖాళీ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా టెట్‌లో అర్హత సాధించినవారు 4,19,030 మంది ఉన్నారు. అయితే విద్యాశాఖలో ఉపాధ్యాయ ఖాళీలు కేవలం 22 వేల వరకే ఉన్నాయి. లక్షల్లో ఉత్తీర్ణులు అయ్యి ఉంటే వేలల్లో పోస్టులు భర్తీ చేస్తే ప్రయోజనం ఏమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడిరాష్ట్రంలో టెట్‌, డీఎస్సీ ఒకేసారి నిర్వహించేవారు. దీంతో కొంతమంది టీచర్‌ ఉద్యోగాలు పొందేవారు. వాస్తవానికి 2022లో భారీ నోటిఫికేషన్లు వస్తాయని ప్రభుత్వం ఆశలు కల్పించింది. దీంతో ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్నవారు కూడా ఉద్యోగాలు మానేసి టీఆర్‌టీ (టీచర్‌ రిక్రూట్‌మెంట్‌ టెస్ట్‌) కోసం సన్నద్ధమయ్యారు. కానీ వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. టీచర్‌ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్‌ రానేరాలేదు. ఈ నేపథ్యంలో యువతలో నెలకొన్న అసంతృప్తిని దృష్టిలో ఉంచుకునే టెట్‌ను ముందుకు తెచ్చారనే విమర్శలొస్తున్నాయి.

కోర్టు స్టేతో ఆగిన పదోన్నతుల ప్రక్రియ

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నట్టు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఎస్‌జీటీలను స్కూల్‌ అసిస్టెంట్లు, స్కూల్‌ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తే దాదాపు 12 వేల పోస్టులు ఖాళీ అవుతాయి. ఉద్యోగ విరమణ వల్ల ఖాళీ అయిన పోస్టులు, కొత్తవి కలుపుకుంటే 22 వేల వరకూ ఉంటాయని అంచనా. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2022లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టారు. అయితే ఇది పూర్తవ్వకుండానే కోర్టు స్టేతో ఆగిపోయింది. కనీసం పదోన్నతులు అయినా ఇవ్వొచ్చని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. పదోన్నతులు, బదిలీలు చేపడితే తప్ప ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీ సాధ్యం కాదని విద్యాశాఖ స్పష్టం చేస్తోంది. నియామకాలు చేపట్టకపోవడంతో రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించినా, అనేక మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎన్నికల వేళ నోటిఫికేషన్‌ ఇవ్వడం సాధ్యం కాకపోతే తమ కలలు కల్లలుగానే మిగిలిపోతాయని నిరుద్యోగులు అంటున్నారు.

టీఆర్‌టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి

టెట్‌ నిర్వహణను స్వాగతించాల్సిందే. ఇదే క్రమంలో ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోతే టెట్‌ ఉత్తీర్ణులైనా ప్రయోజనం ఏముంటుంది. టీచర్‌ పోస్టుల భర్తీపై గతంలో సీఎం అసెంబ్లీలోనే హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్‌ వచ్చేలోగా టీఆర్‌టీపై దృష్టి పెడితే నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. టీచర్‌ పోస్టుల కోసం 4 లక్షల మంది ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం తెలుసుకోవాలి.

– రావుల రామ్మోహన్‌ రెడ్డి (తెలంగాణ రాష్ట్ర డీఎడ్‌, బీఎడ్‌ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రవేశాలు అంతంతేగా..
జీతాలు నిలిపేస్తున్నాం!

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎంఆర్‌ఈఐఎస్‌) వింత చర్యలకు దిగింది. సొసైటీ పరిధిలోని గురుకుల జూనియర్‌ కాలేజీల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఆశాజనకంగా లేకపోవడంతో ఆ కోపాన్ని ఆయా కాలేజీల ప్రిన్స్‌పాళ్లు, అందులో పనిచేస్తున్న జూనియర్‌ లెక్చరర్లపై చూపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 204 గురుకుల జూనియర్‌ కాలేజీలకుగాను 81 కాలేజీల్లో ఇంటర్‌ ఫస్టియర్‌ అడ్మిషన్లు ఆశాజనకంగా లేవంటూ అక్కడి ప్రిన్స్‌పాళ్లు, జూనియర్‌ లెక్చరర్లకు షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. తక్కువ అడ్మిషన్లు జరిగినందున వేతనాలను విత్‌హెల్డ్‌లో పెట్టింది. సొసైటీ చర్యపట్ల ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లతో బోధకులకు సంబంధం ఏమిటి?

గురుకుల విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియకు ప్రత్యేక పద్ధతులున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఆయా సొసైటీలు అర్హత పరీక్షలు నిర్వహించి మెరిట్‌ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. కానీ మైనారిటీ గురుకుల సొసైటీ పరిధిలో అడ్మిషన్ల ప్రక్రియ అంతా రహస్యంగా సాగుతోంది. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులను కాలేజీలకు ఫార్వర్డ్‌ చేస్తుండటంతోపాటు నేరుగా అడ్మిషన్ల కోసం వచ్చే వారిని చేర్చుకుంటున్నారని సమాచారం. అయితే కొత్త అడ్మిషన్లు చేయించాలని, చాలాచోట్ల సీట్లు ఖాళీగా ఉంటున్నాయనే ఆరోపణలు మైనారిటీ గురుకుల సొసైటీ పరిధిలో ఉన్నాయి. కొన్ని సెక్షన్లలో కేవలం సింగిల్‌ డిజిట్‌లోనే విద్యార్థులు ఉంటున్నారని తెలిసింది. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు సైతం పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అడ్మిషన్లు పెంచాలంటూ బోధన సిబ్బందిపై సొసైటీ ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే షోకాజ్‌ నోటీసులు జారీ చేయడమే కాకుండా వారి వేతనాలను విత్‌హెల్డ్‌లో పెట్టినట్లు తెలియవచ్చింది. మైనారిటీ సొసైటీ పరిధిలోని ఉద్యోగులకు వేతనాల కంటే ముందే పే–స్లిప్‌లు జనరేట్‌ అవుతాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలో షోకాజ్‌ నోటీసులు జారీ అయిన సిబ్బందికి మినహా మిగతా వారికి పే–స్లిప్‌లు ఆన్‌లైన్‌లో జనరేట్‌ అయినట్లు తెలిసింది. ఈ అంశంపై యూటీఎఫ్‌ నేతలు జంగయ్య, రవి తదితరులు సొసైటీ కార్యదర్శి షఫీయుల్లాను కలిసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

మైనారిటీ గురుకుల సొసైటీ వింత పోకడ

- జూనియర్‌ కాలేజీల్లో అడ్మిషన్లకు లెక్చరర్ల వేతనాలతో ముడి
- 81 కాలేజీల్లో ప్రవేశాలు సరిగ్గా లేవంటూ ప్రిన్సిపాళ్లకు షోకాజ్‌ నోటీసులు
- వారి జీతాలు నిలుపుదల చేసినట్లు వెల్లడి.. మండిపడుతున్న ఉద్యోగులు

అత్యంత దారుణం..

కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉందంటూ జూనియర్‌ లెక్చరర్లు, ప్రిన్స్‌పాళ్ల వేతనాలను నిలిపివేయడం అత్యంత దారుణం. ప్రస్తుతం ఉద్యోగులకు వేతనాలు రానప్పటికీ... మైనారిటీ సొసైటీ పరిధిలో పే–స్లిప్‌లు జనరేట్‌ కాకపోవడం, షోకాజ్‌ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏ ఒక్క ఉద్యోగికి వేతనాన్ని ఆపినా ఊరుకోం.

– కొకుట్ల యాదయ్య, అధ్యక్షుడు (ఆల్‌ తెలంగాణ గవర్నమెంట్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌)

సహాయక చర్యలేం చేపట్టారు..?

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలి. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి..' అని సూచించింది.

ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం

'కేటాయించిన రూ.500 కోట్లు ఎలా పంపిణీ చేస్తారు? కడెం ప్రాజెక్టు పరిస్థితి ఏంటి? వర్షాలు, వరదలపై కేంద్రం ఎప్పుడు హెచ్చరించింది? రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు సహాయక చర్యలు ప్రారంభించింది?..' అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. 'గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యల గురించి కూడా నివేదించాలి. నిర్మల్‌ జిల్లాలోని కడెం ప్రాజెక్టు దిగువన ఉన్న ప్రాంతవాసులు విషయంలో తీసుకున్న చర్యలు వివరించాలి. గోదావరి పరీవాహక జిల్లాల్లో ఏం సహాయక చర్యలు తీసుకున్నారో చెప్పాలి. వరద బాధితులకు కనీస సౌకర్యాల కల్పనకు తీసుకున్న చర్యలు వివరించాలి. వరద బాధిత కుటుంబాల్లోని వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఆహారం, వసతి వంటి ఏర్పాట్లు ఏం చేశారో చెప్పాలి..' అని ఆదేశించింది. ఈ మేరకు ఒక అఫిడవిట్‌ దాఖలు చేయాలని, భవిష్యత్‌ వరదలు దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ముందస్తు నిర్దిష్టమైన శాశ్వత ప్రణాళికపై మరో అఫిడవిట్‌ దాఖలు సూచించింది. జనం కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదిక స్పందించాలని హితవు పలికింది. తాము అవసరమైతే గ్రామాలవారీగా కూడా పరిశీలన చేసి విచారణ చేస్తామని చెప్పింది. తదుపరి విచారణను 4వ తేదీకి వాయిదా వేసింది.

నివేదికకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు

పిటిషనర్‌ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌ వాదనలు వినిపించారు. 'క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు, ప్రభుత్వం దాఖలు చేసిన నివేదికకు పొంతన లేదు. ఏదో కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం నివేదిక అందజేసినట్లు ఉంది. తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో విపత్తు ప్రమాదం పొంచి ఉందని గత నెల 19న కేంద్ర ప్రభుత్వం హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం 28వ తేదీ వరకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడేందుకు జాగ్రత్తలు తీసుకోని కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది..' అని కోర్టుకు తెలిపారు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా పోరంచలో ఐదుగురు చనిపోతే నివేదికలో కనీస ప్రస్తావన లేదని అన్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోకపోవడంతో వరద నీరు ప్రాజెక్టు పైనుంచి పారిందని, ఒకవేళ ప్రాజెక్టు తెగితే దిగువనున్న 178 గ్రామాల్లోని ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

రూ.500 కోట్లు కేటాయించాం..

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్‌ పరిషద్‌ వాదనలు వినిపిస్తూ.. 'ఎయిర్‌ఫోర్స్‌, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్‌ సేవల్ని ప్రభుత్వం వినియోగిస్తోంది. బాధితుల కోసం అన్ని రకాల సహాయక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రూ.500 కోట్లు కేటాయించాం. ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా పూర్తి వివరాలను నివేదిస్తాం' అని పేర్కొన్నారు.

భారీ వర్షాలతో తీరని నష్టం

ప్రభుత్వ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలకు 240 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 6,443 ఇళ్లకు పాక్షిక నష్టం వాటిల్లింది. 1,59,960 ఎకరాల్లో పంటలు వరద బారిన పడ్డాయి. భూములు ముంపునకు గురికావడంతో 57,088 మంది రైతులు నష్టపోయారు. సోయాబీన్‌, చెరుకు, కందులు, మినుములు వంటి పంటలు నీటమునిగాయి. 190 నీటిపారుదల చెరువులకు గండ్లు పడ్డాయి. 168 రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్‌ స్తంభాలు నేలకొరిగాయి.



సహనం అనేది అతి గొప్ప ప్రార్థన.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 2 ఆగస్టు 2023

సైన్యం చెరలో నైజర్

అగ్రరాజ్యాల చంపుడు పందెంలో దశాబ్దాలుగా చిక్కిశల్యమైన పశ్చిమ ఆఫ్రికా దేశాలు ఆ నీడలోనే ఇప్పటికీ బతుకీడుస్తున్నాయని నైజర్‌లో నాలుగురోజుల క్రితం చోటుచేసుకున్న సైనిక తిరుగుబాటు నిరూపించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు మహమ్మద్ బజూమ్‌ను అధికారం నుంచి పడగొట్టి ఆయన భద్రతా వ్యవహారాల చీఫ్ ఒమర్ చియానీ పీఠం అధిష్ఠించాడు. అతనికి రష్యా అధ్యక్షుడు పుతిన్ మద్దతుందని అంటున్నారు. అవిద్య, ఆకలి, ఆర్థిక అసమానతలు పుష్కలంగా ఉన్నచోట నియంతలదే పైచేయి అవుతుందని చరిత్రలో తరచు రుజువవుతున్న సత్యమే. తూర్పున ఎర్ర సముద్ర తీరంలోని సూడాన్‌తో మొదలుపెట్టి, పడమట అట్లాంటిక్ మహాసముద్ర తీరానికి చేరువలో వుండే గినియా బిసావూ మధ్య వరసగా కొలువుదీరిన ఎనిమిది దేశాలున్న ప్రాంతాన్ని సహేల్ ప్రాంతం అంటారు. వీటిల్లో మిగిలినవన్నీ సైనిక పాలకుల పరం కాగా... తాజాగా నైజర్ సైతం ఆ ఖాతాలో చేరింది. తన అండదండలు పుష్కలంగా ఉన్న బజూమ్ ఉన్నట్టుండి అదృశ్యం కావటం, రెండురోజుల తర్వాత తిరుగుబాటు ప్రకటన రావటం అమెరికాకు మింగుడు పడని అంశం. పశ్చిమాసియా, దక్షిణాసియాలతో పోల్చినా జీహాదిస్టుల బెడదను అధికంగా ఎదుర్కొంటూ నిత్యం నెత్తురోడుతున్న ప్రాంతం సహేల్ ఆఫ్రికా. అత్యంత వెనకబడిన ప్రాంతం కావటం వల్ల అక్కడి మరణాలు మీడియాకు పట్టవుగానీ... నిరుడు ఉగ్రవాదుల హింసాకాండకు ప్రపంచ వ్యాప్తంగా బలైన 6,701 మంది అభాగ్యుల్లో 43 శాతం మంది అక్కడివారే!

సహేల్ ప్రాంతం గురించి ఐక్యరాజ్యసమితి వెబ్‌సైట్ వెతికితే దాన్ని 'అవకాశాల గడ్డ'గా అభివర్ణిస్తుంది. ప్రపంచంలోనే యువత అధికంగా ఉన్న ప్రాంతమని చెబుతుంది. ఆ ప్రాంతానికి చినుకు గగనం కావొచ్చు. అక్కడి నేలపై పంటలు పెద్దగా పండకపోవచ్చు. కానీ దాని లోలోపల యురేనియంతో సహా అపురూపమైన ఖనిజాలున్నాయి. విస్తృతంగా జలాశయాలున్నాయి. పునరుత్పాదక ఇంధన వనరులకు అది నిలయం. జనాభాలో 64.5 శాతం మంది ఇరవై అయిదేళ్లలోపువారే. ఇవన్నీ సహేల్ ప్రాంతానికి శాపంగా కూడా మారాయి. అమెరికా, ఫ్రాన్స్‌లు ఈ ప్రాంతంపై పట్టుబిగించేందుకు బాహాటంగా ప్రయత్నిస్తుంటే జర్మనీ, ఇటలీ, చైనా వంటివి చడీచప్పుడూ లేకుండా ఆ పని చేస్తుంటాయి. తిరుగుబాటు జరిగే సమయానికి నైజర్‌లో 1,100 మంది అమెరికా సైనికులున్నారు. అవసరాన్నిబట్టి డ్రోన్ దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక స్థావరం ఉంది. కానీ తన మద్దతుదారును అది కాపాడుకోలేకపోయింది. నిజానికి 2021లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే బజూమ్ సైనిక జనరళ్లకు లక్ష్యంగా మారారు. కానీ అప్పట్లో ఆయన్ను వ్యక్తిగత భద్రతా బలగాలు కాపాడాయి. ఇప్పుడు ఆ బలగాలే అదును చూసి కాటేశాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా, సోవియెట్ యూనియన్‌ల మధ్య పశ్చిమ ఆఫ్రికా దేశాల వనరులను చేజిక్కించుకునేందుకు సాగిన పోటీతో సగటున ప్రతి 55 రోజులకూ ఒక సైనిక తిరుగుబాటు ప్రయత్నం జరిగిందని, అందులో చాలా భాగం విజయవంతమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. తమ ప్రయోజనాలు నెరవేరే వరకూ స్థానికంగా ఏ పాలకులున్నా, వారు ఎలా పాలిస్తున్నా అగ్రరాజ్యాలు పట్టించుకోవు. ఆ ప్రయోజనాలు దెబ్బతింటే మాత్రం సైనిక నియంతలను గద్దె దించేందుకు ప్రజాస్వామ్య మంత్రాన్ని పఠిస్తాయి. అంతక్రితం దశాబ్దాలపాటు అగ్రరాజ్యాల చెరలో చిక్కుకున్న పశ్చిమ ఆఫ్రికా దేశాలు ఆ తర్వాత ప్రజాస్వామ్యానికి చేరువైనా, నయా ఉదారవాద ఆర్థిక విధానాల పడగనీడలోనే ఆ ప్రభుత్వాలు కొనసాగటం వల్ల స్థానికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. పేరుకు ఎన్నికలేగానీ పెత్తనమంతా స్థానికంగా ఉండే సాయుధ ముఠాలదే! ఆ ముఠాల ప్రాపకంతోనే ఏ పాలకులైనా ఎన్నికల్లో గద్దెనెక్కుతారు. కూడు, గూడు, విద్య, వైద్యం, మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలోనూ, ఉపాధి చూపటంలోనూ ఆ పాలకులు ఘోరంగా విఫలం కావటం తరచు కనబడేదే! ప్రజల్లో ఆ పాలకుల పట్ల ఉండే అసంతృప్తిని సైన్యంలోని ఉన్నతాధికారవర్గం సాకుగా తీసుకుని అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. పర్యవసానంగా ముందో వెనకో ఆ దేశాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి సైనిక కుట్రలకు తలవంచాయి.

సహేల్ ప్రాంతంలో తిరుగుబాట్లు చేసినప్పుడల్లా సైనిక నియంతలు చెప్పే మొదటి కారణం అవినీతి. ఇప్పుడు నైజర్‌లో గద్దెనెక్కిన ఒమర్ చియానీ దానికి ఉగ్రవాద బెడదను కూడా జోడించాడు. దేశంలో ఉగ్రవాదం ముప్పు పెరగటం వల్ల సైన్యం జోక్యం తప్పనిసరైందని ప్రకటించాడు. నిజానికి వేరే దేశాల 'ప్రజాస్వామ్య' పాలకులతో పోలిస్తే బజూమ్ ఎంతో నయం. అల్ కాయిదా, ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల దాడులను పూర్తిగా అదుపు చేయలేకపోయినా, వాటిని చాలా మేరకు నియంత్రించారు. పాశ్చాత్య దేశాల మద్దతు పుష్కలంగా ఉండటంతో నిధులు కూడా దండిగానే వచ్చాయి. విద్య, వైద్యంతో పాటు ఉపాధి కల్పన చర్యలు ప్రారంభమయ్యాయి. వాటి ఫలితాలు కూడా ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. బజూమ్‌కు సైన్యం మద్దతు దండిగా ఉన్నదని, దేశంలో రాజకీయ సుస్థిరత ఏర్పడిందని అందరూ అనుకుంటుండగానే చియానీ రూపంలో సైనిక నియంత అవతరించాడు. సహేల్ ప్రాంతంలోని వేరే దేశాల్లో ఉగ్రవాద బూచిని చూపి, పాలకుల భద్రతకు పూచీపడుతూ పబ్బం గడుపుకుంటున్న కిరాయి సైనిక ముఠా నాయకుడు ప్రిగోజిన్ ఇప్పుడు నైజర్‌ను ఉద్ధరిస్తానని ముందుకొస్తున్నాడు. అమెరికా, రష్యాల మధ్య సైతం ముందుముందు ఇక్కడ ఘర్షణ రాజుకునే ప్రమాదం ఉంది. ఇన్నిటిమధ్య నైజర్ మనుగడ ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.10.24 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** శ్రవణం ప.3.33 వరకు, తదుపరి ధనిష్ఠ **వర్జ్యం:** రా.7.17 నుండి 8.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.40 నుండి, 12.30 వరకు, **అమృత ఘడియలు:** తె.4.11 నుండి 5.43 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ప్రపంచ వాణిజ్యంలో ఎక్కడున్నాం?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

జూన్ నెలలో దేశ ఎగుమతులు 22 శాతం తగ్గిపోయినట్టు తాజా నివేదికలు చెబుతున్నాయి. గూడ్స్ మార్కెట్లో భారత్ వాటా 2 శాతమే. ఐర్లాండ్ లాంటి చిన్న దేశాల కంటే ఇది తక్కువ. చైనా వాటా ఏకంగా 12.5 శాతం. ప్రపంచంలోని ఏ దేశానికైనా ఇది అత్యధికం. దేశంలోని చాలా పరిశ్రమలు స్థానిక అవసరాలు తీరి వస్తువులు అదనంగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతుల గురించి ఆలోచిస్తున్నాయి. సహజ సిద్ధంగా ఎగుమతులకు మొగ్గు చూపడం లేదు. దేశం ఏదో ఒక భారీ ప్రాంతీయ వ్యాపార గ్రూపులో భాగంగా లేకపోవడం ఎగుమతులు పెరగకపోవడానికి మరో కారణం. అయితే ఐటీ, వ్యాపార సేవల విషయంలో మాత్రం చాలా మెరుగ్గా ఉన్నాం. ఇది సానుకూలాంశం.

విదేశాలతో వ్యాపారం చేయడం భారత్‌కు చాలా పాతవిద్య. ఆర్థిక వ్యవస్థ గణనీయంగా, వేగంగా క్షీణించిన వలస పాలకుల ఏలుబడిలోనూ చైనా సహా ఇతర ఇరుగు పొరుగు దేశాలతో విదేశీ వ్యాపారాన్ని కొనసాగించిన ఘనత మనది. అయితే శతాబ్దాల విదేశీ వ్యాపార అనుభవమున్నప్పటికీ పలు దశాబ్దాలుగా విదేశీ వ్యాపారం దేశ ఆర్థిక వ్యవస్థలో అతి బలహీనమైన లంకెలా మిగిలిపోయింది. 2022–23లో వర్తకపు సరుకుల ఎగుమతులు 45,000 కోట్ల డాలర్లకు చేరడంతో విదేశీ వ్యాపారం పరిస్థితి కొంత మెరుగైనట్లు కనిపించింది. కానీ ఈ రికార్డు స్థాయి వ్యాపారం కోవిడ్ తదనంతరం అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ వల్లనే అని తేలింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వ్యాపారం మళ్లీ తగ్గిపోయింది. జూన్ నెలలో ఎగుమతులు 22 శాతం తగ్గిపోయినట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనానికి, అధిక ద్రవ్యోల్బణం, కఠినమైన ద్రవ్య విధానాలకు ఇది నిదర్శనం.

అయితే ఇక్కడ ఓ సానుకూల అంశం లేకపోలేదు. సేవల ఎగుమతులు ఇప్పటికీ పెరుగుతున్నాయి. ఈ విషయంలో భారత వాణిజ్యం ప్రతికూల పరిస్థితులను కాదని ముందుకు సాగుతున్నది. సమీప భవిష్యత్తులోనే కాకుండా దీర్ఘకాలంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చు. సేవల రంగంలో భారత్ భాగస్వామ్యం రికార్డు స్థాయిలో 4.9 శాతానికి చేరుకున్నట్లు మోర్గన్ స్టాన్లీ ఇటీవల విడుదల చేసిన ఓ నివేదిక తెలియజేయడం చెప్పుకోవాల్సిన అంశం. ఇది ప్రధానంగా ఐటీ సేవల (46 శాతం) వల్లనే. దీంతోపాటు వ్యాపార సేవలు కూడా 24 శాతంతో తమదైన ముద్ర వేశాయి.

సేవల విషయంలో పరిస్థితి ఇలా ఉంటే, వస్తువుల విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నం. వస్తువుల ఎగుమతులు అమెరికా, యూరప్ వంటి మార్కెట్ల డిమాండ్లపై అధికంగా ఆధారపడి ఉన్నాయి. గూడ్స్ మార్కెట్లో భారత్ వాటా కేవలం రెండు శాతం మాత్రమే. ఐర్లాండ్ లాంటి చిన్న దేశాల కంటే ఇది తక్కువ. మన పొరుగునే ఉన్న చైనా వాటా ఏకంగా 12.5 శాతం. ఒక దేశానికి సంబంధించి ప్రపంచంలోనే ఇది ఎక్కువ.

శేష ప్రశ్నలు ఎన్నో...

దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో పరిశ్రమలు ఉన్నాయి. అంటే అంతర్జాతీయ వాణిజ్యంలో మన పాత్ర పెంచుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఎగుమతుల విషయంలో వెనుకబడి ఉండేందుకు కారణాలేమిటి? మొదటిది... దేశీ మార్కెట్ ఒకటి లేకపోవడం. దేశీ మార్కెట్ ఒకటి ఉండి ఉంటే స్థానిక చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు ఇక్కడే వ్యాపారం చేసుకునేందుకు వీలు ఏర్పడుతుంది. వ్యయ ప్రయాసలకు ఓర్చి విదేశీ మార్కెట్లను వెతుక్కునే శ్రమ తగ్గుతుంది. దేశంలో కొన్ని పరిశ్రమలు కేవలం ఎగుమతులపైనే దృష్టి పెట్టి



పనిచేస్తున్నాయి. వీటిల్లో కొన్ని సంప్రదాయ రంగాలకు చెందినవీ ఉన్నాయి. రెడీమేడ్ గార్మెంట్స్, హస్తకళలు, జ్యువెలరీ, రంగురాళ్ల వంటివి. వీటితోపాటు ఫార్మా, ఇంజినీరింగ్ వస్తువులు, రిఫైన్డ్ నూనె ఉత్పత్తులు కూడా పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ చాలా పరిశ్రమలు స్థానికంగా మార్కెట్ అవసరాలు తీరి వస్తువులు అదనంగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతుల గురించి ఆలోచిస్తున్నాయి. ఇంకోలా చెప్పాలంటే స్థానిక పరిశ్రమలు సహజ సిద్ధంగా ఎగుమతులకు మొగ్గు చూపడం లేదన్నమాట.

ఎగుమతులు పెరగకపోవడానికి రెండో లోపం... దేశం ఏదో ఒక భారీ ప్రాంతీయ వ్యాపార గ్రూపులో భాగంగా లేకపోవడం. ప్రపంచ వాణిజ్య సంస్థపై మనం చాలాకాలం ఆశలు పెట్టుకున్నాం. ఎదుగుతున్న మార్కెట్లకు కొన్ని లాభాలు అందిస్తుందని ఆశపడ్డాం. ఈ క్రమంలో ప్రాంతీయ లేదా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు చేసుకునే సమయం కాస్తా మాయమైపోయింది. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్–ఆర్సీఈపీ) నుంచి వైదొలగాలన్న నిర్ణయం కూడా ఆచితూచి తీసుకున్నదే. ఏదో ఒక దేశం ద్వారా చైనా తన చౌక వస్తువులను దేశంపై గుమ్మరిస్తుందన్న ఆందోళన కూడా ఉండింది. అయినా కూడా... ఇతర ప్రాంతీయ వాణిజ్య గ్రూపుల్లోకి చేరే దిశగా చాలాకాలం క్రితమే ప్రయత్నాలు చేసి ఉండాల్సింది. ఉదాహరణకు... పదకొండు మంది సభ్యులున్న 'కాంప్రహెన్సివ్ అండ్ ప్రోగ్రెసివ్ అగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్' (సీపీటీపీపీ). ఈ వ్యాపార వర్గంలో చేరి ఉంటే దేశ విదేశీ వ్యాపారం, ఎగుమతులు పెరిగేందుకు తగిన సహకారం లభించి ఉండేది. ఇప్పటికీ సమయం మించిపోలేదు. ఆస్ట్రేలియా, జపాన్, మలేసియాలు భాగస్వాములుగా ఉండి... అతి జాగ్రత్తగా చైనా లేకుండా చేసుకున్న వ్యాపార వర్గంలో చేరేందుకు భారత్ ప్రయత్నించాలి.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల విషయానికి వస్తే... యూరోపియన్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం పదేళ్లుగా అమల్లో లేకుండా పోయింది. భారత్‌కున్న అతి పెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటైన ఈ ప్రాంతంతోనూ వాణిజ్య ఒప్పందం విషయమై ఇటీవలే చర్చలు మొదలయ్యాయి. అదృష్టవశాత్తూ దేశంలోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భాగం కావడం దేశ హితం కోసమే అన్న భావన ప్రబలుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియాలతో ఇలాంటి ఒప్పందాలు ఇటీవలే కుదరడం గమనార్హం. గల్ఫ్ కో–ఆపరేషన్ కౌన్సిల్, యునైటెడ్ కింగ్‌డమ్‌లతోనూ ఇదే తరహా ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు వేగవంతమయ్యాయి.

మళ్లీ వెనక్కి?

యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం ఏడేళ్లుగా స్తబ్ధుగా ఉంది. ఒప్పందం చేసుకోవడంలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు చర్చలు ఒక్కటే మార్గమని ఇటీవలే గుర్తించి ఆ దిశగా ముందుకు కదులుతూ ఉండటం హర్షించదగ్గ విషయం. పర్యావరణం, లేబర్, డిజిటల్ వాణిజ్యం వంటి వాణిజ్యేతర అంశాలను కూడా ఇప్పుడు చర్చిస్తున్నారు. యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదిరితే చాలా లాభాలుంటాయి. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్ వంటి హైటెక్ దేశాల్లో మన దేశానికి చెందిన నిపుణులు పనిచేయడం సులువు అవుతుంది.

చివరగా... ఎగుమతులు మరింత జోరు అందుకునేందుకు ఉన్న ఇంకో అవరోధం ఇటీవలి కాలంలో పెరిగిపోయిన రక్షణాత్మక ధోరణులు. దిగుమతులకు సంబంధించి ఉన్న అడ్డంకులను తొలగించాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశీ తయారీదారుల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకునేందుకు భారతీయులు ఇప్పుడు సిద్ధంగానే ఉన్నారు. స్థానికంగా పారిశ్రామిక రంగానికి సహాయం అవసరమని అనుకుంటే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల వంటివి ఉండనే ఉన్నాయి. దిగుమతి చేసుకునే వస్తువులు మరింత ఖరీదు చేయడం కంటే దేశీ తయారీ రంగం ఊపందుకునేందుకు ఈ ప్రోత్సాహకాలు సరిపోతాయి. ఆత్మ నిర్భర్ భారత్ విధానం కూడా గతంలోని ఇంపోర్ట్ సబ్‌స్టిట్యూషన్(దిగుమతికి ప్రత్యామ్నాయం) విధానాన్ని గుర్తు చేస్తోంది. లైసెన్స్ రాజ్ కాలంలో ఇది చాలా ప్రధానమైందన్నది తెలిసిందే. దేశంలో ఇప్పటికే దిగుమతి సుంకాలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం అవి చైనా, ఆగ్నేయాసియా దేశాల సుంకాలకు రెట్టింపు స్థాయిలో ఉండటం గమనార్హం. ఈ పరిస్థితి మారితేనే భారత్ అంతర్జాతీయ వాణిజ్య విపణిలో కీలక పాత్ర పోషించగలుగుతుంది.

వ్యాసకర్త ఆర్థిక వ్యవహారాల సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

చర్చే మేలు



పార్లమెంటును స్తంభింపజేస్తూ ప్రతిపక్షం మణిపూర్‌తో పాటు తమకూ నష్టం కలిగించుకుంటోంది. అసలు చర్చే జరగకపోవడం కన్నా, ఏ నియమావళి ప్రకారం ఏ చర్చ జరిగినా మెరుగే!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఉండగలమా?



కొంతమంది ఇండియాను వదిలిపెట్టి ఇంకో దేశానికి ఎందుకు పోతారని ఒకప్పుడు ఆశ్చర్యపోయేదాన్ని. ఇప్పటి పరిస్థితులను చూస్తుంటే, అలాంటి నిర్ణయం తీసుకునేవాళ్లను నేను ప్రశ్నించను.

– సుఖద, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ముందది ఔషధం



జెలటిన్ అనేది జంతుసంబంధితమైనది అనేది తెలిసిన వాస్తవం. అయితే ఈ కారణంగా ప్రాణాధార ఔషధాలను వాడటానికి జనాలు నిరాకరిస్తారేమోనన్న ఉద్దేశంతో వాటిని శాకాహార, మాంసాహారాలుగా వర్గీకరించడాన్ని భారత ప్రభుత్వం చట్టబద్ధంగా నిషేధించింది. అందుకే క్యాప్సూల్ తయారీలో వాడిన పదార్థాల జాబితా ఎవరూ ఇవ్వరు. స్ట్రిప్స్ మీద ఎరుపు, ఆకుపచ్చ స్టిక్కర్లు కూడా ఉండవు.

– నవీన్ సాదెం, పోస్ట్ డాక్టోరల్ ఫెలో

విస్మరించకూడదు!



ఏ సమాజంలోనైనా చిల్లర శక్తులు ఉంటాయి. తేడా ఏమిటంటే, ఆ చిల్లర శక్తులను ఖండించడంలో కొన్ని సమాజాలు ఏ విధమైన సంకోచాన్నీ చూపవు. కానీ కొన్ని సమాజాల్లో ఆ చిల్లర శక్తులే హీరోలుగా మారిపోతాయి.

– రామి నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

ఎప్పటికి పూర్తయ్యేను?



చరిత్రాత్మకం. ఇండియాలోని కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసుల సంఖ్య అక్షరాలా ఐదు కోట్ల మార్కును దాటింది. కచ్చితంగా చెప్పాలంటే, 5.02 కోట్లు. ఇది మొత్తం దక్షిణ కొరియా జనాభాకు సమానం. ఇప్పుడు తీర్పులు వెలువడుతున్న వేగాన్ని బట్టి ఈ పేరుకుపోయిన కేసులు పూర్తి కావడానికి 323 ఏళ్లు పడుతుంది.

– ఆనంద్ రంగనాథన్, మీడియా ప్యానెలిస్ట్

సురక్షితమేనా?



ఇండియాలోని అత్యంత ఎక్కువ ఫార్చ్యూన్ 500 కంపెనీల కార్యాలయాలుండే నగరం ఇప్పుడు మత విద్వేషాల హింసను ఎదుర్కొంటోంది. భద్రత దృష్ట్యా కంపెనీలు తమ ఉద్యోగులను ఇంటి నుంచి పనిచేయమని చెబుతున్నాయి. క్యాబ్ సర్వీసులు నిలిచిపోయాయి. నగరంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ప్రపంచానికి మనం ఏం సందేశం ఇస్తున్నట్టు?

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్ట్

ఇలా కూడా చేస్తారా?



ఇటీవల నేను సింగపూర్‌కు వెళ్లినప్పుడు, ఒక క్యాండీ షాపులో ప్రత్యేకంగా 'వేగన్' (శాకాహార) విభాగం ఉండటం గమనించాను. కుతూహలంతో సేల్స్ గర్ల్‌ను అదే విషయం అడిగాను. మామూలు క్యాండీలు బీఫ్, పొసైన్ (పంది)ల జెలటిన్ (జంతు కొవ్వు)తో తయారవుతాయని చెప్పింది. నేనైతే షాకయ్యాను. నిజంగా నాకు ఈ విషయం తెలియదు.

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

ఇన్ బాక్స్

అమెరికాలో ఎందుకా క్యూలు?

కొద్దిరోజులుగా మన దేశంలో జనం టమోటాల కోసం క్యూలు కడుతుంటే, అమెరికాలో ప్రవాస భారతీయులు సన్నబియ్యం కోసం షాపింగ్ మాల్స్‌కు పరుగులు పెడుతున్నారు. మన కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తతో చేసిన బియ్యం ఎగుమతుల నిషేధ ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఉన్న దేశాల్లో ప్రకంపనలు సృష్టించింది. అమెరికాలో ఉండే మన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలవారు ఉలిక్కి పడ్డారు. చిత్రమేమిటంటే మన కేంద్ర సర్కారు బియ్యం ఎగుమతుల నిషేధానికి ముందు పంచదార, ఆ తర్వాత గోధుమల ఎగుమతులపై నిషేధం విధించినపుడు ఈ రకమైన ప్రకంపనలు కనిపించలేదు. అమెరికాలో వరి పండుతున్నా అక్కడి భారతీయులు ఆందోళన చెందడానికి కారణం ఉంది. అమెరికాలో పొడుగు రకం వరి ఎక్కువ పండిస్తారు. దీనిని ప్రవాస భారతీయులుగాని, చైనావారు గాని ఇష్టపడరు. ఈ కారణంగా సన్నరకం బియ్యం, బాస్మతి బియ్యాన్ని దిగుమతి చేసుకోక తప్పటం లేదు. అమెరికాలో మొక్కజొన్న, గోధుమ, సోయాబీన్, పత్తి పంటల తర్వాత వరి ఎక్కువ పండుతుంది. ఇక్కడి బియ్యం ఎక్కువగా మెక్సికో, హైతీ, జపాన్, కెనడా దేశాలకు ఎగుమతి అవుతాయి.

కాలిఫోర్నియా రాష్ట్రంలో పండే బంగారం రంగులో ఉండే గోల్డెన్ రైస్ అంటే కొన్ని దేశాలవారికి ఇష్టం. అమెరికా ప్రజల బియ్యం వినియోగం బాగా తక్కువ. సంవత్సరానికి 12 కిలోలు మాత్రమే అక్కడ తలసరి వినియోగంగా ఉంది. ఈ కారణంగా ఎగుమతుల కోసమే అక్కడ వరి పండిస్తున్నారు. అయితే అమెరికా బియ్యం లక్షల సంఖ్యలో ఉన్న చైనా, భారతీయులను ఆకట్టుకోలేకపోతోంది. ఈ కారణంగా సన్న బియ్యంతో పాటు భారత్‌కు చెందిన బాస్మతి, థాయ్‌లాండ్‌కు చెందిన జాస్మిన్ రకాల వృద్ధి కోసం అమెరికాలో ప్రయత్నాలు మొదలయ్యాయి. అమెరికాలో ప్రస్తుతం వచ్చిన బియ్యం సంక్షోభం 2008లో కూడా ఒకసారి వచ్చింది.

చివరగా 'అన్నం పరబ్రహ్మ స్వరూపమ'ని పొగిడినా, అది 'ఊబకాయాని'కి కారణమని దాని వినియోగాన్ని నిరుత్సాహపరచినా, ప్రపంచవ్యాప్తంగా 400 కోట్ల మంది బియ్యాన్ని ప్రధాన ఆహారంగా వినియోగిస్తూనే ఉన్నారనేది గమనార్హం.

– పుట్టా సోమన్న చౌదరి, కాకినాడ

ముస్లింలకు ప్రాధాన్యం పెరగాలి!

అభిప్రాయం



ఫిరోజ్ ఖాన్

ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్న పార్టీలు స్కీమ్స్ పేరుతో వారికి ఎర వేస్తున్నాయి. రిజర్వేషన్ల పేరిట ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో మాత్రం వారి పట్ల వివక్ష చూపుతున్నాయి. రాజ్యాధికారంలో భాగస్వాములను చేయడానికి వెనకడుగు వేస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అసెంబ్లీలో ముస్లిం ఎమ్మెల్యేల సంఖ్యను చూస్తే ఇదే స్పష్టమవుతున్నది. అంతేకాకుండా ప్రధాన పార్టీలు ముస్లింలకు ఇచ్చే టికెట్ల సంఖ్యను లెక్క వేసుకున్నా ఇది ఇట్టే తెలిసిపోతుంది.

రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు ఉండగా, 50కి పైగా సెగ్మెంట్లలో ముస్లిం ఓట్లు కీలకంగా ఉన్నాయి. 20కి పైగా సెగ్మెంట్లలో గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నాయి. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, చార్మినార్, యాకుత్‌పురా, మలక్‌పేట్, నాంపల్లి, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 40 శాతానికి పైగానే ఉంది. అంబర్‌పేట, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో 20–25 శాతం వరకు ముస్లింలు ఉంటారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షకు పైగా మైనార్టీ ఓట్లు ఉన్నాయి. ఖమ్మం, కొత్తగూడెం నియోజక వర్గాల్లో వీరి ఓట్లు కీలకం. ఉమ్మడి ఆదిలాబాద్ తూర్పు ప్రాంతంలోని సిర్పూర్, మంచిర్యాల, బెల్లంపల్లిల్లో ముస్లిం ఓట్ల సంఖ్య అధికంగానే ఉంటుంది.

కరీంనగర్, భైంసా లాంటి ప్రాంతాల్లో ముస్లింల ఓట్ల వల్లే మున్సిపాలిటీల్లో ఎంఐఎం మంచి విజయాలను నమోదు చేసింది. ఉమ్మడి నిజామాబాద్ లోని బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో మైనార్టీల ఓట్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయి. జహీరాబాద్, సంగారెడ్డి, నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఈస్ట్, మహబూబ్‌నగర్, భాన్సువాడ, ఎల్లారెడ్డిల్లో ముస్లిం ఓట్లు ఎంతో కీలకం కానున్నాయి. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా, వాటిలో 4–5 స్థానాల్లో ముస్లిం ఓట్లే అభ్యర్థుల జయాపజయాలను ప్రభావితం చేస్తాయి.



కానీ, టికెట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అసెంబ్లీ, శాసనమండలిల్లో ముస్లింల ప్రాతినిధ్యం తక్కువగా ఉంటున్నది. ప్రస్తుతం ముస్లిం ఎమ్మెల్యేల సంఖ్య ఎనిమిది మాత్రమే. అందులోనూ గ్రేటర్ పరిధిలోని సెగ్మెంట్ల నుంచి ఎంఐఎం తరఫున ఎన్నికైన వారే ఏడుగురు ఉన్నారు. అధికార పార్టీ నుంచి బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఒక్కరే ఉన్నారు. కౌన్సిల్‌లోనూ ముగ్గురు ముస్లింలు మాత్రమే ఎమ్మెల్సీలుగా వ్యవహరిస్తున్నారు. అందులో ఇద్దరు ఎంఐఎం నుంచి, మరొకరు బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రివర్గంలోనూ ఒక్కరికే ఛాన్స్ ఇచ్చారు. ఎమ్మెల్సీగా ఉన్న మహమూద్ అలీకి హోం మినిస్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. 17 లోక్‌సభ స్థానాల్లో, ఎంఐఎం నుంచి హైదరాబాద్ తరఫున ఒవైసీ ఒక్కరే ముస్లిం ఎంపీగా ఉన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఒక్క ముస్లింను కూడా ఎంపిక చేయలేదు.

తెలంగాణ అసెంబ్లీలో 119 స్థానాలు ఉండగా, 2018 ఎన్నికల్లో రాజకీయ పార్టీలు 26 మంది ముస్లిం అభ్యర్థులను బరిలోకి దించాయి. వీరిలో ఎనిమిది మంది ఎంఐఎం నుంచి పోటీ చేసిన వారే ఉన్నారు. ముస్లిం సంఘాలవారంతా ఏకతాటిపైకి వచ్చి రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకువస్తే అసెంబ్లీలో ముస్లిం ఎమ్మెల్యేల సంఖ్య 15 నుంచి 20కి పెరిగే అవకాశముంది. ముస్లింల సమస్యల పరిష్కారం, రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలని డిమాండ్ చేస్తూ ఇటీవల తెలంగాణ ముస్లిం సంస్థల 'జాయింట్ యాక్షన్ కమిటీ'(జేఏసీ) తెరపైకి రావడం మంచి పరిణామం.

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
మొబైల్: 96404 66464

మనిషికి మనిషే దిక్కు

ఓ ధనవంతుడు తన సంపదను చూసుకొని చుట్టుపక్కలవారితో సహా ఎవరితోనూ కలిసి మెలిసి ఉండడం లేదు. ఎవరికీ తాను చేయదగిన సహాయం చేయడం లేదు. అయితే అతడికి దైవ చింతన, సాధుపుంగవులను దర్శించడం వంటి లక్షణాలు మెండు.

ఒకసారి ఓ సాధువు ఆశ్రమానికి వెళ్లిన అతడు ఆయనతో మాటల సందర్భంగా... తన సంపద కారణంగా ఎవరి మీదా ఆధారపడకుండా ప్రశాంతంగా జీవిస్తున్నానని చెప్పాడు. అందుకు ఆ సాధువు తాను బయటకు వెళుతున్నాననీ, తనతో వస్తే ఓ జీవన సత్యాన్ని చెబుతాననీ అన్నాడు. అది మిట్టమధ్యాహ్న సమయం.



జ్యోతిర్మయం

ఇష్టం లేకపోయినా ధనవంతుడు ఆయనతో బయలుదేరాడు.

కొంత దూరం వెళ్లిన తరువాత ఎక్కడైనా చెట్టు కనిపిస్తే బాగుండు, ఆ చెట్టు నీడలో కొంత సమయం విశ్రమించవచ్చని అనుకుంటూ ఉన్నాడు. కనుచూపు మేరలో చెట్టు కనబడడం లేదు. ఇది గమనించిన సాధువు 'ఏమిటీ ఏదో వెతుకుతున్నట్టు ఉన్నావు? ఏం కావాలి' అని అడిగాడు.

'మనం కాసేపు విశ్రమించడానికి ఏదైనా చెట్టు నీడ కనిపిస్తుందేమో చూస్తున్నా'నన్నాడు. అంతట సాధువు, 'చెట్టు నీడ కోసం ఎందుకు, నీ నీడ ఉందిగా అందులో సేదదీరు' అన్నాడు. ఆ ధనవంతుడికి సాధువు చెప్పింది అర్థం కాలేదు. 'స్వామీ! ఏం చెబుతున్నారు... నా నీడలో నేనెలా సేద దీరగలను?' అన్నాడు.

'ఇప్పుడు నీ దగ్గర ఉన్న నీ ధనం నీకు నీడ కల్పించలేకపోతోంది. చివరికి నీ నీడ కూడా నీకు ఉపయోగకరంగా లేదు. కానీ నీ నీడ చీమల లాంటి చిన్న చిన్న జీవులు సేదదీరడానికి ఉపయోగపడగలదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించగలిగితే నువ్వు డబ్బు దన్నుతో సాటి మనుషులను పట్టించుకోకుండా ఉండలేవు. ఎంత డబ్బున్నా కష్టాల్లో నీకు సాయపడేది మనుషులే అనేది గుర్తెరుగు' అన్నాడు సాధువు. తన కళ్లు తెరిపించిన సాధువుకు నమస్కరించి వెనుతిరిగాడు ఆ సంపన్నుడు.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి




రాము(ఫైల్)　　శంకర్ (ఫైల్)

ఖానాపురం/నెల్లికుదురు: విద్యుదాఘాతంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం ఇద్దరు రైతులు మృతి చెందారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ధర్మరావుపేట శివారు బాల్‌తండాకు చెందిన కౌలు రైతు గుగులోతు రాము (44) నారు మడికి నీరు అందించడానికి విద్యుత్ తీగలు తగిలించే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. రాము తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఏడెకరాలు కౌలు తీసుకున్నాడు. కౌలు భూమి వద్ద నారుమడికి నీరు అందించడానికి మరో ఇద్దరు రైతులతో కలిసి విద్యుత్ ఎల్‌టీ లైన్‌కు తీగలు తగిలించి బల్బ్ ద్వారా కరెంట్ సరఫరాను పరిశీలిస్తున్నాడు. అయితే ఎల్‌టీ లైన్ పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు తీగలు తగలడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం మీఠ్యాతండాకు చెందిన రైతు గుగులోత్ శంకర్ (45) సర్వీస్ వైర్లు తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. కరెంట్ స్తంభాల నుంచి దూరంలోని తమ పొలాలకు కర్రల సాయంతో గట్ల మీదుగా ముగ్గురు రైతులు సర్వీస్ వైర్లు తీసుకున్నారు. కాగా పొలం దున్నిన రైతు శంకర్ గట్ల ఒరాలు తీస్తుండగా కిందికి వేలాడుతున్న సర్వీస్ వైర్లకు పొరపాటున తగిలి మృతి చెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గిరిజన అభివృద్ధి సలహా కమిటీ చైర్మన్ మృతి



ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: ఐటీడీఏ పరిధిలోని ఆదిమ గిరిజన సంక్షేమ సలహా కమిటీ(ఏటీడబ్ల్యూఏసీ) చైర్మన్ కనక లక్కేరావు(59) మంగళవారం హఠాన్మరణం చెందారు. రెండునెలల క్రితం ఆయనకు మొదటిసారి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ జరిగింది. తీవ్ర అనారోగ్యంగా ఉన్న ఆయన మంగళవారం ఉదయం గుండెపోటుకు గురికావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, వరుణ్ రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, కార్యకర్తలు, అభిమానులు లక్కేరావు స్వగ్రామం తుమ్మగూడకు చేరుకుని ఆయన భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. కుటుంబసభ్యులు సాయంత్రం లక్కేరావు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

'జైపూర్ రైలు' మృతుల్లో నగరవాసి



నాంపల్లి: రైలులో జరిగిన కాల్పుల్లో మరణించిన వారిలో హైదరాబాద్‌వాసి కూడా ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున జైపూర్ నుంచి ముంబై సెంట్రల్‌కు వెళ్లే జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాల్పుల ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పన్నెండేళ్ల కిందట కర్ణాటకలోని బీదర్‌కు చెందిన సయ్యద్ సైఫుద్దీన్(40) ఉపాధి కోసం నగరానికి వలస వచ్చారు. వృత్తిరీత్యా మొబైల్ టెక్నీషియన్. నగరంలోని బజార్‌ఘాట్ ఏబ్యాట్రీలేన్‌లో నివాసముంటూ కోటి గుజరాతీ గల్లీలోని జబ్బార్ మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లోనే సైఫుద్దీన్ వివాహం జరగ్గా, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒకరికి ఆరు, మరొకరికి రెండున్నరేళ్లు, ఇంకొకరి వయసు ఆరునెలలు.

బ్యాంకు గ్యారెంటీలు తిరిగి ఇచ్చేయాలి

భారతి సిమెంట్స్‌పై కేసులో ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: భారతి సిమెంట్స్ బ్యాంకు గ్యారెంటీలు వెంటనే తిరిగిచ్చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. భారతి సిమెంట్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉపసంహరించుకున్నారా అని ధర్మాసనం ఈడీ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ప్రశ్నించింది. ఈ విషయాన్ని మరోసారి సరిచూసుకోవాలని రాజు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం గుర్తుచేసింది. ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేసుకున్నారని భారతి సిమెంట్స్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. దీంతో బ్యాంకు గ్యారెంటీలు తిరిగి ఇస్తామని రాజు తెలిపారు. అనంతరం బ్యాంకు గ్యారెంటీలు ఈడీ రిటర్న్ చేయాలని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎన్‌క్యాష్ చేసుకున్నందున వాటిని తిరిగి ఇవ్వడం సాధ్యం కాకపోవడంతో, ఆ మేరకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

కలెక్టర్ల నేతృత్వంలో వీఆర్‌ఏల విలీనం

- మార్గదర్శకాలు జారీ చేసిన సీసీఎల్‌ఏ
- ఖాళీల గుర్తింపు నుంచి కేటాయింపు వరకు కలెక్టర్లదే బాధ్యత
- 61 ఏళ్లు నిండిన వారి కుమారుడు లేదా కుమార్తెకు కారుణ్య ఉద్యోగం
- ఈ ఏడాది జూలై 31 నాటికి వయస్సు పరిగణనలోకి..
- స్థానిక జిల్లాల్లో ఖాళీలు లేకపోతే ఇతర జిల్లాల్లో పోస్టింగులు



సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)ను వివిధ ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసుకునే ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఈ మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు ఇచ్చారు. వీఆర్‌ఏల విలీన ప్రక్రియను జిల్లా కలెక్టర్లు నిర్వహించాల్సి ఉంటుంది. ఖాళీల గుర్తింపు ప్రకటన నుంచి కేటాయింపు వరకు కలెక్టర్లే బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది.

61 ఏళ్లు నిండితే కారుణ్య ఉద్యోగం

61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల కుమారుడు లేదా కుమార్తెకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా ఉత్తర్వుల్లో పొందుపరిచారు. కారుణ్య ఉద్యోగం కోసం ఈ ఏడాది జూలై 31 నాటికి వీఆర్‌ఏ వయస్సును పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నియామకాల కోసం దరఖాస్తు ఫార్మాట్‌ను రూపొందించారు. దీని ప్రకారం దరఖాస్తు చేసుకోవడంతో పాటు సదరు వీఆర్‌ఏ కూడా అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇతర కుటుంబసభ్యుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సమర్పించాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ, విద్యార్హత, కుల, నివాస ధ్రువపత్రాలు, ఆధార్ వివరాలను జత పరచాల్సి ఉంటుంది. ఈ కారుణ్య నియామకాల ప్రక్రియను జిల్లా కలెక్టర్లు ఈనెల ఐదో తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

వీఆర్‌ఏల విలీనం మార్గదర్శకాలివే..

- తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లోని రూల్ 10(ఏ) ప్రకారం వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసుకుంటారు. ఇదే నియమం ప్రకారం కారుణ్య నియామకాలు కూడా చేపడతారు.
- విద్యార్హతల ఆధారంగా ప్రభుత్వ శాఖల్లోని చివరి స్థాయి సర్వీసు/రికార్డు అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్ తత్సమాన హోదాల్లో వీఆర్‌ఏలను రెగ్యులర్ స్కేల్ ఉద్యోగులుగా తీసుకుంటారు.
- జిల్లాల వారీగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆయా హోదాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, ఆ జిల్లాలో విలీనం చేసుకోవాల్సిన వీఆర్‌ఏల సంఖ్యను కలెక్టర్లు ప్రకటించాలి. వాటి ఆధారంగా వీఆర్‌ఏల విలీనం, కారుణ్య నియామకాల కోసం అవసరమైతే రెగ్యులర్ లేదా సూపర్ న్యూమరీ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- ఆ జిల్లాలో ఉన్న ఖాళీలకు మించి వీఆర్‌ఏలను విలీనం చేసుకోవాల్సి వస్తే వారిని ఇతర జిల్లాలకు కూడా పంపవచ్చు. అలా పంపాల్సి వస్తే సదరు వీఆర్‌ఏల వివరాలను ప్రస్తుత జిల్లా కలెక్టర్ ప్రకటిస్తారు. అలా ప్రకటించిన తర్వాత సదరు వీఆర్‌ఏలు తమకు కేటాయించిన జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆ జిల్లా కలెక్టర్ వీఆర్‌ఏను ఏదైనా శాఖలో విలీనం చేసుకుంటూ ఉత్తర్వులు జారీ చేస్తారు.
- అదే జిల్లాలో సర్దుబాటు చేసినా, ఇతర జిల్లాలకు పంపినా కలెక్టర్ కేటాయింపు ఉత్తర్వులు వెలువడిన వెంటనే తహసీల్దార్లు వీఆర్‌ఏలను రిలీవ్ చేయాల్సి ఉంటుంది. ఏ శాఖలకు పంపితే ఆయా శాఖల సర్వీసు రూల్స్ వీఆర్‌ఏలకు వర్తిస్తాయి.
- ఒక్కసారి కేటాయించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ మార్పు ఉండదు. తమను మార్చాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకునే అవకాశం కూడా ఉండదు.
- కేటాయింపు ఉత్తర్వులు వెలువడిన వెంటనే వీఆర్‌ఏలు సంబంధిత అధికారికి రిపోర్టు చేయాలి. ఆ అధికారి బేషరతుగా వారిని విధుల్లోకి తీసుకుని పోస్టింగు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది.

తహసీల్దార్లను వెంటనే రిలీవ్ చేయండి

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మల్టీజోన్లలోని ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను వెంటనే రిలీవ్ చేయాలని సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లను విధుల్లోకి తీసుకోవాలని, ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా డిక్లరేషన్లు కూడా పొందుపర్చాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 410 మందికి పైగా తహసీల్దార్లు గత నెల 31న బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇలావుండగా తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందిన మరో 9 మందికి మంగళవారం పోస్టింగులిస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి హోదాలో నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

4న మద్యం లాటరీలకు నోటిఫికేషన్!



- ఆ రోజు నుంచే దరఖాస్తుల స్వీకరణ.. గత రెండేళ్ల పాలసీనే అమలు?
- దరఖాస్తు ఫీజు, దుకాణాల సంఖ్యలో మార్పు లేనట్టేనా
- ఈ నెల 20 లేదా 21న లాటరీలు
- రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండేళ్ల కాలానికి (2023–25)గాను రాష్ట్రంలోని 2,620 ఏ4 దుకాణాల (వైన్‌షాపులు) ద్వారా మద్యం విక్రయించడం కోసం లైసెన్సులు మంజూరు చేసే ప్రక్రియను ఎక్సైజ్ శాఖ ప్రారంభించింది. ఈ మేరకు ఈనెల 4న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించాల్సిన ప్రక్రియపై మంగళవారం అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులతో రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ ఫారూఖీ, ఇతర ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి మార్గదర్శనం చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఈనెల 4న నోటిఫికేషన్ రానుండగా, అదేరోజు నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈనెల 20 లేదా 21న లాటరీలు నిర్వహించి షాపులు కేటాయించనున్నట్లు సమాచారం. అయితే, గత రెండేళ్ల పాలసీనే ఈసారి కూడా అమలు చేస్తారని, దరఖాస్తు ఫీజు, దుకాణాల సంఖ్య లో ఎలాంటి మార్పు లేదని, ఎస్సీ, ఎస్టీ, గౌడ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కూడా యథాతథంగా అమలవుతాయని తెలుస్తోంది.

ఎమర్జెన్సీ సేవలు మరింత పటిష్టం

466 వాహనాలు ప్రారంభించిన సీఎం కేసీఆర్

- ముఖ్యమంత్రికి ఆర్టీసీ ఉద్యోగుల కృతజ్ఞతలు



మంగళవారం ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆయన ప్రయాణించే ప్రగతి రథం బస్సు డ్రైవర్లు, మెకానిక్

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ఎమర్జెన్సీ సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా వద్ద 466 అంబులెన్స్, అమ్మ ఒడి, పార్థివదేహాల తరలింపు వాహనాలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో 204 అంబులెన్స్‌లు (108), 228 అమ్మఒడి, 34 హర్సె వాహనాలు ఉన్నాయి. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ వాణీ దేవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. ఆ తర్వాత జరిగిన సభలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

ఆశ కార్యకర్తలకు సెల్ ఫోన్ బిల్లు: హరీశ్‌రావు

తెలంగాణ ఏర్పడే నాటికి 108 అంబులెన్సులు 316 ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 455కు పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. గతంలో లక్ష మందికి ఒక 108 వాహనం ఉంటే.. ఇప్పుడు 75 వేలకు ఒక వాహనం అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో అంబులెన్స్ చేరుకునే సగటు సమయం 30 నిమిషాలు ఉంటే.. ఇప్పుడది 15 నిమిషాలకు తగ్గిందని తెలిపారు. 108 ఉద్యోగుల వేతనాలు 4 స్లాబులుగా పెంచుతున్నామని చెప్పారు. అమ్మ ఒడి వాహనం ద్వారా రోజుకు 4 వేల మంది గర్భిణులకు, 108 ద్వారా రోజుకు 2 వేల మందికి సేవలు అందుతున్నాయని చెప్పారు. ఆశ కార్యకర్తల సెల్ ఫోన్ బిల్లును ఇకపై ప్రభుత్వమే చెల్లిస్తుందని, కొత్తగా హైదరాబాద్ పరిధిలో నియమితులైన ఆశాలకు స్మార్ట్ ఫోన్లు ఇస్తామని అన్నారు.

ఆ ఒక్క శాతం లోపంతో చెడ్డపేరు

వైద్య ఆరోగ్యశాఖలో సిబ్బంది 99 శాతం బాగా పనిచేస్తున్నప్పటికీ, ఒక్క శాతం లోపం వల్ల కూడా చెడ్డపేరు వస్తుందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కూడా లోపాలు మాత్రమే కాకుండా చేస్తున్న మంచిని కూడా చూపాలని కోరారు.బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రాల్లో స్కాములు ఉంటే.. తెలంగాణలో స్కీములు ఉన్నాయని చెప్పారు. ఆ పార్టీ రాష్ట్రాల్లో కొట్లాటలు, అవినీతి తప్పే అభివృద్ధి శూన్యమని హరీశ్‌రావు విమర్శించారు.

తెలంగాణ ఆర్‌ఓసీగా పర్వీందర్



పర్వీందర్‌సింగ్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ)గా పర్వీందర్ సింగ్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆర్‌ఓసీగా పనిచేసిన జోసేకుట్టి జూలై 31న పదవీ విరమణ పొందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో పర్వీందర్ సింగ్‌ను ఆర్‌ఓసీగా కేంద్రం నియమించింది. మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు రిజిస్ట్రార్లు కలసి అభినందనలు తెలిపారు.

పత్తి సాగుకు బ్రేక్ వేయాల్సిందే

- ఇప్పుడు పత్తి విత్తితే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి
- ఈ నెలలో మొక్కజొన్న వేస్తే కత్తెర పురుగు రావొచ్చు
- రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం పత్తి విత్తే సమయం దాటిపోయిందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. రైతులు పత్తి సాగు చేయకూడదని, ఒక ఇప్పుడు పత్తి విత్తితే సరైన పెరుగుదల రాకముందే పూత వచ్చి దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని హెచ్చరించింది. అధిక వర్షాల వల్ల నేలలో తేమ అధికంగా ఉండడంతో ఆంథోసయనిన్ పిగ్మెంట్ గాఢత పెరుగుతుందని, ఆకులు ఎరుపు లేదా గులాబీ రంగులోకి మారుతాయని తెలిపింది. ఇది చూడటానికి మెగ్నీషియం ధాతువు లోపంలాగా కనబడుతుందని వివరించింది. రాష్ట్రంలో గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటివరకు 567.7 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే 56 శాతం ఎక్కువ. అధిక వర్షాల నుండి పంటలు త్వరగా కోలుకోవడానికి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, ఇప్పుడు సాగు చేసుకోదగ్గ పంటలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని పంటల్లో లోతు కాలువల ద్వారా నీటిని బయటకు తీసివేయాలన్నారు.

పంట విత్తి 20రోజులు దాటితే.. ఆ ఎరువుల వల్ల ఉపయోగం లేదు

పంట విత్తి 20 రోజులు దాటినట్లయితే భాస్వర సంబంధిత ఎరువులను, కాంప్లెక్స్ ఎరువులను వాడటం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు.పంట తొందరగా కోలుకోవడానికి నీరు తగ్గిన తర్వాత సూచించిన మేరకు నత్రజనిని నేల పైన వేయకుండా మట్టిలో కలిసేటట్టుగా జాగ్రత్త వహించాలన్నారు.

- ఇప్పటి వరకు నార్లు పోసుకొని రైతులు దమ్ము చేసిన పొలాల్లో స్వల్పకాలిక వరి రకాలను ఎంపిక చేసుకొని నేరుగా విత్తనాలు వెదజల్లుకోవాలి.
- మొక్కజొన్న మధ్య కాలిక సంకరాలైన డీహెచ్‌ఎం 117, డీహెచ్‌ఎం 121 లేదా స్వల్పకాలిక సంకరాలను ఎంచుకొని సాగు చేసుకోవచ్చు. ఆగస్టులో విత్తిన మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఆశించే అవకాశం అధికంగా ఉంటుంది.
- గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత వానాకాలం కాలంలో కంది విస్తీర్ణం రాష్ట్రంలో సుమారుగా లక్షన్నర ఎకరాలలో తక్కువగా ఉన్నది. ఈ సంవత్సరం కంది పంటకు ధర అధికంగా వచ్చే సూచనలున్నందున ప్రస్తుత సమయంలో కంది పంటను విత్తుకోవచ్చు.

తల్లీకొడుకు దారుణహత్య

- గొంతు కోసి ఘాతుకం
- వృద్ధురాలు, దివ్యాంగుడనే కనికరం చూపని నిందితులు
- డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో విచారణ చేపట్టిన పోలీసులు




తులశమ్మ (ఫైల్)　　సత్యనారాయణ (ఫైల్)

సత్తుపల్లి: వృద్ధురాలైన మహిళ, దివ్యాంగుడైన ఆమె కొడుకును అత్యంత కిరాతకంగా గొంతుకోసి హత్య చేసిన ఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. ఇద్దరి గొంతును తెగిపోయే వరకు కసితీరా కోసినట్లు ఘటనాస్థలంలో ఆనవాళ్ల ఆధారంగా తెలుస్తుండగా రక్తం మడుగు కట్టింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో ఈ ఘాతుకం జరగగా... సోమవారం అర్ధరాత్రి దుండగులు హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

పింఛన్, రైతుబంధు, వేతనం తీసుకొచ్చిన రోజే

నారాయణపురానికి చెందిన రాయల తులశమ్మ(75)కు భర్త ఐదేళ్ల క్రితం చనిపోవడంతో దివ్యాంగుడైన మూడో కుమారుడు సత్యనారాయణ(52) కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. అంగన్‌వాడీ ఆయాగా తులశమ్మ కొన్నేళ్లు పనిచేయగా, ఆమె స్థానంలో ఇప్పుడు పెద్దకుమారుడు నాగేశ్ భార్య చిట్టెమ్మ పనిచేస్తోంది. తులశమ్మ పేరిట సుమారు రూ.40 లక్షల విలువైన ఎకరం వరిపొలం ఉంది. సత్యనారాయణ దివ్యాంగుల కోటాలో ఉపాధి పనులకు వెళ్తుండడమే కాక రూ.3,116 పింఛన్ పొందుతున్నాడు. సత్తుపల్లి బ్యాంక్‌కు సోమవారం వెళ్లిన తులశమ్మ పెన్షన్, రైతుబంధు నగదుతో పాటు ఆయాగా వచ్చే జీతం తీసుకుని కోడలు చిట్టెమ్మకు సగం జీతం ఇచ్చినట్లు చెబుతున్నారు.

కనిపించడం లేదని ఫోన్

కాగా, మంగళవారం ఉదయం వేంసూరు మండలం భీమవరంలో ఉంటోన్న తులశమ్మ కుమార్తె రాధాకుమారికి సోదరుడు నగేశ్ ఫోన్ చేసి.. అమ్మా, తమ్ముడు ఉదయం నుంచి కనిపించడం లేదు. ఇంట్లో కూడా లేరు.. అని ఫోన్ చేయడంతో ఆమె హుటాహుటిన మధ్యాహ్నం 12 గంటలకు నారాయణపురం చేరుకుంది. ఇంటి తలుపు తీయగా రెండో గదిలో రక్తపు మడుగులో తులశమ్మ, సత్యనారాయణ పడి ఉండడంతో కేకలు వేయడంతో స్థానికులు పెద్దసంఖ్యలో వచ్చారు.

తెలిసిన వాళ్ల పనేనా?

తులశమ్మ, సత్యనారాయణను తెలిసిన వాళ్లే హత్య చేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి నిద్రపోయేటప్పుడు తలుపులు వేసుకోగా, తెలిసిన వారు వస్తే తప్ప తీసే అవకాశం లేదు. దీంతో తెలిసిన వారే వచ్చి మాట్లాడాక హత్య చేసినట్లుగా భావిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో పెనుగులాట జరిగిన పరిస్థితులు కనిపించలేదు. ఇంట్లో డబ్బు కూడా చోరీ కాలేదు. నిందితుల పాదం అచ్చులు రక్తపు మడుగులో పడగా... కల్లూరు ఏసీపీ బి.రామానుజం ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం చేరుకుని విచారణ చేపట్టింది.

సిరిసిల్ల కోర్టులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమం.. సూసైడ్ నోట్ లభ్యం



సిరిసిల్ల ఆస్పత్రిలో చంద్రశేఖర్

సిరిసిల్ల టౌన్/బోయినపల్లి (చొప్పదండి): భూతగాదా ఫిర్యాదులో ఎస్సై వేధింపులు భరించలేక ఓ వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన గురిజాల చంద్రశేఖర్ (53)కు ఇటీవల గ్రామంలోని మరొకరితో భూతగాదా ఏర్పడింది. ఈ విషయంలో తనవైపు తప్పులేకున్నా స్థానిక ఎస్సై తనతో గొడవపడిన వ్యక్తికి అనుకూలంగా వ్యవహరిస్తూ..తనను కొట్టాడని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల కోర్టు ప్రాంగణానికి వచ్చి గడ్డిమందును తాగాడు. తన బాధను జడ్జికి వినిపించి సదరు ఎస్సైపై ఫిర్యాదు చేయడానికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉంది. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఠాణాదివస్ నిర్వహిస్తుండగా మరోవైపు సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో చంద్రశేఖర్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది. ఈవిషయంలో బోయినపల్లి ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా రత్నంపేటకు చెందిన చంద్రశేఖర్ తన పొలం ఒడ్డును తెంపాడని అదే గ్రామానికి చెందిన మల్లేశం ఇచ్చిన ఫిర్యాదుపై తమ సిబ్బంది మాట్లాడినట్లు తెలిపారు. తర్వాత వారిద్దరూ గ్రామంలో పంచాయితీ చేసుకుని రాజీపడ్డ కాగితాన్ని సైతం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చారని వెల్లడించారు.

సూసైడ్‌నోట్స్ లభ్యం: చంద్రశేఖర్ ఆత్మహత్యాయత్నానికి ముందే మూడు సూసైడ్‌నోట్స్ రాసి పెట్టుకున్నాడు. తన చావుకు కారణం బోయినపల్లి ఎస్సై, పడిగె మల్లేశం, గురిజాల శ్రీధర్ అని మూడు వేర్వేరు పేజీల్లో సూసైడ్ నోట్స్ రాసుకున్నాడు. ఒక పేజీలో ఏఎస్సై బాబు కూడా తన చావుకు కారణంగా రాయగా.. మరో పేజీలో ఏఎస్సై బాబుకు ప్రమోషన్ ఇవ్వాలని ఉంది. తన కొడుకుకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ మరో పేజీలో ఉంది. కాగా, రైతు చంద్రశేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం విచారణ చేపట్టారు. ప్రాథమికంగా జరిపిన విచారణలో రైతును ఎస్సై, పోలీసులు కొట్టలేదని వెల్లడైందని తెలిపారు. కానీ రైతు ఆత్మహత్య ఘటనపై మరింత లోతుగా విచారణ చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం, నీటిపారుదల సర్కిల్, ఖమ్మం
టెండరు నోటీసు సంఖ్య : 06/2023-24　తేది : 24.06.2023
పని పేరు: తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో కొణిజర్ల మండలం, గుబ్బగుర్తి గ్రామం కి.మీ. 26.6456 నుండి కి.మీ. 26.7078 నందు గల 21st MBC కాలువ కట్ట మరమ్మతు పనులు చేయుట గురించి. కాంట్రాక్టు అంచనా విలువ: రూ. 55,50,611/-. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 01.08.2023 ఉ. 10.30 గం. బిడ్ సమర్పణ ముగింపు తేది : 08.08.2023న సా. 04.30 గం. గమనిక: మరిన్ని వివరాల కోసం దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ను సంప్రదించండి : https://tender.telangana.gov.in.
తేది : 31.07.2023　సం/- డి. నర్సింగ్‌రావు, సూపరింటెండింగ్ ఇంజినీర్, నీటిపారుదల సర్కిల్, ఖమ్మం
DIPR RO No. 4891-PP/CL/ADVT/1/2023-24, Dt. : 01.08.2023

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, PR డివిజన్, ఆర్మూర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
NIT No: 98 to 116/2023-24　తేది: 28.07.2023
పనుల సంఖ్య (19), పనుల పేరు: నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలలో SC కమ్యూనిటీ హాల్స్, కమ్యూనిటీ హాల్స్, VDC భవనం నిర్మాణం, కమ్మర్‌పల్లి మండలంలో PACS ఫర్టిలైజర్ గోదాం మరియు లైబ్రరీ భవనం నిర్మించుట, ముప్కాల్, భీంగల్ మరియు వేల్పూర్ మండలాలలో వివిధ పాఠశాల వద్ద మేజర్ మరియు మైనర్ మరమ్మతులు, ఎలక్ట్రిఫికేషన్ & త్రాగు నీటి సరఫరా కోసం క్రింది సంతకందారులు టెండర్లు కోరుచున్నారు. మొత్తం ECV: రూ. 178.00 లక్షలు. టెండరుదార్లు టెండరు షెడ్యూలును 04-08-2023న మ. 3.00 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు ఆఖరి తేది: ఆన్‌లైన్‌లో ప్రతి NIT ప్రచురణ తేదీ నుండి (7) పని రోజులుగా ఉంటుంది. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో ఆన్‌లైన్‌లో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, PR డివిజన్ ఆర్మూర్
DIPR RO No.1150-DP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

పురపాలక సంఘము, కోదాడ
జిల్లా సూర్యాపేట
టెండరు ప్రకటన
నెం.: ఎమ్‌సికె/ఇ1/141/2023-24　తేది: 31-07-2023
కోదాడ పురపాలక సంఘము ఇంజనీరింగ్ విభాగము - కోదాడ పురపాలక సంఘం పరిధిలో 18వ వార్డు లో కల్వర్ట్ బ్రిడ్జి నిర్మాణం, 13వ వార్డు ఖనన స్మశానవాటిక నందు కాంపౌండ్‌వాల్ మరియు బాత్ రూమ్స్ నిర్మాణం, యన్.హెచ్-65 హుజూర్‌నగర్ మరియు మేళ్ళ చెరువు అండర్‌పాస్‌ల వద్ద ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు మొదలగు పనులు చేయుటకు గాను 'e' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరనైనది. 1) పనుల సంఖ్య (4) Pattana Pragathi Fund and LRS Fund - 50.38 లక్షలు. షెడ్యూలు: 1. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ప్రారంభ తేది: 01-08-2023 4.00 పి.యమ్. 2. బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది: 08-08-2023 4.00 పి.యమ్. ఇతర వివరములకు సంప్రదించుటకు సెల్ నెం. 8374450356, 8374454641 కోదాడ పురపాలక సంఘ కార్యాలయము నందు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, కోదాడ పురపాలక సంఘము
DIPR RO No.4848-PP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, ఇ.నం. 5-9-58/బి, ఫతే మైదాన్ రోడ్, హైదరాబాద్-04, ఫోన్ : 23238290-250
No. 28/CGM/TSIIC/2023-24　ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన　తేది : 01.08.2023
T.N.No. 28 : రంగారెడ్డి జిల్లా, చేవెళ్ళ (మం.), చందన్‌వల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో చందన్‌వల్లి (గ్రా.) వద్ద కేటాయించిన ఇండస్ట్రియల్ ప్లాట్లకు 11 KV లైన్ స్థాపన. ECV : రూ. 1,06,83,773.00. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 02.08.2023న సా. 5.00 గం.ల నుండి, బిడ్ల దాఖలు కోసం ఆఖరి తేది : 04.08.2023న మ. 3.00 గం.వరకు. టెండరు ప్రకటనల వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్‌లను వెబ్‌సైట్ www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (E)
DIPR RO No. 4854-PP/CL/ADVT/1/2023-24, Dt. : 01.08.2023

తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యా శాఖ
తెలంగాణ స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-2023
ప్రకటన
రాష్ట్రంలో 15.09.2023న శుక్రవారం నాడు నిర్వహించబడే తెలంగాణ స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2023 (TS-TET-2023) కోసం హాజరయ్యేందుకు అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి. ఆసక్తి గల అభ్యర్థులు 01.08.2023 నుండి వెబ్‌సైట్ https://tstet.cgg.gov.in లో ఇన్ఫర్మేషన్ బులెటిన్ మరియు వివరమైన ప్రకటనను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అభ్యర్థులు తమ దరఖాస్తును 02.08.2023 నుండి 16.08.2023 వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చును.
సం/- డైరెక్టర్, పాఠశాల విద్య & చైర్‌పర్సన్ TS-TET
DIPR RO No.4841-PP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఇ-మెయిల్ : knrcmnr@rediffmail.com.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.E1/DB/MCK/8201/150/MCK/2023-24　తేది: 28-07-2023
MPLADS క్రింద కరీంనగర్ సిటీలో 7 నం.ల వివిధ అభివృద్ధి పనులు, అంచనా వ్యయం: రూ. 70.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 31-07-2023న సా.4.00 గం.లు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 07-08-2023న సా.4.00 గం.లు. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్
DIPR RO No.4843-PP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU వరంగల్
టెండరు ప్రకటన
No. D7/2BHK/2nd Call/2022-23　తేది: 25-07-2023
NIT No.: 10, 12, 13, 18, 24-33, 11/2022-23/CDP-2016-17. పనుల సంఖ్య: 15 ప్యాకేజీలు (112 గృహాలు) మరియు 1 కమ్యూనిటీ హాల్, పనుల పేరు : వరంగల్ జిల్లాలోని వివిధ మండలాలలో 2BHK పనులు మరియు పర్వతగిరి మండలంలో ఎనుగల్ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మొత్తం అంచనా వ్యయం: రూ. 597.10 లక్షలు. తదుపరి వివరాల కోసం www.tender.telangana.gov.in చూడండి.
సం/- జిల్లా P.R. ఇంజినీర్, PIU వరంగల్
DIPR RO No.1153-DP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
తెలంగాణ స్టేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కాంపౌండ్, సైఫాబాద్, హైదరాబాద్-500004
ఫోన్:040-27855008, 040-23230742, ఫ్యాక్స్: 040-23297143, ఇ-మెయిల్: headoffice@tsphcl.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-14
దిగువ తెలిపిన పనుల కోసం టెండరు నం. T65 to T78/2023-24 తేది:31-07-2023 కోసం సివిల్ పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి: టెండరు నం.లు, జిల్లాలోగల పనులు & మొత్తం ECV (రూ.లక్షల్లో) వరుసగా దిగువ విధంగా ఉన్నాయి: T65 - సంగారెడ్డి-1-21.72; T66, T68- రంగారెడ్డి-2-32.84; T67, T69, T70, T72, T73-వరంగల్-5-61.67; T71- వికారాబాద్-1-17.82; T74, T75, T76, T77, T78- హైదరాబాద్ -5-48.15. ఆన్‌లైన్‌లో షెడ్యూలు లభ్యత: 01-08-2023 నుండి. టెండరు నం. T65 & T78/23-24 కోసం బిడ్ దాఖలుకు ఆఖరి తేది/సమయం: 08-08-2023న సా.5.00 గం.(STN). తదుపరి వివరాలను వెబ్‌సైట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR Ro No.4825-PP/CL/ADVT/1/2023-24, Dt:01-08-2023　సం/- చీఫ్ ఇంజినీర్(FAC)

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
"టూరిజం హౌస్" # 3-5-891, హిమాయత్ నగర్, హైదరాబాద్-500029
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.14/SE/TSTDC/2023-24　తేది: 31.07.2023
క్ర.సం., పని పేరు & అంచనా వ్యయం వరుసగా: 1) మహబూబ్‌నగర్ టౌన్ & జిల్లాలో బడ్జెట్ హోటల్ మరియు మల్టీపర్పస్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ కోసం ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ & MEPకి మిగిలిన పనులు - రూ.36.05 కోట్లు, 2) పెద్దచెరువు, మహబూబ్‌నగర్ టౌన్‌లో నెక్లెస్ రోడ్ & ఐలాండ్ వద్ద డైనమిక్ ఇల్యుమినేషన్, ప్రొజెక్షన్ మ్యాపింగ్, మ్యూజికల్ ఫౌంటెయిన్ మరియు అనుబంధ పనుల ఏర్పాటు - రూ.12.00 కోట్లు, క్ర.సం.1,2 కోసం బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 02.08.2023. అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్లు కోరబడుతున్నవి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TSTDC లిమిటెడ్, హైదరాబాద్
DIPR RO No.4833-PP/CL/Advt/1/2023-24 Dt. 01.08.2023

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
టెండరు ప్రకటన
No. ME/NMC/07/2023　తేది: 31-07-2023
జనరల్ క్రింద నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త మున్సిపల్ కార్యాలయం మరియు రఘునాథ్ ట్యాంక్ బండ్ వద్ద హౌస్‌కీపింగ్ మరియు సెక్యూరిటీ సిబ్బందిని నియమించే పని కోసం టెండరు కోరబడుతుంది. దాఖలు కోసం ఆఖరి తేది: 03-08-2023న సా. 5.00 గం.లు. తదుపరి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అనగా http://tender.telangana.gov.in దర్శించవలెను. తదుపరి వివరాల కోసం సంప్రదించండి : 9705710924.
సం/- కమిషనర్ NMC
DIPR RO No.4845-PP/CL/Advt/1/2023-24, Dt. 01.08.2023

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్
బాసర గ్రామం మరియు మండలం, నిర్మల్-504107, తెలంగాణ
VI - కాన్వొకేషన్ ప్రకటన
ప్రకటన నం.RGUKT/Basar/Exams/01/2023　తేది: 01-08-2023
RGUKT-బాసర VI-కాన్వొకేషన్ 2023 సెప్టెంబర్ నెలలో (వాస్తవ తేది తరువాత ప్రకటించబడును) షెడ్యూల్ చేయబడింది. డిగ్రీ ప్రదానం కోసం అర్హత సాధించిన బ్యాచ్ 2017 (అన్ని ఫీజు బకాయిలు చెల్లించబడిన) B.Tech అభ్యర్థులు ఈ కాన్వొకేషన్ కోసం దరఖాస్తు చేయడానికి అర్హులు (ఇదివరకే OD తీసుకున్న వారు ఈ కాన్వొకేషన్ కోసం అర్హులు కాదు). రిజిస్ట్రేషన్ చివరి తేది 14 ఆగస్టు 2023. కాన్వొకేషన్ కోసం దరఖాస్తు ఫీజు రూ. 1750/-, మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా https://hub.rgukt.ac.in/hub/convocation/ ఉపయోగిస్తూ ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే అంగీకరించబడుతుంది. సవివరమైన ప్రకటన కోసం దర్శించండి మా వెబ్‌సైట్ www.rgukt.ac.in. ఏవేని సంబంధిత విచారణల కోసం convocation@rgukt.ac.in కు రాయండి.
సం/- డైరెక్టర్, RGUKT, బాసర, తెలంగాణ రాష్ట్రం
DIPR RO No.4852-PP/CL/Advt/1/2023-24, Dt: 01.08.2023

క్లుప్తంగా...

బీజింగ్‌లో అనూహ్య వరదలు

20 మంది మృతి..మరో 27 మంది గల్లంతు

బీజింగ్: చైనా రాజధాని బీజింగ్‌లో మునుపెన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో కనీసం 20 మంది చనిపోగా మరో 27 మంది గల్లంతయ్యారు. బీజింగ్ ఎండల తీవ్రత అంతగా ఉండదు. కానీ, ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో ఎండలతో జనం ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా, భారీ వర్షాలు కురియడం కూడా అరుదే. ఈసారి మాత్రం అసాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయి. జనావాసాలు నీట మునిగాయి. రహదారులు, వాహనాలు కొట్టుకుపోయాయి. వరదలకు సంబంధించిన ఘటనల్లో బీజింగ్ సిటీ సెంటర్‌లో 11 మంది చనిపోగా, 27 మంది జాడ తెలియకుండాపోయారు. నగర పరిధిలోని హుంబే ప్రావిన్స్‌లో మరో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని అధికార మీడియా తెలిపింది.

నితీశ్‌కు పట్నా హైకోర్టులో ఊరట

పట్నా: రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం కులగణన చేస్తామని ప్రకటించి ఆ క్రతువుకు శ్రీకారం చుట్టిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు పట్నా హైకోర్టులో భారీ ఊరట లభించింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టేస్తూ పట్నా హైకోర్టు మంగళవారం తుది తీర్పు చెప్పింది. కులగణన సర్వేకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సమర్ధించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను పట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ పార్థసారథిల ధర్మాసనం గత నెల ఏడో తేదీన విచారించి తుది తీర్పును రిజర్వ్‌చేసి మంగళవారం వెలువరించింది. 'ప్రభుత్వ ఉత్తర్వు చెల్లుబాటు అవుతుంది. వెనుకబడిన వర్గాల న్యాయమైన అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టపరమైనదే' అని ధర్మాసనం తెలిపింది. మూడు నెలల క్రితం సర్వేను ఆపాలంటూ స్టే ఉత్తర్వులిచ్చిన హైకోర్టు ఇప్పుడు సర్వేకు పచ్చజెండా ఊపింది. దీంతో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని పిటిషన్లలో ఒకరి తరఫు న్యాయవాది చెప్పారు. 'ఓబీసీ ప్రధానమంత్రి ఉన్నారని చెప్పుకునే బీజేపీ.. తమ పార్టీపాలిత రాష్ట్రాల్లో కులగణనకు అయిష్టత కనబరుస్తోంది' అని బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలంటూ ఆ అంశాన్ని 'ఇండియా' కూటమి తన ఎజెండాలో చేర్చుకున్న ఈ తరుణంలో పట్నా హైకోర్టు తీర్పు విపక్షాల కూటమికి కొత్త బలాన్ని ఇచ్చింది.



రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది

- మణిపూర్‌లో శాంతిభద్రతలు అస్సలు లేవు
- దర్యాప్తు చేసే దమ్ము అక్కడి పోలీసులకు లేదు
- మణిపూర్ ఉదంతంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- వ్యక్తిగతంగా హాజరుకావాలని డీజీపీని ఆదేశించిన కోర్టు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల మధ్య వైరంలో మహిళలు సమిధలుగా మారిన వైనాన్ని సర్వోన్నత న్యాయస్థానం మరోమారు తీవ్రంగా తప్పుబట్టింది. మే నాలుగో తేదీన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరులో తిప్పిన ఘటనకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా మణిపూర్‌లో శాంతిభద్రతలు, పోలీసుల పనితీరును సుప్రీంకోర్టు తూర్పారబట్టింది. సోమవారం జరిగిన కేసుల వాదోపవాదాలు మంగళవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందించింది. 'కేసులను సమర్థవంతంగా దర్యాప్తుచేయలేని స్థితిలో పోలీసులున్నారు. దర్యాప్తులో దమ్ము, చురుకుతనం లేదు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనల్లో ఆరువేలకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైతే ఎంత మందిని అరెస్టుచేశారు? నగ్న పరేడ్‌కు సంబంధించిన జీరో ఎఫ్ఐఆర్, సాధారణ ఎఫ్ఐఆర్, పూర్తి వివరాలు ఉన్నాయా ? హేయమైన ఘటన జరిగిన చాలా రోజులకు ఎఫ్ఐఆర్ నమోదైంది. కొన్ని ప్రాంతాల్లోకి పోలీసులు కూడా వెళ్లలేని అసమర్థత. పరిస్థితి చేయి దాటడంతో అరెస్టులు చేయలేని దుస్థితి. అక్కడ అసలు శాంతిభద్రతలు అనేవే లేవు. రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

6,523 ఎఫ్ఐఆర్‌ల నమోదు

కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాల తరఫున కోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి వివరణ ఇచ్చారు. 'మేలో హింస మొదలైననాటి నుంచి ఇప్పటిదాకా 6,523 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నగ్న పరేడ్ ఉదంతంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో జువెనైల్‌సహా ఏడుగురిని అరెస్ట్‌చేశారు. ఘటన తర్వాత బాధిత మహిళల వాంగ్మూలం తీసుకున్నారు' అని తెలిపారు. ఈ కేసులో 11 కేసులను సీబీఐకి బదిలీచేస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. కాగా, వాంగ్మూలాల కోసం ఆ మహిళలను మళ్లీ విచారించవద్దని సీబీఐకు కోర్టు సూచించింది. తమ ముందు హాజరుకావాలని బాధిత మహిళలను సీబీఐ ఆదేశించిందన్న అంశాన్ని వారి లాయర్ నిజాం పాషా మంగళవారం కోర్టు దృష్టికి తీసుకురావడంతో ధర్మాసనం పై విధంగా మౌఖిక ఆదేశాలిచ్చింది. ఏడో తేదీ(సోమవారం రోజు)న స్వయంగా హాజరై వివరాలు తెలపాలని మణిపూర్ డీజీపీని కోర్టు ఆదేశించింది. 6,523 కేసుల్లో హత్య, రేప్, బెదిరింపులు, లూటీలు, విధ్వంసం ఇలా వేర్వేరుగా కేసులను విభజించి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

అవిశ్వాసం ఉంటే అభివృద్ధి అసాధ్యం

ప్రధాని మోదీ వెల్లడి

- తొమ్మిదేళ్లలో భారీ మార్పునకు ప్రజలు నాంది పలికారు
- దేశాన్ని ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చారు
- మోదీకి 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం' ప్రదానం




పురస్కారం స్వీకరిస్తున్న ప్రధాని

పుణే: అవిశ్వాసం ఉన్నచోట అభివృద్ధి సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశంలో ప్రభుత్వ విధానాల్లో, ప్రజల కష్టపడి పనిచేసే తత్వంలో అపరిమితమైన విశ్వాసాన్ని నేడు మనం చూస్తున్నామని చెప్పారు. మహారాష్ట్రలోని పుణేలో మంగళవారం 'లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు'ను మోదీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకున్నారు. ఎన్సీపీలో చీలిక తర్వాత ప్రధాని మోదీ, శరద్ పవార్ ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే మొదటిసారి. వారిద్దరూ సరదాగా మాట్లాడుకున్నారు. పురస్కార ప్రదానోత్సవంలో మోదీ మాట్లాడుతూ... విశ్వాస లేమి నుంచి అధిక విశ్వాసం దాకా భారతదేశ ప్రయాణం సాగిందని అన్నారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సర్వే గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వాన్ని ప్రజలు అత్యధికంగా విశ్వసిస్తున్న దేశాల్లో భారత్ ఉన్నట్లు ఆ సర్వేలో తేలిందన్నారు. గత తొమ్మిదేళ్లలో దేశంలో భారీ మార్పునకు ప్రజలు నాంది పలికారని, దేశాన్ని ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చారని ప్రశంసించారు.

రోడ్ల పేర్లు మారిస్తే కొందరికి నిద్రలేని రాత్రులు

మీడియా స్వేచ్ఛ ప్రాధాన్యతను లోకమాన్య తిలక్ ఆనాడే చాటిచెప్పారని, స్వాతంత్ర్య పోరాట పంథాను సైతం మార్చారని ప్రధాని మోదీ కొనియాడారు. తిలక్ జీవితం ఆదర్శప్రాయమని శ్లాఘించారు. తిలక్ పేరిట నెలకొల్పిన అవార్డును అందుకోవడంతో తన బాధ్యత మరింత పెరిగినట్లు భావిస్తున్నానని తెలిపారు. మన దేశంపై దండెత్తిన విదేశీయుల పేరిట ఉన్న రోడ్ల పేర్లను మార్చి, భారతీయుల పేర్లు పెడితే కొందరు తట్టుకోలేకపోతున్నారని, అరిచి గోల చేస్తున్నారని, నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని మోదీ మండిపడ్డారు. కోవిడ్–19 వైరస్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో మన సైంటిస్టులపై నమ్మకం పెట్టుకున్నామని, వారు వ్యాక్సిన్ అభివృద్ధి చేసి ఇచ్చారని గుర్తుచేశారు. వ్యాక్సిన్ అభివృద్ధిలో పుణే నగరం పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం కింద తనకు లభించిన రూ.లక్ష నగదును నమామీ గంగా ప్రాజెక్టుకు అందజేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ముద్రా పథకం కింద రుణాలు, స్వచ్ఛ భారత్, బేటీ బచావో, బేటీ పడావో, అమృత్ కాల్, కర్తవ్య కాల్ వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి సర్జికల్ స్ట్రైక్ ఛత్రపతి శివాజీ మహారాజ్ హయాంలోనే జరిగిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో రెండు శకాలు ఉన్నాయని, అవి తిలక్ శకం, గాంధీ శకమని పేర్కొన్నారు. ఇతరుల భూమిని శివాజీ ఏనాడూ ఆక్రమించలేదని పవార్ గుర్తుచేశారు. ఇతర పార్టీలను చీలుస్తున్న బీజేపీ తీరును పరోక్షంగా తప్పుపట్టారు. లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని 1983లో మహారాష్ట్రలో నెలకొల్పారు. తిలక్ వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా ఆగస్టు 1న ఈ అవార్డును ప్రదానం చేస్తుంటారు.



కార్యక్రమంలో పవార్‌తో మోదీ మాటామంతీ

టాప్50 ఎగవేతదారుల బకాయిలు రూ.87 వేల కోట్లు

న్యూఢిల్లీ: గీతాంజలి జెమ్స్..ఇరా ఇన్‌ఫ్రా.. ఆర్ఈఐ ఆగ్రో.. ఏబీజీ షిప్‌యార్డు తదితర టాప్–50 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు(సంస్థలు) దేశంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సుమారు రూ.87,295 కోట్ల మేర బకాయి పడ్డారు. ఇందులో టాప్–10 మంది ఎగవేతదారులు రూ.40,825 కోట్ల మేర షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకు(ఎస్సీబీ)లకు బకాయి ఉన్నారని కేంద్రం తెలిపింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గత అయిదు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి ఎస్సీబీలు మొత్తం రూ.10,57,326 కోట్ల మేర రుణాలను మాఫీ చేసినట్లు ఆర్‌బీఐ తెలిపిందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి టాప్–50 ఉద్దేశపూర్వక డిఫాల్టర్లు ఎస్సీబీలకు రూ.87,295 కోట్ల బకాయి పడినట్లు ఆర్‌బీఐ తెలిపిందన్నారు. ఇందులో పరారైన ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ సంస్థ అత్యధికంగా రూ.8,738 కోట్లు ఎస్సీబీలకు బకాయి పడింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులతో బ్యాంకులు రాజీ ఒప్పందం కుదుర్చుకునేందుకు వీలు కల్పించే నిబంధన 2007 నుంచే ఉందని మంత్రి వివరించారు. మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన..2022–23 సంవత్సరాల్లో నమోదైన 66,069 ఆన్‌లైన్ మోసాల ఘటనల్లో రూ.85.25 కోట్ల మేర నష్టం జరిగిందని చెప్పారు.

నిర్మాణదశలో ఘోర ప్రమాదం

- గిర్డర్ లాంచర్ కుప్పకూలడంతో 20 మంది కార్మికుల దుర్మరణం
- మహారాష్ట్రలో సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే వద్ద ఘటన

ముంబై: మహారాష్ట్రలో నిర్మాణంలో ఉన్న సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే వద్ద ఘోర ప్రమాదం జరిగింది. వంతెనలోని శ్లాబులను యథాస్థానంలో కూర్చోబెట్టేందుకు వినియోగించే గిర్డర్ లాంఛర్ కుప్పకూలడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సెగ్మెంట్ లాంచర్(క్రేన్)తో కలుపుకుని దాదాపు 700 టన్నుల బరువైన గిర్డర్ లాంఛర్ 35 మీటర్ల ఎత్తునుంచి కిందకు కుప్పకూలింది. దీంతో అక్కడే పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది దాని కింద నలిగిపోయారు. ఈ ఘోర దుర్ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబైను నాగ్‌పూర్‌ను కలుపుతూ 701 కిలోమీటర్ల పొడవైన సమృద్ధి మహామార్గ్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తున్నారు. ముంబైకి 80 కి.మీ.ల దూరంలో థానె జిల్లాలో సార్లాంబే గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రిదాటాక ఈ ఘటన జరిగింది. ఘటనపై నిపుణులతో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినట్లు ఉపముఖ్యమంత్రి ఫడ్నవిస్ చెప్పారు. పోతపోసిన బాక్స్ శ్లాబులను తర్వాతి రోజు నిర్మాణం కోసం సిద్ధంచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామన ప్రధాని ప్రకటించారు. తలో రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. దుర్ఘటన నేపథ్యంలో సంబంధిత ఇద్దరు కాంట్రాక్టర్లపై పోలీసులు కేసు నమోదుచేశారు. మొత్తం ఎక్స్‌ప్రెస్‌వేలో ఇప్పటికే 600 కి.మీ.ల మేర నిర్మాణం పూర్తయి రాకపోకలు సైతం మొదలయ్యాయి. ఈ 101 కి.మీ.ల నిర్మాణ పనులు కొనసాగుతాయి. ఈ ఎక్స్‌ప్రెస్‌వే మీద గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 88 మంది ప్రాణాలు కోల్పోయారు.

'హరియాణా' ఘర్షణల్లో ఐదుకు చేరిన మరణాలు

గురుగ్రామ్/చండీగఢ్: హరియాణాలోని నుహ్ జిల్లాలో మొదలైన మత ఘర్షణలు పొరుగునే ఉన్న గురుగ్రామ్‌కు పాకాయి. వివిధ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు అయిదుగురు చనిపోయారని పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం నుహ్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల్లో ఇద్దరు హోంగార్డులు సహా నలుగురు మృతి చెందారు. మరో 23 మంది క్షతగాత్రులు కాగా వారిలో పోలీసులు 10 మంది ఉన్నారు. ముగ్గురు పోలీసు అధికారులకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలపై పోలీసులు 11 కేసులు నమోదు చేసి, 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. నుహ్ జిల్లాలో జరిగిన గొడవల్లో 120 వాహనాలకు దుండగులు నిప్పుపెట్టారు. ఇందులో 8 వాహనాలు పోలీసు అధికారులవే. సోహ్నాలో కొన్ని దుకాణాలకు సైతం ఆందోళనకారులు నిప్పుపెట్టారు. గురుగ్రామ్‌లో జరిగిన కాల్పుల ఘటనల్లో గాయపడిన ఇద్దరిలో ఒకరు చనిపోయారని పోలీసులు చెప్పారు. ఈ ఘటనల నేపథ్యంలో నుహ్ జిల్లాలో కర్ఫ్యూ విధించినట్లు హోం మంత్రి విజ్ చెప్పారు. పథకం ప్రకారమే కొందరు ఘర్షణలకు దిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. గొడవలకు కారణమైన వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ప్రశాంతంగానే ఉన్నాయన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో 20 కంపెనీల కేంద్ర బలగాలను తరలించనున్నారు. నుహ్, ఫరీదాబాద్‌ల్లో ఇంటర్నెట్ సేవలను బుధవారం వరకు నిలిపివేశారు. నుహ్, ఫరీదాబాద్, పల్వాల్ జిల్లాల్లో విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. అన్ని మత సంస్థల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నుహ్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పవార్, ఎస్పీ నరేంద్ర సింగ్ అన్ని వర్గాల ప్రతినిధులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు.



దగ్ధమైన పోలీస్ వాహనం



మంగళవారం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కుకీ వర్గం ప్రజల ఇళ్లకు నిప్పుపెట్టిన దృశ్యం. ఈ మంటల్లో బిహార్, హరియాణా, నాగాలాండ్ వలసదారులకు చెందిన డజనుపైగా ఇళ్లు సైతం కాలిబూడిదయ్యాయి.

8న అవిశ్వాసం

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళనకి దిగారు. ప్రకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే స్పందించాలంటూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో 'ఢిల్లీ' బిల్లు

లోక్‌సభ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. కొందరు వెల్‌లోకి దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ స్థానం పక్కనే నిల్చున్నారు. నినాదాలతో హోరెత్తించారు. ఇంతలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. హరియాణాలో జరిగిన హింసను బీఎస్పీ ఎంపీ కున్వర్ డానిష్ సభలో ప్రస్తావించారు. నినాదాలు, అరుపులతో గందరగోళం నెలకొనడంతో 15 నిమిషాల్లోనే స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు, నిరసనలకు తెరపడకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో జనన, మరణాల రిజిస్ట్రేషన్(సవరణ) బిల్లు, ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్(డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ బిల్లు, కానిస్టిట్యూషన్(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ అమెండ్‌మెంట్ బిల్లుపై స్వల్ప వ్యవధిపాటు చర్చించి, ఆమోదించారు. అలాగే దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ పాలనా సేవల నియంత్రణ కోసం ఉద్దేశించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023ని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ సభలో విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. తమ చేతుల్లోని కాగితాలను చించి విసిరేశారు. వారి తీరును కేంద్ర హోంశాఖ అమిత్ షా తప్పుపట్టారు. విపక్ష ఎంపీల నిరసన కేవలం రాజకీయ ప్రేరేపితమని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం ఢిల్లీకి సంబంధించిన చట్టాలను చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని గుర్తుచేశారు.

'ఇండియా' ఎంపీల వాకౌట్

మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడాన్ని నిరసిస్తూ రాజ్యసభ నుంచి ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో వాకౌట్ చేశారు. అంతకుముందు మణిపూర్ అంశంపై విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో రాజ్యసభ పలుమార్లు వాయిదా పడింది. ప్రతిపక్షాల నినాదాల మధ్యే చైర్మన్ ధన్‌ఖడ్ ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. సభలో ఎంపీల ప్రవర్తన ప్రజల దృష్టిలో హాస్యాస్పదంగా మారుతోందని చెప్పారు. మణిపూర్ హింసపై చర్చ కోసం రూల్ 267 కింద విపక్ష ఎంపీలు ఇచ్చిన 60 నోటీసులను ఆయన తిరస్కరించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖకు సంబంధించిన 'సిటిజెన్స్ డేటా సెక్యూరిటీ, ప్రైవసీ'పై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికపై సీపీఎం సభ్యుడు జాన్ లేవనెత్తిన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను ధన్‌ఖడ్ తోసిపుచ్చారు. సహకార సంఘాల బలోపేతంకు ఉద్దేశించిన మల్టీ–స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీస్(అమెండ్‌మెంట్) బిల్లును ఎగువసభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు.

నేడు రాష్ట్రపతితో ప్రతిపక్ష కూటమి భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేతలు నేడు రాష్ట్రపతి ముర్మూతో భేటీ అయి మణిపూర్ అంశంపై చర్చించనున్నారు. విపక్ష పార్టీల తరఫున కాంగ్రెస్ చీఫ్ ఖర్గే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరారు. మణిపూర్ అంశంపై ప్రధాని పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేయాలని, దీనిపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలన్న తమ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడం వంటి అంశాలపై రాష్ట్రపతికి వివరించనున్నారు.

అంగ్ సాన్ సూకీ జైలు శిక్ష తగ్గింపు

బ్యాంకాక్: పదవీచ్యుతురాలైన అంగ్ సాన్ సూకీ(78) జైలు శిక్షను తగ్గిస్తున్నట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. రెండున్నరేళ్ల క్రితం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సూకీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సైనిక పాలకులు కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అనంతరం సూకీపై 19 నేరారోపణలు మోపారు. వీటిలో కొన్నిటిపై విచారణ జరిపిన సైనిక కోర్టులు సూకీకి 33 ఏళ్ల జైలు శిక్షలు విధించాయి. బౌద్ధులు మెజారిటీగా ఉన్న మయన్మార్‌లో మంగళవారం 'గౌతమ బుద్ధుని మొదటి ఉపన్యాస'దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ సందర్భంగా మిలటరీ కౌన్సిల్ చీఫ్, సీనియర్ జనరల్ మిన్ సుమారు 7 వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించారు. వీరిలో సూకీ, మాజీ అధ్యక్షుడు విన్‌మింట్ ఉన్నారు. సూకీకి ఆరేళ్ల జైలు శిక్షను తగ్గిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రకారం, ఆమె మరో 27 ఏళ్లపాటు జైలు జీవితం గడపాలి.

భారత్‌తో చర్చలకు సిద్ధమే: షెహబాజ్

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఇరు దేశాల్లో పేదరికం, నిరుద్యోగంతో పోరాడుతున్న నేపథ్యంలో యుద్ధం అనేది మార్గం కాదన్నారు. పాకిస్తాన్ మినరల్స్ సమ్మిట్ సమావేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో షెహబాజ్ పాల్గొన్నారు.. ఆర్థికంగా కుదేలైన దేశంలో విదేశీ పెట్టుబడుల కోసం ఉద్దేశించిన ఈ సదస్సులో హెహబాజ్ మాట్లాడుతూ పాకిస్తాన్ కోలుకోవడం కోసం ఇరుగు పొరుగు దేశలన్నింటితోనూ తాము మాట్లాడతామని, పొరుగు దేశంతో యుద్ధం అనేది ఇక మార్గం కాదన్నారు. భారత్‌తో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కశ్మీర్ అంశంలో సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రేరేపిస్తూ ఉండడంతో ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాక్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

పవన్ ముంజాల్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా హీరో మోటో కార్ప్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పవన్ ముంజాల్‌తోపాటు ఇతరుల నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, గుర్గావ్‌లో ఈ సోదాలు జరిగినట్లు వెల్లడించారు. పవన్ ముంజాల్‌తోపాటు ఇతర నిందితులపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ గతంలోనే కేసు నమోదు చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్(సీబీఐసీ) ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఈడీ దర్యాప్తునకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని హీరో మోటో కార్ప్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఢిల్లీ, గుర్గావ్‌లో పవన్ ముంజాల్ నివాసం, రెండు ఆఫీసుల్లో సోదాలు జరిగాయని తెలియజేసింది. పన్నుల ఎగవేత కేసులో ఐటీ శాఖ గత ఏడాది మార్చిలో పవన్ ముంజాల్ ఇంట్లో సోదాలు నిర్వహించింది.

ఢిల్లీ బిల్లుపై కేంద్రానికి బీజేడీ మద్దతు

న్యూఢిల్లీ: ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుకు ఒడిశా అధికార పక్షం బిజూ జనతా దళ్(బీజేడీ) మద్దతివ్వనుంది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి సైతం వ్యతిరేకంగా ఓటేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బీజేడీ నిర్ణయాన్ని మంగళవారం రాజ్యసభలో ఆ పార్టీ నేత సస్మిత్ పాత్ర ప్రకటించారు. బీజేడీ నిర్ణయం ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో పార్లమెంట్‌లో ముఖ్యంగా రాజ్యసభలో కేంద్రానికి పెద్ద ఊరటనివ్వనుంది. బీజేపీ కూటమితోగానీ ప్రతిపక్షాలతోగానీ జట్టుకట్టకుండా ఢిల్లీ ఆర్డినెన్స్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తర్వాత కేంద్రానికి మద్దతు పలికిన రెండో పార్టీ బీజేడీ. రాజ్యసభలో అధికార పక్షంపై ప్రతిపక్ష పార్టీలదే పైచేయిగా ఉంది. బీజేడీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల నిర్ణయంతో రాజ్యసభలో కేంద్రం తీసుకొచ్చే బిల్లును ఓడించాలన్న ప్రతిపక్షాల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్, బీజేడీలకు చెరో 9 మంది సభ్యుల బలముంది. ఈ రెండు పార్టీల 18 మంది సభ్యుల మద్దతుతో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లు రాజ్యసభలో నెగ్గేందుకు అవకాశమేర్పడింది.

మైనార్టీలకు దగ్గరవడానికి కార్యక్రమాలు

బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ రద్దు నిర్ణయం వల్ల ముస్లిం మహిళలకు ఎనలేని భద్రత లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ముస్లిం మహిళల పురోగతికి తాము చేపడుతున్న చర్యల గురించి అందరిలోనూ అవగాహన పెంచాలని తనను కలిసిన పార్టీ ఎంపీలకు చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ ఎంపీలు ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎంపీలతో మాట్లాడుతూ 2024 ఎన్నికలకు అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. రానున్న రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మైనార్టీ వర్గాల ప్రయోజనాల కోసం కేంద్రం తీసుకున్న చర్యల్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రధాని చెప్పినట్టుగా కొందరు ఎంపీలు వెల్లడించారు.

సాక్షి
కరీంనగర్

బుధవారం । 2 । ఆగస్టు । 2023

కలెక్టర్‌ను కలిసిన డీటీసీ



కరీంనగర్: కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్‌ను ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రిని కలిసిన ట్రాఫిక్ ఏసీపీ

కరీంనగర్‌క్రైం: ట్రాఫిక్ ఏసీపీగా నియమితులైన నర్సర్ మంగళవారం రాత్రి బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిశారు. బొకే అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/25.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘టెట్’ దరఖాస్తులు ఈ రోజు నుంచే..

- సెప్టెంబర్ 15న పరీక్ష... 27న ఫలితాలు

కరీంనగర్: ఎట్టకేలకు టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నేటి నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, రాతపరీక్ష సెప్టెంబర్ 15న జరుగనుంది. 27న ఫలితాలు వెల్లడించనున్నారు. జిల్లాలో ఏటా దాదాపు 1500 మందికి పైగా అభ్యర్థులు డీఎడ్, బీఈడీ పూర్తి చేసి టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రెండు, మూడేళ్లల్లో డీఎడ్,బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు వేలల్లో ఉండటం విశేషం. గతేడాది నిర్వహించిన టెట్ పేపర్-1కు 16, 936 మంది, పేపర్-2కు 15,393 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఉత్తీర్ణత సాధించిన వారి సంఖ్య 40శాతం దాటలేదు. కొత్త జిల్లాల ప్రతిపాదికన టీఆర్టీ నిర్వహించనుండడంతో రెండేళ్లలో జిల్లాలో సుమారు 3వేల మందికిపైగా డీఎడ్, బీఎడ్ అర్హత సాధించి ఉండొచ్చని విద్యాశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ లెక్కల తరువాత 300 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది.

ఆటో డ్రైవర్ల దినోత్సవం



కరీంనగర్: ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ వై.సునీల్‌రావు, నగర బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆటో డ్రైవర్ల సంఘ భవనానికి 10గుంటల భూమి, రూ.20 లక్షలు కేటాయించినట్లు వివరించారు. అనంతరం మేయర్ వై.సునీల్‌రావు సరదాగా కాసేపు ఆటో నడిపారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, చెలుమల్ల రామచంద్రం, ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దెల రాజేందర్, బండారి సంపత్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కళ్ల కలకపై జాగ్రత్తగా ఉండండి



కరీంనగర్‌టౌన్: కళ్లకలక కేసులు పెరుగుతున్న దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా వైద్యశాఖ అధికారులతో జూమ్‌మీటింగ్ నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... రోజురోజుకు కళ్లకలక కేసులు పెరుగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలో ఉండే విద్యార్థులకు కళ్లకలక వచ్చినట్లయితే, ఆ పిల్లల్ని వేరుచేసి తగిన విధంగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, జిల్లా ప్రధాన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా సుధాకర్



కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.జగత్‌సింగ్ బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయనను ఉన్నతాధికారులు హనుమకొండకు బదిలీ చేశారు. కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ గడ్డం సుధాకర్ ఏవోగా వ్యవహరించనున్నారు. అయితే జూన్ 15న ఏవోగా సుధాకర్, అర్బన్ తహసీల్దార్‌గా జగత్ సింగ్‌ను నియమించగా డిప్యూటేషన్‌పై ఏవోగా జగత్‌సింగ్, అర్బన్ తహసీల్దార్‌గా సుధాకర్ వ్యవహరించారు. కరీంనగర్ అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కముటం శ్రవణ్‌కుమార్ వ్యవహరించనున్నారు.

కవిత్వం వర్తమానాన్ని ప్రతిబింబించాలి

కరీంనగర్‌కల్చరల్: సమాజంలో జరుగుతున్న వర్తమాన రాజకీయాలు, సంఘటనలు అలజడులు, మానవ జీవితాల్లోని సంఘర్షణ కవిత్వానికి వస్తువు కావాలని, ప్రజలను చైతన్య పర్చాలని తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం విద్యానగర్‌లో గల సెయింట్‌జార్జ్ పాఠశాలలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఎన్నీల ముచ్చట్లకు హాజరై మాట్లాడారు. ప్రజలు చైతన్యంగా ఉన్నప్పుడే సమాజం ప్రగతిశీల మార్గంలో ముందుకు వెళ్తుందన్నారు. గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, దామరకుంట శంకరయ్య, పెనుగొండ బసవేశ్వర్, వడ్డేపల్లి రాజేశం, మధుశ్రీ, రవీందర్ పాల్గొన్నారు.



ఈ రైతు రాజిరెడ్డి. తిమ్మాపూర్‌లో రెండెకరాల భూమిని కొనుగోలు చేశారు. 2002లో సాదాబైనామా కాగితంపై కొనుగోలు చేయగా విక్రయించిన రైతు పదేళ్ల క్రితం మరణించారు. మోకాపై రాజిరెడ్డి పంటలు పండిస్తున్నప్పటికీ.. రికార్డుపరంగా మాత్రం విక్రయించిన రైతు పేరే కనిపిస్తోంది. 2016లో ప్రభుత్వం సాదాబైనామాలకు అవకాశం కల్పించగా దరఖాస్తు చేశారు. ఇప్పటికీ రికార్డుపై ఇతని పేరు చేరలేదు. కేవలం రాజిరెడ్డి కాదు జిల్లాలో ఇలాంటి వారు వేలల్లో ఉండగా నిరీక్షణ తప్పడం లేదు.

‘సాదా’ సీదా అయ్యేనా?



నగరంలోని మీసేవలో దరఖాస్తు చేస్తున్న రైతులు(ఫైల్)

- సాదాబైనామాలపై అన్నదాతల నిరీక్షణ
- రైతుబంధు, పంట రుణాలకు దూరం
- ఇప్పటికే రెండుసార్లు అర్జీల స్వీకరణ..పరిష్కారమేది?
- వేల ఎకరాలు ప్రభుత్వ పథకాలకు దూరం

గతంలో జిల్లాలో	
వచ్చిన అర్జీలు:	87,084
పరిశీలించినవి:	86,732
పట్టాలు జారీ:	16,700
తిరస్కరించినవి:	18, 000

దరఖాస్తుల తీరిలా...

డివిజన్	దరఖాస్తులు	పరిశీలన
కరీంనగర్	36,095	35,939
హుజూరాబాద్	50,989	50,793

కరీంనగర్ అర్బన్:

సాదాబైనామాపై భూములు కొనుగోలు చేసిన రైతులకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం గుదిబండగా మారింది. 2014 జూన్ 2లోపు కాగితంపై భూములను కొనుగోలు చేసిన వారికి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించగా ఏళ్లుగా నాన్చుతుండటం ఆందోళనకర పరిణామం. 2020 అక్టోబర్‌లో దరఖాస్తులకు అవకాశమివ్వగా ఇప్పటికి కొలిక్కి రాకపోవడం శోచనీయం.

ఏళ్లుగా కాలయాపన

జిల్లాలో సర్వేనంబర్ల వారీగా 87,084 దరఖాస్తులు రాగా 18వేలకు పైగా అర్జీలను తిరస్కరించారు. అయితే సాదాబైనామా దరఖాస్తులకు 1994వరకు చట్టబద్ధత కల్పించారు. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేతిరాత కాగితాలకు గుర్తింపు లభించగా తిరిగి రెండున్నర దశాబ్దాల అనంతరం సీఎం కేసీఆర్ రెండుసార్లు సదవకాశాన్ని కల్పించారు. కాగా అప్పటి నుంచి పంట రుణాలకు నోచుకోక..

సడలించినా.. ఫలితమేది?

సాదాబైనామాల అర్జీలకు అవకాశమిచ్చిన తొలిసారి వాటిని క్రమబద్ధీకరించేందుకు తొలుత ఆర్డీవోలను బాధ్యులను చేసింది. ప్రతి దరఖాస్తును సదరు అధికారి పరిశీలించిన తదుపరి పట్టా జారీ చేయాలని పేర్కొంది. వేల దరఖాస్తులను సదరు అధికారి పరిశీలించడం అసాధ్యమని భావించిన ప్రభుత్వం తహసీల్దార్లకే పూర్తిస్థాయి బాధ్యతలప్పగించింది. రైతులు ఆన్‌లైన్‌లో ఫారం 10 ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సాదాబైనామా విక్రయాన్ని క్రమబద్ధీకరించేందుకు తహసీల్దార్లు 13బి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 1బిలో నమోదు చేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకం అందించాల్సి ఉంటుంది. విక్రయదారులకు నోటీసులు జారీ చేయడం, వాంగ్మూలం నమోదులో వీరి పాత్ర కీలకం. ఇందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తుండగా తమ వేలిముద్రలు వేసి రైతులకు హక్కు పత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఎక్కడ పొరపాటు జరిగినా తహసీల్దార్లదే బాధ్యత. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ రద్దుతో సాదాబైనామా దరఖాస్తులను గిర్దావర్లే పరిశీలించాలని గతంలోనే నిర్దేశించింది.

కొనుగోలు చేసిన భూమిని అమ్ముకోలేక నానాఇక్కట్లు పడుతున్న రైతులు యంత్రాంగం కరుణ కోసం నిరీక్షిస్తున్నారు. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనమాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులతో పాటు రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు 25 వేలకు పైగా దరఖాస్తుల్లో ఎలాంటి వివాదాలు లేనివిగా గుర్తించారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తే జిల్లాలో సుమారు 25వేలకు పైగా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు రైతుబంధు, బీమా వంటి పథకాలను అందుకోలేకపోతున్నారు. దీనికి తోడు భూములపై హక్కు పత్రాలుంటే వాటి ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు దక్కనుంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

మెడికల్ కాలేజీ పనులు పూర్తిచేయాలి



కళాశాలలో తరగతిగదుల నిర్మాణంపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గోపి

కొత్తపల్లి/కరీంనగర్ టౌన్: కరీంనగర్ వైద్య కళాశాల ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బి.గోపి ఆదేశించారు. వైద్య కళాశాల తరగతి గదుల కోసం కొత్తపల్లి శివారులోని విత్తనశుద్ధి కర్మాగార గోదాముల్లో చేపడుతున్న ఆధునీకరణ పనులతో పాటు జిల్లా ఆసుపత్రిలోని పలు విభాగాలను మంగళవారం పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా గాలి, వెలుతురు స్పష్టంగా ఉండేలా చూడాలని సూచించారు.భోజనం, అల్పాహారం కోసం మెప్మావారితో క్యాంటిన్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని ఓపీ, జనరల్ వార్డు, ప్రసూతి విభాగం, రేడియాలజీ, డయోగ్నోస్టిక్ తదితర విభాగాలను పరిశీలించారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులు పరిశీలించారు. సామ్, మామ్ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అడిషనల్ డీఎంహెచ్‌వో సుజాత, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషన్ ప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎంఓ జ్యోతి, అడిషనల్ ఆర్ఎంవో నవీన పాల్గొన్నారు.

అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా

కరీంనగర్ అర్బన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల క్రమంలో అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ బి.గోపి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌పై సమీక్షించారు. జిల్లాలోని 1338 పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు సేకరించడానికి 4నియోజకవర్గాల్లో సమావేశాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు.కరీంనగర్‌లో 390కేంద్రాలకు 11 కేంద్రాలను, 19 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు చేయడం జరిగిందని, చొప్పదండి నియోజకవర్గంలో 327 కేంద్రాలలో 25 పోలింగ్ కేంద్రాలను, 18 పేర్లు మార్పు చేయడం జరిగిందని, మానకొండూర్‌లో 316 కేంద్రాలలో 6 కేంద్రాలను, 1 పేర్లు మార్పు చేయడం జరిగిందని, హుజురాబాద్ నియోజకవర్గంలో 305 కేంద్రాలలో 1 కేంద్రాన్ని మార్పు చేయడం జరిగిందని, 6 పేర్లు మార్పు చేయడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు.

శాతవాహనలో తీజ్ వేడుకలు



శాతవాహనయూనివర్సిటీలో బంజారా సంప్రదాయ పండుగైన తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు నృత్యాలు చేశారు. ఇన్‌చార్జీ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ డీకే పద్మావతితో పాటు శాంతినగర్ సేవాఘడ్ కమిటీ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

అక్రమాల గడబిడ

- అధికారులకు వరంలా ‘అత్యవసర’ పనులు
- గడువులోగా పూర్తయినా.. నాణ్యత ప్రశ్నార్థకం



ఖాన్‌పుర పనుల్లో పగిలిన పైప్‌ల వినియోగం

కరీంనగర్ కార్పొరేషన్: ‘ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కరీంనగర్‌లో పర్యటించారు. మంత్రి వచ్చే సమయానికి నగరపాలకసంస్థ కార్యాలయాన్ని ఆధునీకరించాలని నిర్ణయించారు. గడువులోగా పనులు పూర్తిచేసే కాంట్రాక్టర్‌ను వెతికి పట్టుకున్నారు. ఆ కాంట్రాక్టర్ కూడా కేటీఆర్ పర్యటనకు కొన్ని గంటల ముందు వరకు రాత్రింబవళ్లు కష్టపడి పనులు చేశారు. ఇక్కడివరకు బాగానే ఉంది. కానీ..ఈ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్ పర్యటన ముగిసిన తర్వాత ఇప్పటికే కొన్ని చోట్ల మెటీరియల్‌ను మార్చడం అనుమానాలకు బలం చేకూర్చుతోంది’.

ఇటీవల నగరంలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. 4వ డివిజన్ ఖాన్‌పుర ప్రవిష్ట ప్రాంతంలో వరద తీవ్రరూపం దాల్చింది. వరదనీటిని మళ్లించేందుకు హడావుడిగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తున్నారు. కాగా ఈ పనుల్లో పగిలిన నాసిరకం పైప్‌లు వేస్తున్నారనే ఫిర్యాదు ఉన్నాయి. నిర్ణీత కాలవ్యవధిలో శరవేగంగా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు ప్రజాప్రతినిధుల అభినందనలు పక్కనపెడితే, హడావుడి పనుల్లో జరుగుతున్న అక్రమాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. పనులు నిర్ణీత గడువులోగా ‘అత్యవసరంగా’ పూర్తి చేయడం వరకు బాగానే ఉన్నా.. నాణ్యత మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. ఏదైనా అభివృద్ధి పని చేయాలంటే అంచనాలు, టెండర్ తదితర ప్రక్రియ ఉంటుంది. కానీ.. ఈ అత్యవసరంగా పూర్తిచేసే పనుల్లో అసలు పనులు చేయడమే గొప్పగా భావించే క్రమంలో నాణ్యతను పట్టించుకునే పరిస్థితి ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నా యి. వరదతో నెలకొంటున్న ఇబ్బందులను దూరం చేయడానికి హడావుడిగా పైప్‌లు వేసి నీళ్లను డ్రైనేజీల్లోకి మళ్లించడం సరైందే అయినప్పటికీ, నాణ్యతను పట్టించుకోకపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుందని స్థానికులు అంటున్నారు. ఖాన్‌పురలో ఇదే తరహాలో పనులు జరుగుతున్నా... పగి లిన పైప్‌లు, ఐఎస్‌ఐ మార్క్‌లేని పైప్‌లు వాడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు.ఒకరిద్దరు కాంట్రాక్టర్లు నాణ్యతను పాటిస్తుండగా, కొంతమంది ఈ హడావుడి పనులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శ ఉంది. కొంతమంది ఇంజినీరింగ్ అధికారులు, వారితో కుమ్మక్కైన కాంట్రాక్టర్లకు ఈ అత్యవసర పనులు ఓ వరంలా మారా యనే చర్చ నగరపాలకసంస్థలో హాట్ టాపిక్‌గా మారింది.

గన్నీతో తూకం వేసేలా చర్యలేవి?

- అదనపు కలెక్టర్‌కు రేషన్ డీలర్ల వినతి



వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

కరీంనగర్ అర్బన్: గన్నీ సంచితో సహా తూకంవేసి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్ కోరారు. గన్నీతో తూకంవేసి ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని.. దీంతో డీలర్లు నష్టపోతున్నారని వివరించారు. మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తూనికలు, కొలతల ఏసీ విజయసారథిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో డీలర్ల వేలిముద్రతో బియ్యం సరఫరా చేయడం స్వాగతిస్తున్నామని, తూకంలో తేడా ఆందోళనకు గురి చేస్తోందన్నారు. గత నెలలో తూకం వేసి బస్తాలు ఇవ్వలేదని, రేషన్ దుకాణాల్లో ఉండాల్సిన స్టాక్ కన్నా తక్కువ స్టాక్ ఉంటుందన్నారు. జిల్లాలో నాలుగు పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారని, గన్నీ బరువుతో కలిపి 50.580 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా అలా ఉండడంలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు గాలి గట్టయ్య, వీరేశం, ధర్మరాజు, రౌతు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వానొస్తే..మునుగుడే



గతనెలలో నీట మునిగిన కాలనీ



రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వరద నీరు వచ్చే దారి

- చిన్నవానకే వణుకుతున్న జమ్మికుంట ప్రజలు
- రెండేళ్లలో రెండుసార్లు మునిగిన హౌసింగ్‌బోర్డు కాలనీ
- వరద కాలువ నిర్మాణంలో తీవ్రజాప్యం
- సమస్య పరిష్కరించాలని పట్టణవాసుల వినతి

జమ్మికుంట: చిన్నవానకే జమ్మికుంట ప్రజలు వణికిపోతున్నారు. వానొస్తే మునుగుడేనా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 6వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ, 8వ వార్డు అంబేద్కర్ కాలనీలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షం నీళ్లు వరదలా ఇళ్లలోకి చేరుతున్నాయి. వర్షాకాలంలో ఆయా కాలనీల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. పదిహేనేళ్లుగా వరదకాలువ నిర్మాణంలో జాప్యం.. అధికారులు పాలకుల నిర్లక్ష్యంతో ఏటా రూ.లక్షల్లో నష్టపోతున్నామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.

ఇదీ సమస్య..

ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి నుంచి పిట్టలవాడ రైల్వే అండర్ బ్రిడ్జి నాలా ద్వారా మురుగు, వర్షం నీరు వస్తుంది. రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి 21ఫీట్ల వెడల్పుతో వరద పారుతోంది. సమీప హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఇళ్లలోకి ఆ నీరు చేరుతోంది. వరద వెళ్లే దారి కబ్జాకు గురికావడంతో సుమారు 15ఏళ్లుగా ఆయా కాలనీలు ముంపునకు గురువుతున్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో నిర్మించిన డ్రైనేజీ నుంచి వరదనీరు వెళ్లడం లేదు. ముంపునకు గురయ్యే కాలనీల్లో నెలరోజుల వరకు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు.

అమలు కాని హామీ..

హౌసింగ్‌బోర్డు కాలనీ తొలిసారి 2021లో వర్షాలకు ముంపునకు గురైంది. 2022 జూలై 21న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, కలెక్టర్ కర్ణన్ కాలనీని పరిశీలించారు. సమస్య పరిష్కారం అయ్యేలా వరదకాలువ నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు నివేదిక పంపించాలని సూచించారు. ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. గతనెల 27న వేకువజామున వర్షం నీళ్లు కాలనీని ముంచెత్తాయి. మళ్లీ నూతన కలెక్టర్ గోపి, సీపీ, తదితరులు కాలనీని సందర్శించగా.. ఈ సారైనా సమస్య పరిష్కరించాలని అని హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు కోరుతున్నారు.

పొలాల్లో ఇసుకమేటలు



పొలంలో ఏర్పడిన ఇసుకమేట

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాట్లు వేసిన పంట పొలాల్లో ఇసుకమేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చెర్లభూత్కూర్‌లోని పోచమ్మ ఒర్రె ఉప్పొంగడంతో సమీపంలోని రైతు అప్పాల లింగయ్య నాటేసిన ఎకరం పదిగుంటల పొలం ఇసుక, మట్టి, రాళ్లతో నిండిపోయింది. ఇసుకమేటను తొలగించి మళ్లీ నాటేయాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రెండుసార్లు మునిగింది



హౌసింగ్‌బోర్డు కాలనీ రెండుసార్లు వర్షాలకు మునిగిపోయింది. ఇళ్లల్లోకి నీరుచేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద కాలువ నిర్మాణం చేపట్టాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. నిధులు మంజూరు చేయడం లేదు. ఇప్పటికైన యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి సమస్య పరిష్కరించాలి.

– శ్రీపతి నరేశ్, 6వ వార్డు కౌన్సిలర్, జమ్మికుంట

రూ.2 లక్షలు నష్టపోయా



నేను కిరాణషాపు నడుపుకుంటూ జీవిస్తుంటా. 2021లో అర్ధరాత్రి వరద ఒక్కసారిగా మా ఇంట్లోకి చేరింది. వస్తువులు మునిగి రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. గతంలో పరిహారంగా రూ.3,800 ఇచ్చారు.గత నెలలో మరోసారి మా ఇల్లు మునిగిపోయింది. ఇంకా పరిహారం ఇవ్వలేదు. కాలనీలోకి వరద రాకుండా చూడాలి.

– కాశీనాథం, కిరాణషాపు, 6వవార్డు, జమ్మికుంట

సమస్య పరిష్కరిస్తాం



వరద రాకుండా చెత్త తొలగించాం. కాలువ సమస్య ఉంది. నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం.

– కె. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఉరుపులు.. ఉద్యోగుల పాట్లు



కరీంనగర్‌అర్బన్‌: జిల్లా కలెక్టరేట్‌ ఉరుపులకు నెలవవుతోంది. గతంలో సుమారు రూ.2 కోట్లతో మరమ్మతులు చేయించగా కొన్నాళ్లకే ఇదీ పరిస్థితి. వర్షం పడిందంటే చాలు ఉరుపులతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయ కారిడార్‌తో పాటు అదనపు కలెక్టర్‌ చాంబర్‌ సమీపంలో, కలెక్టర్‌ చాంబర్‌ సమీపంలోనూ ఉరుపులు ఇక్కట్లకు గురి చేస్తున్నాయి.

కెప్టెన్‌ మధుసూదన్‌రెడ్డికి లీడర్‌షిప్‌ అవార్డు



కరీంనగర్‌ సిటీ: శాతవాహన లయన్స్‌ క్లబర్‌ వ్యవస్థపాక సభ్యుడు కెప్టెన్‌ డాక్టర్‌ మధుసూదన్‌రెడ్డి ప్రతిష్టాత్మక లీడర్‌షిప్‌ అవార్డు అందుకున్నారు. ఏడాదికాలంగా పూర్వ కరీంనగర్‌, ఆదిలాబాదు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న 92లయన్స్‌ క్లబ్బులకు గ్లోబల్‌ లీడర్‌షిప్‌టీం సమన్వయకర్తగా వ్యవహరించడంతో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. జిల్లా ఉపగవర్నర్లు పీవీ.రావు, ఎస్‌.కోదండరాములు, శాతవాహన క్లబ్‌ సీనియర్‌ లయన్స్‌ వై.శేఖర్‌రావు, ఏ.లక్ష్మారెడ్డి, కోట సత్యం అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



కరీంనగర్‌: ఆర్టీసీ కార్మికుల శ్రమను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విప్లవాత్మక నిర్ణయమని మేయర్‌ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. మంగళవారం కరీంనగర్‌ ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ఆర్టీసీ సిబ్బందితో కలిసి సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు తినిపించి సంబురాలు చేశారు. ఆర్టీసీ సిబ్బంది ఆకాంక్షను నిజంచేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ తమ కష్టాలకు ప్రతిఫలంగా ప్రభుత్వంలో విలీనం చేయడం చాలా సంతోషకరమన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌లో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు. బోయవాడకు చెందిన మారం వెంకన్న 2006 నుంచి 2014 వరకు కరీంనగర్‌లోని సర్వోదయ పాఠశాలలో ఉద్యోగం చేశాడు. ఆ తర్వాత పాఠశాల మూతపడగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో పాఠశాలకు సంబంధించిన నకిలీ స్టాంపులు తయారుచేసి కొంతకాలంగా పలువురికి నకిలీ స్టడీసర్టిఫికెట్లు ఇస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు. నిఘా పెట్టిన పోలీసులు వెంకన్నను అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

క్రమశిక్షణ గాడి తప్పిందా..?

- సైనిక శిక్షణ విద్యాలయంలో జూనియర్స్‌ను కొట్టిన సీనియర్స్‌
- పోలీస్‌స్టేషన్‌ వరకు వ్యవహారం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

చొప్పదండి: భావి భారత సైనికులుగా విద్యార్థులను తీర్చిదిద్దే సైనిక శిక్షణ విద్యాలయంలో క్రమ శిక్షణ గాడి తప్పిందా.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం అధికారుల సమన్వయ లోపానికి కారణమవుతోందా.. జూనియర్‌ విద్యార్థులపై సీనియర్‌ విద్యార్థుల ర్యాగింగ్‌, దాడులు బయటకు పొక్కకుండా ఎందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంత జరిగినా ఉన్నతాధికారులు ఎందుకు విచారణ జరపడం లేదు.. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.. అంటూ రుక్మాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇంటర్‌ వరకు విద్యా బోధనతో పాటు సైనిక శిక్షణ ఇచ్చే విద్యాలయంలో ఇటీవల ఎనిమిదో తరగతి విద్యార్థులపై ఇంటర్‌ విద్యార్థులు దాడి చేశారు. విద్యార్థులు విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకురాగా ఆందోళన నిర్వహించి, పోలీస్‌ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. విద్యాలయ అధికారులు రంగ ప్రవేశం చేసి దాడి చేసిన విద్యార్థులకు టీసీలు ఇచ్చి పంపిస్తామని చెప్పి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. సైనిక శిక్షణ, విద్యా బోధన రెండు విభాగాలు ఉండగా, విభాగాధిపతుల మధ్య సమన్వయ లోపం, నిర్లక్ష్యంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు సైనిక శిక్షణ విద్యాలయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



రుక్మాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం

రెండో రోజు కొనసాగిన ఆందోళనలు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చిగురుమామిడి(హుస్నాబాద్‌): తమ గ్రామాన్ని సిద్దిపేట జిల్లాలో కలపవద్దని మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో రెండో రోజు ఆందోళనలు కొనసాగాయి. మంగళవారం స్థానిక అంబేడ్కర్‌ చౌరస్తాలో వార్డు సభ్యులు, గ్రామస్తులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అలాగే మండలపరిషత్‌ అభివృద్ధి అధికారి నర్సయ్యకు తమ గ్రామాన్ని సిద్దిపేట్‌ జిల్లాలో కలపవద్దని విన్నవించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌ పోలోజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 8 మంది వార్డు సభ్యులు మాట్లాడుతూ, హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ తమ గ్రామాన్ని కరీంనగర్‌ జిల్లాలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట్‌లో కలపడం వల్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సయ్యద్‌ ఉసేన్‌బీ, కోల జీవిత, కానవేని స్వరూప, కానవేని వీరవ్వ, పత్తెం తిరుపతి, రాగుల రవీందర్‌, లత, సీపీఐ, కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌, అంబేడ్కర్‌ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సైనిక్‌ స్కూల్‌ విద్యార్థుల ప్రతిభ



కార్తీక్‌



శివ సతీశ్‌

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌ శివారులోని సైనిక్‌ స్కూల్‌ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌–2023 పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్‌ లచ్చయ్య తెలిపారు. ఈ ఏడాది కౌన్సిలింగ్‌లో కార్తిక్‌ ఐఐటీ మద్రాస్‌లో కంప్యూటర్‌ సైన్స్‌లో సీటు పొందాడు. జాతీయ స్థాయి ఓపెన్‌ కేటగిరిలో 2,040, ఎస్సీ కేటగిరీలో 38వ ర్యాంకు సాధించాడు. ఆర్‌. శివసతీశ్‌ గౌహతి ఐఐటీలో కెమికల్‌ ఇంజినీరింగ్‌లో సీటు పొందాడు. ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 751వ ర్యాంకు సాధించాడు. విద్యార్థులను సైనిక్‌ స్కూల్‌ డైరెక్టర్‌ పీఆర్‌ రవికుమార్‌, ప్రిన్సిపాల్‌ లచ్చయ్య, అధ్యాపక బృందం అభినందించారు. గతంలోనూ పలువురు విద్యార్థులు ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్లు సాధించారని తెలిపారు.

‘కాసుల మీదే ప్రేమ...పనులపై లేదు’



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్‌: మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు కాసులమీద ప్రేమ తప్ప, పనులపై లేదని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. వర్షాలతో నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో రహదారులు ధ్వంసమయ్యాయని ఆరోపించారు. లోతట్టు, లోలెవల్‌ కాజ్‌వేల వద్ద ప్రమాదం ఉందని తెలసీ రహదారులు బాగు చేయలేదని మండిపడ్డారు. ఏప్రాజెక్టు కట్టితే డబ్బులు వస్తాయోనని గండిపడ్డ కల్వల ప్రాజెక్టుకు ఎమ్మెల్యే వెళ్లాడని ఆరోపించారు. గన్నేరువరం మండంలోని గుండ్లపల్లి నుంచి పొత్తూర్‌ వరకు రహదారి నిర్మాణం అంటూ క్షీరాభిషేకం చేసుకున్న రసమయి బాలకిషన్‌ రహదారి ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే వివిధ స్కీమ్‌ల చెక్కుల పంపిణీ కాదని సుడా చైర్మన్‌ జీవీ రామకృష్ణారావును హేళన చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ స్థానికేతరుడన్నారు. సీఎం కేసీఆర్‌ వరద బాధితులను ఎందుకు ఆదుకోవడం లేదన్నారు. గతంలో పంట నష్టపోతే పదివేలు ఇస్తానని ఎందుకు ఇవ్వలేదని మండి పడ్డారు. సమావేశంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, రత్నాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రమణారెడ్డి, లీడర్లు తాళ్లపల్లి సంపత్‌గౌడ్‌, సాయిరి దేవన్న, కొత్త కొండ శంకర్‌ బాకారపు శ్రీనివాస్‌, రామిడి తిరుపతి, మర్రి ఓదెలు, ముక్కెర సతీశ్‌, కొంద్ర సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్‌ టీం రాక



గన్నేరువరం: ఖాసింపేట గ్రామానికి త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్‌ బృందం రానుందని డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీలో మండల అధికారులు, పంచాయతీ పాలకవర్గసభ్యులతో రివ్యూ నిర్వహించారు. గ్రామ వీధులు మరొకసారి పరిశీలించడానికి జిల్లా, మండల స్థాయిలో ఎనిమిది బృందాలు వస్తాయన్నారు. మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతలు, తడి, పొడిచెత్త వేరు చేయుట సేకరణ తెలుసుకుంటారని వివరించారు. సమావేశంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి, డీపీఎం శ్రీనివాస్‌, సర్పంచ్‌ గంప మల్లీశ్వరి, యూనిసేఫ్‌ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ కిషన్‌స్వామి, ఎస్‌బీఎం కన్సెలెంట్లు రమేశ్‌, వేణు, ఏపీఎం లావణ్య, ఏపీవో చంద్రశేఖర్‌, టీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఈసీ రమేశ్‌, గ్రామ కార్యదర్శి ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల దుర్వినియోగంపై విచారణ



చిగురుమామిడి: చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో మంగళవారం డీఆర్‌డీఏ అదనపు పీడీ బొజ్జ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. గతనెల 25న ‘సాక్షి’ దినపత్రికలో ‘మహిళా సంఘాల డబ్బులు ఎవరు తిన్నారు?’ శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు 13 స్వశక్తి సంఘాలతో సమావేశమయ్యారు. బ్యాంకు అప్పు రూ. 76 లక్షల్లో గత మే వరకు రూ.51 లక్షలే అందినట్లు తెలిపారు. మిగతా డబ్బులు ఏమయ్యాయో వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఏపీడీ వెంకటేశ్వర్లు సమక్షంలో 13 సంఘాలకు సంబంధించిన అధ్యక్షరాళ్లు, గ్రామ సర్పంచ్‌, ఉపసర్పంచ్‌, ఇతర పెద్దమనుషులు చర్చించనట్లు చెప్పారు. సొంతానికి వాడుకున్న డబ్బులు వెంటనే చెల్లించాలని, లేదంటే చర్యలు తప్పవని అదనపు పీడీ హెచ్చరించారు.

సాక్షి స్పందన

81మంది పీటీఐల రీఎంగేజ్‌

కరీంనగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్‌ అండ్‌ క్రాఫ్ట్‌, పీఈటీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐ)లుగా పనిచేస్తున్న 81 మందిని విధుల్లోకి తీసుకుంటూ మంగళవారం డీఈవో జనార్దన్‌రావు ఎంఈవోలకు ఉత్తర్వులు జారీచేశారు. ‘పీటీఐలపై కనికరం చూపరా!’ శీర్షికన గతనెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. భవిత కేంద్రాల్లో పనిచేసే ఇన్‌క్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్‌(ఐఈఆర్‌పీ)లను రీఎంగేజ్‌ చేసుకోవడం లేదంటూ వచ్చిన వార్తపై స్పందించిన అధికారులు గతనెల 28న 22 మందిని విధుల్లో తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో 81 మంది పీటీఐలను రీఎంగేజ్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల దినోత్సవం



కొత్తపల్లి(కరీంనగర్‌): ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో మంగళవారం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో కేక్‌కట్‌ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ నగేశ్‌ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్‌ బంధు ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలని, సంక్షేమనిధి ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు చదువలకు అయ్యే ఖర్చు చెల్లించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్‌ చేసారు. పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు పోలు శ్రీనివాస్‌ ఆటో యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు గుర్రపు ప్రవీణ్‌, డాక్టర్‌ శివరాం, మీర్జా బేగ్‌, సయ్యద్‌ రియాజుద్దీన్‌, ఊకంటి రవీందర్‌ రెడ్డి, దుబ్బాక సంపత్‌, ఆరిఫ్‌ ఖలీల్‌, అంజలి, స్వరూప, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విచారణ ఎదుర్కొంటున్న మంత్రులను తొలగించాలి

వీణవంక: హైకోర్టులో విచారణ ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను తొలగించాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ నగేశ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అఫిడవిట్‌లో ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు విచారణ ఎదుర్కొంటున్న శ్రీనివాస్‌ గౌడ్‌తో పాటు 11మంది అధికారులపై కేసులు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించిదని, మరో మంత్రి గంగుల కమలాకర్‌ ఆస్తుల వివరాలు అఫిడవిట్‌లో సరిగా పొందుపర్చలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నందున వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో దొంగతనం

తిమ్మాపూర్‌: మండలంలోని రామకృష్ణకాలనీలో ఇటీవల నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల సమాచారంతో ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. గుడిలో నాలుగు గంటలు, రెండు పెద్ద హారతి కర్పూరాలు పోయినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని పేర్కొన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల ఓదెలు, గుడి చైర్మన్‌ పొలం అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రూప్‌–3 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌: రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్‌, మైనారిటీ సంక్షేమశాఖ హైదరాబాద్‌ వారు గ్రూప్‌–3 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న మైనారిటీ అభ్యర్థుల నుంచి ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి మధుసూదన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌ ద్వారా ఈనెల 6 వరకు సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9849152516 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని సింగాపూర్‌ శివారులో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వరంగల్‌కు చెందిన ఇమ్మడి లక్ష్మి తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌ నుంచి వరంగల్‌కు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోగా లక్ష్మి ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయింది. 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హన్మకొండలోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

7నుంచి డిగ్రీ సెమిస్టర్స్‌

హుజూరాబాద్‌రూరల్‌: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్‌ పరీక్షలు ఈ నెల 7వ తేదీ నుంచి జరుగుతాయని యూనివర్సిటీ ఉత్తర్వులు జారీ చేసిందని పీఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీపీఎస్‌.హనుమకుమార్‌ తెలిపారు.

వస్త్రవ్యాపారంలో నష్టాలు

- మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య



నరహరి రాసిన సూసైడ్‌ నోట్‌



నరహరి (ఫైల్‌)

జగిత్యాలక్రైం: వస్త్రవ్యాపారంలో నష్టాలు రావడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మనస్తాపం చెందిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన హోల్‌సేల్‌ వ్యాపారి గాజుల నరహరి(55) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరహరి పట్టణంలో హోల్‌సేల్‌ వ్యాపారి. దందా బాగా సాగేందుకు బ్యాంక్‌లో కొంత రుణం తీసుకున్నాడు. తెలిసినవాళ్ల వద్ద మరికొంత అప్పు చేశాడు. అయితే, వ్యాపారంలో ఆశించిన లాభాలు రాకపోవడం, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, వాటిని తీర్చేదారిలేకపోవడంతో ఆయన తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఉదయం పట్టణంలోని జగిత్యాల క్లబ్‌కు వెళ్లాడు. ఇంటినుంచి తెచ్చుకున్న తాడును సీలింగ్‌ ఫ్యాన్‌కు కట్టి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులకు వడ్డీ కట్టలేక, ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించండని రాసిన లేఖ మృతుడి జేబులో లభించింది. కాగా, క్లబ్‌ స్వీపర్‌ గదులు శుభ్రం చేస్తుండగా నరహరి సీలింగ్‌ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులతోపాటు, క్లబ్‌ సెక్రటరీ నారాయణరెడ్డికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నటేశ్‌ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సచిన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. కూతురు అమెరికాలో ఉంటోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు జాప్యమయ్యే అవకాశం ఉంది.

భూమి రిజిస్ట్రేషన్‌ ఆపాలని ఆందోళన

- పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన



పురుగులమందు డబ్బాతో బాధిత కుటుంబం

మానకొండూర్‌ రూరల్‌: తన అత్తపేరిట ఉన్న భూమిని మనవడికి కాకుండా తన కూతుళ్లకు రిజిస్ట్రేషన్‌ చేయిస్తోందని, ఆ భూమి రిజిస్ట్రేషన్‌ ఆపాలని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఓ మహిళ కుటుంబంతో సహా పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగింది. ఈ సంఘటన మానకొండూర్‌ తహసీల్‌ కార్యాలయం ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. సదరు మహిళ వివరాల మేరకు.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పూసాల మల్లీశ్వరికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. 22 ఏళ్లక్రితం భర్త రమేశ్‌ గ్రామ శివారులో 5.11 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. కొన్నేళ్ల తరువాత ఆ భూమిలో 2.26 ఎకరాలు తన తల్లి రాజమ్మ పేరిట రిజిస్ట్రేషన్‌ చేశాడు. ఏడేళ్ల క్రితం రమేశ్‌ మరణించాడు. అప్పటి నుంచి మొత్తం భూమిని మల్లీశ్వరి సాగు చేసుకుంటోంది. రాజమ్మ తనపేరిట ఉన్న భూమిని మల్లీశ్వరికి తెలియకుండా తన కూతుళ్ల పేరిట రిజిస్ట్రేషన్‌ చేసేందుకు ధరణిలో స్లాట్‌ బుక్‌ చేసింది. ఈ విషయం తెలిసిన మల్లీశ్వరి రాజమ్మను నిలదీసింది. తన కొడుకు వర్షిత్‌ పేరిట భూమి రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరింది. నెలరోజులుగా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతూ సదరు స్లాట్‌ను రద్దు చేయాలని కోరుతోంది. ధరణి నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్‌ ఆపడం కుదరదని తహసీల్దార్‌ చెప్పడంతో మంగళవారం ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో సహ తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగింది. రాజమ్మ తన కూతుళ్ల పేరిట భూమి రిజిస్ట్రేషన్‌ చేయిస్తే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని మల్లీశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది.

యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



గొర్రెల యూనిట్ల పత్రాలు పంపిణీ చేస్తున్న రామకృష్ణారావు

శంకరపట్నం(మానకొండూర్‌): యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సుడా చైర్మన్‌ జీవీ రామకృష్ణారావు ఆకాంక్షించారు. మంగళవారం అర్కండ్ల గ్రామంలో ప్రభుత్వం అందించిన గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 12మందికి గొర్రెల యూనిట్లు రాగా ఇన్సూరెన్స్‌ పత్రాలు అందజేశారు. అనంతరం అర్కండ్ల లో లెవల్‌ బ్రిడ్జిని పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయని సర్పంచ్‌ అనిత వివరించారు. స్థానిక ఎమ్మెల్యే రాకపోవడంతో సమస్యలు చెప్పుకోలేకపోతున్నామని సర్పంచ్‌ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్‌, ఎంపీటీసీ సంపత్‌, పశువైద్యాధికారులు మాధవరావు, భాగ్యలక్ష్మి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహిపాల్‌, రంజిత్‌రావు, రవి, వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వీరస్వామి, సాగర్‌రావు, యాదవ సంఘం మండల అధ్యక్షుడు జంపయ్య, కుమార్‌యాదవ్‌, శ్రీనివాస్‌, సతీష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సంపత్‌ పాల్గొన్నారు.

పారమితలో ‘స్కౌట్‌ స్కార్ఫ్‌’ దినోత్సవం



వేడుకల్లో విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్‌): పద్మనగర్‌ పారమిత హెరిటేజ్‌ స్కూల్‌లో ప్రపంచ స్కౌట్‌ స్కార్ఫ్‌ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ వ్యవస్థాపకుడు రాబర్ట్‌ బాడెన్‌ పావెల్‌ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు రితేష్‌ మెహతా పూలమాల సమర్పించి స్కౌట్స్‌ జెండా ఎగురవేశారు. ప్రపంచంలోనే స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ అనేది అతి పెద్ద విద్యా ఉద్యమం అని, ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని నాలుగేళ్ల శిక్షణ తీసుకుని గవర్నర్‌, రాష్ట్రపతి అవార్డులు పొంది క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితాన్ని గడుపుతూ దేశసేవ చేసేందుకు దోహదపడుతుందన్నారు. స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులను ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్‌ డా.ఇ.ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు అనుకర్‌ రావు, ప్రసూన, వియుఎం ప్రసాద్‌, ప్రోగ్రాం హెడ్‌ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, హరిప్రియ, సరిత, స్కౌట్‌ మాస్టర్‌ గంగారపు మల్లేశం, పీఈటీలు గోలి సుధాకర్‌, రాజు, రాజబాపు, మల్లేశం, శైలజ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించి నవ భారత నిర్మాణానికి కృషి చేయాలని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలో విద్యార్థులకు స్కూల్‌ కౌన్సిల్‌ ఎన్నికలు నిర్వహించగా గెలుపొందిన హెడ్‌ బాయ్‌, హెడ్‌గర్ల్‌, స్పోర్ట్స్‌, కల్చరల్‌, జనరల్‌ కెప్టెన్‌, హౌస్‌ గ్రూప్‌ కెప్టెన్‌, వైస్‌ కెప్టెన్‌లకు మంగళవారం పాఠశాలలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సాచెస్‌లను ప్రదానం చేసి మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి ప్రజాప్రతినిధులని అందుకు ఇలాంటి ఎన్నికలు వారి ఉజ్వల భవిష్యత్‌ కు పునాదులు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్‌ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలకు స్పందన



రన్నింగ్‌ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌ అంబేడ్కర్‌ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలకు స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి సుమారు 375 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్‌–14, 16, 18, 20 బాల బాలికలు, పురుషులు, మహిళలకు 100, 400 మీటర్ల పరుగు పందెం, జావలిన్‌త్రో అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను, ఈనెల 7న హన్మకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపికచేసినట్లు సంఘం అధ్యక్షకార్యదర్శులు నందెల్లి మహిపాల్‌, కడారి రవి తెలిపారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు దివాకర్‌, శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌, ఎండీ ఎజాజ్‌, సుస్మిత, నౌషిన్‌, సునీత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

■ఎలాంటి ఆస్తిపత్రాలు లేకుండా స్వంత ఇల్లు ఉన్న వారికి అతి తక్కువ వడ్డీతో ఋణాలు ఇప్పించబడును.ఓల్డ్‌ కరీంనగర్‌ జిల్లా వారికి మాత్రమే.ఫోన్‌:7989671278 [H-796924]

■మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధరకు కొనబడును. ఫోన్‌ : 7013501541 [H-788613]

■అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్‌ ఓవర్‌, మార్టిగేజ్‌ లోన్స్‌ కలవు, CIBIL స్కోర్‌ తక్కువ ఉన్న ఫైనాన్స్‌ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్‌ : 9041115088 [HA-29901]

OLD AGE HOME

■త్రివేణి హోంకేర్‌, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్‌ :9160900023, 9160900024. [H-189313]

CHANGE OF NAME

■I, SAGARICA (Old Name) H.No. 1-10-248/A,Kalangar, Metpally, Jagityal. Hence Changed my Name as THANGALLAPALLY SAGARIKA (New Name), W/o. THANGALLAPALLY RAJESHWAR. [Z-799548]

■I, TANGULAPELLI RAJESHWAR (Old Name) H.No. 1-10-248/A, Kalanagar, Metpally, Jagityal. Hence Changed my Name as THANGALLAPALLY RAJESHWAR (New Name), S/o. T. GANGARAM [Z-799549]

WANTED

■కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్‌ టైం 8000. ఫుల్‌ టైం: 20000/- 7993700904, 9014504770, 8977749043. [W-1002992]

■ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్‌ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయండి. 88854 86421. [M-1221471]

■ప్రముఖ గ్లోబల్‌ కంపెనీలో పార్ట్‌ / ఫుల్‌ టైం వర్క్‌ చేస్తూ ప్రతినెల 25 వేల పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్‌ పైన, గృహిణులు, రిటైర్డ్‌ పర్సన్స్‌, స్టూడెంట్స్‌ వివరాలకు సంప్ర : 91821 09087 [V- 797253]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

రక్తదానంలో ఆదర్శం



రక్తదానం చేస్తున్న ఉమ

కరీంనగర్‌రూరల్: నగరంలోని మైత్రిబ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం వైకే ఫౌండేషన్ జిల్లా సభ్యురాలు, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ ఉమ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. మహిళలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ధైర్యంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన ఉమను ఫౌండేషన్ ప్రతినిధులు కండెం సురేశ్, బుర్ర బాబు తదితరులు అభినందించారు.

ఆటవస్తువులు అందజేత



ఆటవస్తువులు అందజేస్తున్న సర్పంచ్ నందయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఫకీర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థి కటకం తేజ మంగళవారం ఆటవస్తువులను బహూకరించగా సర్పంచ్ కటకం నందయ్య అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కంపాస్‌బాక్స్‌లు, పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. పంచాయతీ సిబ్బందికి రెయిన్‌కోట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ప్రధానోపాధ్యాయురాలు రేచల్, అంగన్‌వాడీ టీచర్ నీలతో పాటు వార్డుసభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం



జ్యోతిప్రజ్వలనలో పాల్గొన్న సూర్యనారాయణరెడ్డి


కరీంనగర్‌రూరల్: తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెల్మడ ఆనందరావు ఆస్పత్రి డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆసీమ్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత, వైద్యులు రమ, రాంనర్సింహరెడ్డితో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



కొత్తపల్లి: కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఇటీవల నియమితులైన డి.చంద్రశేఖర్‌ను మంగళవారం బీఎస్పీ జిల్లా కార్యదర్శి బడుగు నరేష్ ఆధ్వర్యంలో బొకే అందజేసి సత్కరించారు. నాయకులు అస్తపురం మధు, జాడి ప్రభుకుమార్, గడ్డం వేణు, వినోద్ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు



మందులు అందజేస్తున్న ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో మంగళవారం రేకుర్తి కంటి ఆస్పత్రిలో కృష్ణానగర్‌కు చెందిన కన్న రాజేశం, ఆరెల్లి కనకలక్ష్మిలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్ సహకారంతో కంటి ఆపరేషన్లు నిర్వహించిన అనంతరం రోగులకు మందులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ చైర్‌పర్సన్ చింతల కిషన్, ఆస్పత్రి టెక్నీషియన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ ఉజ్వల పార్కు ఫీడర్ పరిధిలోని ఎన్‌టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్, శ్రద్ధ ఇన్, ఉజ్వల పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



భగత్‌నగర్ ఏరియా వాసుదేవకాలనీలోని రోడ్ నెం.1లో ..



భగత్‌నగర్‌లోని అపార్ట్‌మెంట్ల వద్ద..

నగర వీధుల్లో చీకట్లు

స్మార్ట్‌సిటీలో వీధిలైట్ల ఏర్పాటు మున్నాళ్ల ముచ్చటగా మారుతోంది. రాత్రి వేళ సరిగా వెలగకపోవడంతో పలు కాలనీల్లో అంధకారం నెలకుంటుంది. కాలనీవాసులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



సప్తగిరికాలనీలోని బీఎస్‌ఎన్‌ఎల్‌క్వార్టర్స్ ప్రాంతంలో..

చిత్ర కథ: ధర మారినా బోర్డు మారదా.!



మద్దతు ధర పెరిగినా ప్రచారం పాతదే. పంటల కనీస మద్దతు ధరను రెండు నెలల క్రితం కేంద్రం పెంచిన విషయం విదితమే. ఈ వానాకాలం పంటల నుంచి సదరు ధరలు అమలులో ఉండనుండగా గత ధరల పట్టికనే ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని బోర్డును మార్చుతారో లేదో వేచిచూడాలి మరీ.! – కరీంనగర్ అర్బన్

మూలనపడ్డ పార్థివ వాహనం

- మృతదేహాల తరలింపునకు ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీ
- నందెట్లో నడేమియాలా సిబ్బంది చేతివాటం



రిపేర్‌కు వచ్చి ఆసుపత్రిలో మూలనపడ్డ పార్థివ వాహనం

"సుల్తానాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పార్థివ వాహనం మరమ్మతుకు వచ్చి మూలన పడడంతో మృతదేహాన్ని ఉచితంగా ఇంటికి పంపే మార్గం లేకుండా పోయింది. ఓ ప్రైవేటు అంబులెన్స్‌ను ఆశ్రయించగా రూ.7,500 లు ఇస్తేనే మృతదేహాన్ని తీసుకెళ్తామని చెప్పడంతో చేసేదిలేక ఆ నిరుపేదలు అడిగినంత చెల్లించి ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకెళ్లారు. పార్థివ వాహనం లేకపోవడం వల్ల ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు నిరుపేదలను నిత్యం దోపిడీ చేస్తూనే ఉన్నారు."

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారిని ఉచితంగా వారి ఇళ్లకు చేర్చేందుకు ఆసుపత్రిలో పార్థివ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మృతుల కుటుంబాలకు ఇన్నాళ్లు సేవలు అందాయి. అయితే ఇటీవల వాహనం మరమ్మతుకు వచ్చి మూలన పడింది. శవాలను తరలించేందుకు ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కవుతున్నాయి. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులది ఆడింది ఆటగా సాగుతోంది. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది తీరు మారడం లేదు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే నిరుపేదలను ఏదో ఒక రూపంలో దోపిడీ చేస్తూనే ఉన్నారు. ఆసుపత్రిలో అనారోగ్యంతో ఎవరైనా చనిపోయిన వారి మృతదేహాలను తరలించేందుకు పార్థివ వాహనం అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది కనుసన్నల్లోనే ఉంటున్న ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులకు సమచారం చేరవేస్తున్నారు. వారు కమీషన్లు ముట్టజెప్పి ప్రైవేటు అంబులెన్స్‌లలో మృతదేహాలను తరలిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు అంబులెన్స్‌ల యాజమాన్యాలు నిరుపేదలను నిలువుదోపిడీ చేస్తున్నారు.

ప్రైవేటు అంబులెన్స్ అద్దె పెంపు

ప్రభుత్వ ప్రధానాసుపత్రి చుట్టూ అంబులెన్స్‌లను పార్కింగ్ చేస్తున్న యాజమాన్యాలు ఆసుపత్రి సిబ్బందితో కుమ్మక్కై పొద్దంతా ఆసుపత్రిలోనే అడ్డావేస్తున్నారు. పార్థివ వాహనం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. దీంతో మృతదేహాల తరలింపునకు రేట్లను అమాంతంగా పెంచేశారు. గతంలో రూ.5 వేలకు మృతదేహాన్ని తరలించిన అంబులెన్స్‌లు ప్రస్తుతం అదే ప్రాంతానికి వెళ్లాలంటే రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిరుపేదలైన మృతుల బంధువులు పెంచిన అడ్డగోలు రేట్లతో దిక్కుతోచని పరిస్థితుల్లో అప్పు చేసి అంబులెన్స్‌లలో మృతదేహాలను తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రిలో మూలనపడ్డ పార్థివ వాహనాన్ని మరమ్మతు చేయించి నిరుపేదలు నిలువుదోపిడీకి గురికాకుండా చూడాలని మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి

కోట్లు ఖర్చు చేసి ఎంతో ఖరీదైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం పార్థివ వాహనాన్ని మరమ్మతు చేయించకపోవడం వల్ల నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక పరమైన దోపిడీకి గురవుతున్నారు. వాహన మరమ్మతు చేసి ఆసుపత్రిలో అందుబాటులోకి తేవాలి.

– శ్యాంసుందర్, కరీంనగర్

'మణిపూర్ సంఘటన హేయమైనది'



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల, సంఘాల నాయకులు

విద్యానగర్(కరీంనగర్): మణిపూర్‌లో జరిగిన సంఘటన హేయమైనదని పలు పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మణిపూర్ సంఘటనపై ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల, సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. మైనార్టీ వర్గాలపై జరుపుతున్న హింసా కాండ, మహిళలపై అఘాయిత్యాలు మానవజాతికే కళంకం తెచ్చే చర్య అన్నారు. దేశంలోని అన్ని సంఘాలు, పార్టీలు ఏకమై ఇటువంటి చర్యలను ఖండించాలని సూచించారు. ఈ సమావేశంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖైరుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకుడు ప్రసాద్, సీపీఐ నాయకులు పయ్యావుల వాసుదేవడ్డి, సురేందర్ రెడ్డి, ప్రసాద్, టీడీపీ నాయకుడు కళ్యాణపు ఆగయ్యతో పాటు వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, తిమోతి జయరాజ్ , డేవిడ్ రాజు, మల్లేష్, విజయ్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, క్రిస్టోఫర్, మార్వాడి సుదర్శన్, ఇ ఎలీషా, గాలి అనిల్ కుమార్, ముత్యాల విజయ్ కుమార్, గిడియన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు

కరీంనగర్ ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని నగరంలోని గణేశ్‌నగర్ ఆటోస్టాండ్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పబ్లిక్, ప్రైవేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్‌లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రయినా, పగలైనా, వర్షమైనా ఎలాంటి సమయమైనా ఒక్క పిలుపుతో ప్రజలను చేరాల్సిన చోటికి చేర్చేవాడు ఆటోడ్రైవర్ అని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నట్లు తెలంగాణాలో కూడా రూ.10వేలు ఆర్థిక సాయం చేయాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొలిపాక శ్రీనివాస్, సముద్రాల రాము, ఎలా మల్లేశం, అనంతోజ్, రమేష్, రహీంనీష్, దయ్యాల శ్రీనివాస్, అంగడి వెంకటేష్, పరుశురామ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఎల్ఐసీ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరితో పెండింగ్‌లో ఉన్న ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, క్లాస్‌వన్ అధికారుల సంఘం జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆర్‌బీఐతోపాటు ఇతర బ్యాంకుల్లో ఇప్పటికే అమలు చేసిన 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇప్పటివరకు ఎల్ఐసీ, జీఐసీల్లో అమలు చేయకపోవడం దారుణం అన్నారు. ధర్నాలో అధికారుల సంఘం నాయకులు చలం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు లక్ష్మీకాంతం, యూనియన్ డివిజనల్ నాయకులు సూర్య కళ, బసవేశ్వర్, అధికారుల సంఘం నాయకులు సత్యనారాయణ, రవీందర్, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కృపాదానంకు కళా విశిష్ట సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృపాదానం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన జి. కృపాదానం మంగళవారం కళా విశిష్ట సేవాపురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ కళా విశిష్ట సేవా పురస్కారం హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభలో అందుకున్నారు. 40 ఏళ్లుగా కళా, సామాజిక, సాహితీ రంగాల్లో సేవలు గుర్తించి కృపానందంకు పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఆలూరి విల్సన్, ఎన్. ఇందిర, గౌరవ కార్యదర్శి పీవీపీ అంజనీకుమారి, సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ, పద్మశ్రీ కొలకనూరి ఇనాక్, నటుడు శంకరనారాయణ, రచయిత వినయ్ శ్రీమల్లిక్ తదితరులు ఉన్నారు. పురస్కారం అందుకున్న కృపాదానంను ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, కళాకారులు అభినందనలు తెలిపారు.

కలుషిత నీటిని శుద్ధిచేయాలి

కరీంనగర్‌కార్పొరేషన్: భారీ వర్షాలతో వచ్చిన కలుషిత నీటిని శుద్ధిచేసి నగర ప్రజలకు సరఫరా చేయాలని పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ కోరారు. మంగళవారం నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణికి వినతిపత్రం అందజేశారు. ఎల్ఎండీకి కొత్తనీరు రావడంతో కలుషితమైన నీటితో ప్రజలు విషజ్వరాల బారినపడే అవకాశం ఉందన్నారు. వ్యాధుల కారకాలుగా మారే నీటిగుంటల్లో గంబోజి చేపలు వేసి వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. బస్తీ దవఖానాల్లో వైద్యులు, మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రెహమాన్, ఇమ్రాన్, దీకొండ శేఖర్, సర్వర్, గంగుల దిలీప్, లింగమూర్తి, మల్లికార్జున్, అజీజ్, వాజిద్, కుర్ర పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అరెస్ట్.. విడుదల

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం ఇళ్ల సముదాయాల వద్ద ధర్నా చేపట్టేందుకు వచ్చిన టీడీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు వచ్చిన తమను అరెస్టు చేయడం అన్యాయమని, చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్(కరీంనగర్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కాసెట్టి లక్ష్మయ్య, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, దామోదర్, బెజ్జంకి కాళిదాస్, కదారి బీరయ్య, ఆగయ్య, పిట్టల సమ్మయ్య, కిమ్మ సారపు శ్రీనివాస్, ఓర్సు కొమురయ్య, సుల్తాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ డౌన్.. విద్యుత్ సరఫరాకు అంతరాయం



మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కొత్తపల్లి: 33/11కేవీ పద్మనగర్ సబ్‌స్టేషన్ గీతాభవన్ ఫీడర్ పరిధిలో బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి డిస్క్ ఫెయిల్ అవడంతో మరమ్మతు చేపట్టారు. అయితే ఇన్సూలేటర్ కాలిపోవడంతో పాటు కండక్టర్ వైర్ తెగడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఇదే ఫీడర్‌పై కాకులు కొట్లాడటంతో సోమవారం అంతరాయం ఏర్పడగా.. అదే ఫీడర్‌పై మళ్లీ సాంకేతిక లోపం ఏర్పడటంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా విద్యుత్ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



డైరీ అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న స్వప్న

కరీంనగర్: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.గోపిని పీఆర్‌టీయూ జిల్లా శాఖ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డైరీ అందజేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ పీఆర్‌సీ–2020 జీవో 53 ద్వారా కరీంనగర్ మున్సిపల్ పరిధి పెరిగినందున 17శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పీఆర్‌టీయూ నాయకులు ఎ.మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్ రావు, ముజీబ్, శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జలపతి, గౌస్‌ఖాన్, కరుణాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, అమ్జద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్వప్న

సప్తగిరికాలనీ(కరీంనగర్): కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.గోపిని మంగళవారం మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

చరిత్రాత్మక నిర్ణయం



మాట్లాడుతున్న జక్కుల మల్లేశం

కరీంనగర్: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని ఆర్టీసీ ఎంప్లాయిస్ జోనల్ కార్యదర్శి జక్కుల మల్లేశం అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేతనాలు పెంచి పీఆర్‌సీ ప్రకటిస్తారని అనుకుంటున్న సమయంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. నష్టాల బాటలో నడుస్తున్న ఆర్టీసీని ఆదుకోవాలని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి దీర్ఘకాలిక సమ్మె చేస్తే సీఎం కేసీఆర్ సమ్మె విరమించండి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం అంటే ఆనాడు నమ్మలేకపోయామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రధానపాత్ర వహించిన కార్మికులకు ప్రభుత్వ నిర్ణయం వరంలాంటిదని తెలిపారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కాసార్ల ప్రభాకర్, రఘోత్తమరెడ్డి, సర్వర్ ఖాద్రీ, ప్రవీణ్, ఇస్మాన్‌ఖాన్, జీఎల్ రెడ్డి, ఎస్ఎస్‌చారీ, జూపాక సాగర్, కన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి



బాధితులకు బియ్యం అందిస్తున్న రోహిత్‌రావు

కరీంనగర్‌రూరల్: భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ నాయకుడు మెన్నేని రోహిత్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, చేగుర్తి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ తదితర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులను పరామర్శించారు. కూలిన ఇళ్లను పరిశీలించి తన వంతు సాయంగా బాధితులకు బియ్యం బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, కనుకయ్య, నర్సింహరెడ్డి, బుర్ర నారాయణగౌడ్, హరీష్, శేఖర్, సంపత్, శ్రీనివాస్, సాయిలు, శంకరయ్య, గోవర్ధన్, స్వామి, పవన్, ప్రేమ్ నాయక్, విష్ణువర్ధన్, వాజీద్, సమీర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలోని బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో డిగ్రీ, పీజీలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని సమన్వయ కేంద్ర అధికారి ఆడెపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ పాస్ అయిన వారు డిగ్రీలో ప్రవేశాలు పొందేందుకు అర్హులని అన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారు పీజీలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు పలు రకాల సర్టిఫికెట్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సంబంధిత ఫారాలను అధ్యయన కేంద్రంలో ఈనెల 16లోపు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు అధ్యయన కేంద్రం ఆన్‌లైన్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కరీంనగర్ జిల్లా: 9951602933, 9951602958, 9951602824

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

రమేష్ ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899

మంచిరేవుల భూములు ప్రభుత్వానివే

గ్రేహౌండ్స్‌కు బదలాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు

" మంచిరేవులలోని ఈ భూములకు విలువ పెరగడంతో వాటిపై రాబందుల కళ్లు పడ్డాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ల్యాండ్ మాఫియా జోక్యం కూడా కనిపిస్తోంది. ఈ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తుదివి. ఎలాంటి జోక్యాలు అనుమతించబోం''
– జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలోని 142.39 ఎకరాల భూయాజమాన్య హక్కులు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1994 నుంచి కొనసాగుతున్న భూవివాదానికి ముగింపు పలికింది. ఆక్రమణకు గురైన ఈ భూములు గ్రేహౌండ్స్‌కు సంబంధించినవని పేర్కొంది. మంచిరేవుల భూములకు సంబంధించి హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు విచారించిన జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తుదితీర్పు వెలువరించింది. మంచిరేవులకు సంబంధించిన భూములు ప్రైవేటు వ్యక్తులవేనని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిని విచారించిన డివిజన్ బెంచ్ 2021లో రాష్ట్ర ప్రభుత్వానికి ఆనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు అనంతరం ఇచ్చిన తుదితీర్పులో.. ఆర్టికల్ 142 ప్రకారం అధికారాలు వినియోగిస్తూ ఈ పిటిషన్లు కొట్టివేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ భూములపై కిందిస్థాయి కోర్టులు, హైకోర్టు ఎలాంటి జోక్యం చేసుకునే అధికారం లేదని, ఇప్పుడు ఇచ్చిన తీర్పే తుదితీర్పు అని ఆదేశాల్లో పేర్కొంది. సదరు భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని, తదుపరి కేటాయింపులపై దాని యాజమాన్య, స్వాధీన హక్కులు ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని గ్రేహౌండ్స్‌కు బదిలీ చేయాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, సీఎస్ వైద్యనాథన్, గిరి, ఏటీఆర్ శ్రీహర్షలు వాదనలు వినిపించారు. ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న ఈ భూములు పలువురు ఆక్రమించుకొని 1993లో ఆక్రమంగా విక్రయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసింది.

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

విశాఖపట్నంకు ఇనార్బిట్ మాల్: ఏపీ సీఎం వైఎస్ జగన్

- రూ. 600 కోట్లతో 12 – 13 ఎకరాల్లో భారీ స్థాయిలో నిర్మాణం
- 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ దిశగా ప్రణాళికలు
- నగరంలో 7 స్టార్ హోటల్ నిర్మాణానికి రహేజా ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలాసపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీలో రూ.130 కోట్లతో నిర్మించిన ఐదు భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాది లో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ వెల్లడించారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12–13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్ర మే జరుగుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైద రాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను కేవలం 7–8 ఎకరా ల్లో నిర్మించగా విశాఖలో 12–13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా..

ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12–13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తరువాత 2 దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్ కూడా అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ స్పేస్ ద్వారా మరో 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు రానున్నాయి. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశాం. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా గొప్ప అడుగులు అవుతాయి. మాల్ కూడా అదే కోవలోకి వస్తుంది.



ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో నీల్ రహేజా

సాగర తీరంలో 7 స్టార్ హోటళ్లు..

రహేజా గ్రూప్ దేశంలో పలు చోట్ల ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్మించింది. అదేవిధంగా ఏపీలో కూడా రాజ్ విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్‌స్టార్, 7 స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ సంస్థ రాజ్ విలాస్ తరహాలో 7 స్టార్ కేటగిరీలో రిసార్ట్, మే ఫెయిర్ సంస్థ సూపర్ లగ్జరీ 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చాయి. అదే తరహాలో నీల్ రహేజా కూడా 7 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇవన్నీ విశాఖ రూపురేఖలను మార్చే గొప్ప ప్రాజెక్టులు అవుతాయి. ఇక హిందూపూర్‌లో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన పార్క్ రానుంది. దీని ద్వారా 15 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నీల్ రహేజా తెలియచేశారు.

ఏపీలో ఎంతో అనువైన వాతావరణం

దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా అగ్రస్థానంలో నిలవడానికి ఇవే కారణం. ఈ మాల్ ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.
– రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం

ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ రంగం అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. మాకు ప్రపంచవ్యాప్తంగా రాజ్‌విల్లాల తరహాలో లగ్జరీ హోటళ్లున్నాయి. అదే కాన్సెప్ట్‌ను విశాఖతో పాటు ఏపీలో తేవాలనుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పారిశ్రామిక పార్కులపై కూడా దృష్టి సారిస్తున్నాం. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. విశాఖలో ఇనార్బిట్ మాల్‌ను దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్ తరహాలో ప్రపంచ స్థాయి మాల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం.
– నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

రాష్ట్రంలో 39 అమృత్ భారత్ స్టేషన్లు

- తొలిదశలో 21 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు 6న ప్రధాని శంకుస్థాపన
- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా తెలంగాణలోని మొత్తం 39 రైల్వే స్టేషన్లను గుర్తించి వీటిని సంపూర్ణంగా ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి విడతగా 21 స్టేషన్లకు సంబంధించిన పనులను ఆగస్టు 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

'అమృత్ భారత్ స్టేషన్ల'పథకంలో భాగంగా.. రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వై–ఫై సదుపాయాన్ని కల్పిస్తారు. అదేవిధంగా స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్ స్టేషన్ వన్ ప్రాడక్ట్' దుకాణాలు, ప్రయాణీకులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ముందు, వెనక భాగాల్లో మొక్కల పెంపకంతో పాటు చిన్న గార్డెన్లు కూడా నెలకొల్పుతారు. ఇక స్టేషన్ల అవసరాలకు అనుగుణంగా బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయనున్నారు. వీటికి తోడుగా నగరానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను అనుసంధానం చేయడం, దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు, పట్టాలకు ఇరువైపులా కాంక్రీట్ బాటలు, రూఫ్ ప్లాజాలు (అవసరాన్ని బట్టి), దీర్ఘకాలంలో అవసరమయ్యే నిర్మాణాలను ఈ పథకంలో భాగంగా చేపట్టనున్నారు. కాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో వచ్చే 40 ఏళ్ల అవసరాలు తీర్చేవిధంగా అభివృద్ధి చేసేందుకు రూ.715 కోట్లు, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధికి రూ.221 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో మొత్తం గుర్తించిన స్టేషన్లు 39: ఆదిలాబాద్, బాసర్, బేగంపేట్, భద్రాచలం రోడ్, గద్వాల్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, హైదరాబాద్ (నాంపల్లి), జడ్చర్ల, జనగాం, కాచిగూడ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, లింగపల్లి, మధిర, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మలక్‌పేట్, మల్కాజ్‌గిరి, మంచిర్యాల్, మేడ్చల్, మిర్యాలగూడ, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రామగుండం, సికింద్రాబాద్, షాద్‌నగర్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగుళాంబ, తాండూర్, ఉందానగర్, వికారాబాద్, వరంగల్, యాదాద్రి, యాకుత్‌పురా, జహీరాబాద్.

- మొదటి విడతలో ఆగస్టు 6న పనులు ప్రారంభం కానున్న 21 స్టేషన్లపై రూ.894 కోట్లు ఖర్చుచేయనున్నారు.

హైదరాబాద్ (నాంపల్లి) – రూ.309 కోట్లు
నిజామాబాద్ – రూ.53.3 కోట్లు
కామారెడ్డి – రూ.39.9 కోట్లు
మహబూబ్‌నగర్ – రూ.39.9 కోట్లు
మహబూబాబాద్ – రూ.39.7 కోట్లు
మలక్‌పేట్ (హైదరాబాద్)– రూ.36.4 కోట్లు
మల్కాజ్‌గిరి (మేడ్చల్) – రూ.27.6 కోట్లు
ఉప్పుగూడ (హైదరాబాద్)– రూ.26.8 కోట్లు
హఫీజ్ పేట (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు
హైటెక్ సిటీ (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు
కరీంనగర్ – రూ.26.6 కోట్లు
రామగుండం (పెద్దపల్లి)– రూ.26.5 కోట్లు
ఖమ్మం – రూ.25.4 కోట్లు
మధిర (ఖమ్మం) – రూ.25.4 కోట్లు
జనగాం – రూ.24.5 కోట్లు
యాదాద్రి – రూ.24.5 కోట్లు (యాదాద్రి భువనగిరి)
కాజీపేట జంక్షన్ – రూ.24.5 కోట్లు (హనుమకొండ)
తాండూర్ (వికారాబాద్)– రూ.24.4 కోట్లు
భద్రాచలం రోడ్ – రూ.24.4 కోట్లు (కొత్తగూడెం)
జహీరాబాద్ (సంగారెడ్డి)– రూ.24.4 కోట్లు
ఆదిలాబాద్ – రూ.17.8 కోట్లు

బ్రో.. ఇది పెద్ద స్కామ్.. నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

ఏపీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: తనను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కల్యాణ్ శునకానందం పొందుతున్నారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కలెక్షన్లు పెంచుకో వడం కోసమే తన పాత్రపై వివాదం సృష్టిస్తున్నా రని ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవా రం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. బ్రో సినిమా నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారని తీవ్ర విమర్శలు చేశారు. దీనికి ఆధారాలు ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా.. అంతర్జాతీయ నిఘా సంస్థకు చెందిన ప్రముఖుడొకరు తనకి విషయాన్ని చెప్పారని అంబటి వెల్లడించారు. తన రెమ్యూనరేషన్ కింద రూ.66 కోట్లు తీసుకున్నారా? లేక రూ.80 కోట్లు తీసుకున్నారా? ఈ మొత్తానికి ఆదాయపన్ను శాఖకు లెక్కలు చెప్పారా? అనేది పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ కింద రోజుకు రూ.2 కోట్లు తీసుకున్నారని ఒకరు, 40 రోజులు కాల్షీట్లు ఇచ్చారని ఒకరు, 23 రోజులే ఇచ్చారని ఒకరు చెప్పారని గుర్తు చేశారు. 40 రోజులపాటు కాల్షీట్లు ఇచ్చి ఉంటే పవన్‌కు రూ.80 కోట్లు ముట్టినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ బ్లాక్ మనీని వైట్‌గా చేసి పవన్‌కు ప్యాకేజీ రూపంలో ఇచ్చారని ఆరోపించారు. ఇది ఒక కుంభకోణమన్నారు.

చెరువులకు వరద దెబ్బ!



ఇది భీమిని మండలం లక్ష్మీపూర్‌లోని చెరువు. ఇటీవల కురిసిన వర్షాలకు 40మీటర్ల మేర కాలువ దెబ్బతిన్నది. చెరువు కింద మొత్తం 70ఎకరాల్లో ఆయకట్టు ఉంది. దీంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందిగా మారింది. ఈ కాలువ తాత్కాలికంగా మరమ్మతు చేసేందుకు రూ.80వేలు, శాశ్వత మరమ్మతులకు రూ.15లక్షలు అవసరమని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేశారు.



దండేపల్లి మండలం కాసపల్లిలోని దామకుంట చెరువు కట్ట తెగిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కట్ట దెబ్బతిని వరద నీరంతా వృథాగా వెళ్లిపోయింది. ఈ కట్ట తాత్కాలిక మరమ్మతులకు రూ.50వేలు, శాశ్వత మరమ్మతులకు రూ.10లక్షలు వెచ్చించాల్సి ఉంది.

- వానలకు కాలువలు, కట్టలు ధ్వంసం
- 13 చెరువులకు రూ.1.52కోట్లు అవసరం
- తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న అధికారులు

మరమ్మతులకు నిధులు

దెబ్బతిన్న చెరువులు 13
ఆయకట్టు ఎకరాల్లో 1586
తాత్కాలిక రూ.0.87రూ.కోట్లు
శాశ్వత రూ.1.52 రూ.కోట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వర్షాలకు చెరువులకు గండ్లు పడ్డాయి. కొన్ని చోట్ల చెరువు కట్టలు, కాలువలు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల బుంగలు పడ్డాయి. దీంతో చెరువుల్లోకి వచ్చిన వరదంతా తిరిగి దిగువకు వెళ్లిపోయింది. వర్షంలోనే కొన్ని చోట్ల తాత్కాలికంగా తక్షణ మరమ్మతులు చర్యలు చేపట్టారు. దీంతో కొంత మేర నీటిని నిల్వ చేయగలిగారు. గతేడాది కంటే ఈ ఏడాది జిల్లాలోని చెరవులకు నష్టం తక్కువగా ఉంది. గత జూలైలో 15చెరువులు దెబ్బతిన్నాయి. శాశ్వత మరమ్మతులకు రూ.22.2 కోట్లు అవసరమని అప్పుడే అంచనా వేశారు. వీటిలో కొన్ని మళ్లీ ఈ సీజన్‌లోనూ దెబ్బతిన్నాయి. జిల్లాలో బెల్లంపల్లి సర్కిల్ పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మొత్తం 840 చెరువులు ఉన్నాయి. ఇందులో 750వరకు చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. వీటిలో జిల్లా వ్యాప్తంగా 13చెరువులు దెబ్బతిని వాటి పరిధిలో ఉన్న 1586ఎకరాలకు ఆయకట్టుకు ఇబ్బందిగా మారింది. మరమ్మతు నిధుల కోసం ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపారు. ఇప్పటికే తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని నిల్వకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది తాండూరు మండలం చౌటపల్లి లోని అంకెపల్లి చెరువు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు రాగా, చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా కిందకు వెళ్లిపోయింది. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.1.50లక్షలు, శాశ్వత మరమ్మతుల కోసం రూ.15లక్షలు ఖర్చవుతాయని నివేదిక ఇచ్చారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది భీమిని మండలం కర్జీ భీంపూర్‌లోని పోచమ్మకుంట. చెరువు కట్ట తెగిపోవడంతో ఈ చెరువు కింద 50ఎకరాల సాగుకు ఆటంకం కలుగనుంది. తాత్కాలిక మరమ్మతులకు రూ.60వేలు, శాశ్వత మరమ్మతులకు రూ.45లక్షలు అవసరమని అధికారుల అంచనా.

భారీగా తహసీల్దార్ల బదిలీ

- స్థానికత నేపథ్యంలో ఇతర జిల్లాలకు అలాట్‌మెంట్
- రిపోర్ట్ అనంతరం పోస్టింగ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారీగా తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా స్థానికంగా పనిచేయడం విరుద్ధం. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ చేయడం తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లను ఆయా జిల్లాలకు అలాట్‌మెంట్ చేయగా కలెక్టర్లు పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇతర జిల్లాల నుంచి కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు పలువురు తహసీల్దార్లను అలాట్‌మెంట్ చేశారు. సిద్దిపేట జిల్లా నుంచి ఉమారాణి, విజయ్‌ప్రకాశ్‌రావు, లగిశెట్టి భూపతి, జావీద్ అహ్మద్, కామారెడ్డి నుంచి కె.గణేశ్‌ను రాజన్న సిరిసిల్లకు, మంచిర్యాల నుంచి యం.జ్యోతి, యం.వాసంతి, జి.కుమారస్వామి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి రామ్మోహన్ రావు లను పెద్దపల్లి జిల్లాకు, నిజామాబాద్ జిల్లా నుంచి ముంతాజీబుద్దీన్, వీర్‌సింగ్, ప్రసాద్, యం.వసంత, ఎ.శేఖర్, బవయ్య, మంచిర్యాల నుంచి ఆర్.శేఖర్, ఇ.కిషన్‌ను జగిత్యాల జిల్లాకు సిద్దిపేట నుంచి ఎం.భిక్షపతి, ఇ.నరేందర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఎస్.సమ్మయ్య, హనుమకొండ నుంచి ఎం.రజని, సీహెచ్.రాజు, నిజామాబాద్ నుంచి జి.రాజేందర్, మహబూబాబాద్ నుంచి రమేశ్‌బాబులను కరీంనగర్ జిల్లాకు కేటాయించారు. ఇక ఉమ్మడి జిల్లాలో బదిలీల వివరాలిలా ఉన్నాయి.

పేరు	పనిచేస్తున్న జిల్లా	అలాట్‌మెంట్ చేసిన జిల్లా	పేరు	పనిచేస్తున్న జిల్లా	అలాట్‌మెంట్ చేసిన జిల్లా
జి.నరేందర్	రాజన్న సిరిసిల్ల	కరీంనగర్	డి.నరేశ్	రాజన్న సిరిసిల్ల	జగిత్యాల
కె.విజయ్‌కుమార్	రాజన్న సిరిసిల్ల	కరీంనగర్	యం.వసంత	కరీంనగర్	జగిత్యాల
కొండ వెంకటశ్రవణ్‌కుమార్	రాజన్న సిరిసిల్ల	కరీంనగర్	కొంకుల సురేఖ	కరీంనగర్	సిద్దిపేట
బి.భాస్కర్	రాజన్న సిరిసిల్ల	కరీంనగర్	జింక జయంత్	కరీంనగర్	సిద్దిపేట
మహ్మద్ అబ్దుల్ మాజిద్	రాజన్న సిరిసిల	నిజామాబాద్	నల్ల వెంకట్‌రెడ్డి	కరీంనగర్	పెద్దపల్లి
బి.మదుసూదన్‌రెడ్డి	రాజన్న సిరిసిల	నిజామాబాద్	సీహెచ్ శ్రీనివాస్	కరీంనగర్	సిద్దిపేట
కె.రవికాంత్	రాజన్న సిరిసిల	నిజామాబాద్	అంబటి రజిత	కరీంనగర్	పెద్దపల్లి
పి.మునీందర్	రాజన్న సిరిసిల	నిజామాబాద్	దండిగ రాజయ్య	కరీంనగర్	పెద్దపల్లి
తఫ్జల్ హుస్సేన్	రాజన్న సిరిసిల్ల	నిజామాబాద్	పడిగెల రాజ్‌కుమార్	కరీంనగర్	పెద్దపల్లి
యు.రమేశ్	జగిత్యాల	కరీంనగర్	వి.అనంతరెడ్డి	కరీంనగర్	పెద్దపల్లి
ఎస్.రాజేశ్	జగిత్యాల	కరీంనగర్	ఐ.బావ్‌సింగ్	కరీంనగర్	హనుమకొండ
పోనుగంటి నవీన్	జగిత్యాల	కరీంనగర్	జి.సదానందం	కరీంనగర్	హనుమకొండ
జక్కని స్వర్ణ	జగిత్యాల	పెద్దపల్లి	ఎ.జగత్‌సింగ్	కరీంనగర్	హనుమకొండ
టి.రవీందర్	జగిత్యాల	ములుగు	బండి రాజేశ్వరి	కరీంనగర్	ములుగు
ఎస్.సత్యనారాయణ	జగిత్యాల	రాజన్న సిరిసిల్ల	ఎల్. లక్ష్మారెడ్డి	కరీంనగర్	ములుగు
సీహెచ్ శ్రీనివాస్	జగిత్యాల	రాజన్న సిరిసిల్ల	ఎ.ఉమాశంకర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
కె.శ్రీలత	జగిత్యాల	రాజన్న సిరిసిల్ల	కె.వరందన్	పెద్దపల్లి	ములుగు
యం.కాశీచరణ్	జగిత్యాల	రాజన్న సిరిసిల్ల	సి.రామ్మోహన్	పెద్దపల్లి	జగిత్యాల
బషీరొద్దీన్	జగిత్యాల	పెద్దపల్లి	ఆర్.వెంకటలక్ష్మి	పెద్దపల్లి	మంచిర్యాల
దయ్యి సుజాత	జగిత్యాల	నిజామాబాద్	కె.రమేశ్	పెద్దపల్లి	మంచిర్యాల
మాదేశి రాజేందర్	జగిత్యాల	నిజామాబాద్	బి.సుధాకర్	పెద్దపల్లి	మంచిర్యాల
బి.రవీందర్‌రావు	జగిత్యాల	నిజామాబాద్	కె.వై.ప్రసాద్	పెద్దపల్లి	మంచిర్యాల
ఎండీ యూసుఫ్	జగిత్యాల	నిజామాబాద్	కె.వేణుగోపాల్	పెద్దపల్లి	మంచిర్యాల
టి.విజయలత	రాజన్న సిరిసిల్ల	జగిత్యాల	బి.దత్తుప్రసాదరావు	పెద్దపల్లి	మంచిర్యాల

కలెక్టర్‌ను కలిసిన క్రీడా సంఘాల బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.గోపిని మంగళవారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్, క్రీడా సంఘాల బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. జిల్లాలోని క్రీడారంగ పరిస్థితులను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ క్రీడాపాఠశాలలు మూడు ఉండగా కరీంనగర్‌లో ఒకటి ఉందని, నాలుగేళ్లుగా కోచ్‌ల సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ క్రీడా పోటీల నిర్వహణతో క్రీడాహబ్‌గా మారిందని తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లాను క్రీడారంగంలో ముందు నిలిపేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపినట్లు ఒలింపిక్, క్రీడా సంఘాల బాధ్యులు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాట్రన్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యాయులు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్దారెడ్డి, జిమ్నాస్టిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజనాచారి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు బొకె ఇస్తున్న ఒలింపిక్,క్రీడా సంఘాల బాధ్యులు





అమ్మ చేతి గోరుముద్దకు ఉన్న రుచి చిన్నారులకే తెలుసు. రుచితో పాటు పోషకాలు నిండుగా ఉంటేనే పిల్లలు బలంగా ఎదుగుతారని స్వయంగా వారికి ఇష్టమైన ఆహారాన్ని తయారుచేస్తూ అందిస్తున్నారు తెలంగాణలోని భువనగిరి వాసి **శ్రీదేవి ఆశల.** హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో చంటిపిల్లల కోసం టమ్మీ ఫ్రెండ్లీ ఫుడ్ తయారుచేస్తూ బిజినెస్ ఉమన్‌గా రాణిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా ఉన్న శ్రీదేవి పిల్లల ఆహారం వైపుగా చేసిన ఆలోచనను ఇలా పంచుకున్నారు.

శ్రీదేవి ఆశల

స్వానుభవమే పెట్టుబడి

శ్రీదేవి సక్సెస్ స్టోరీ

''ఇంజినీరింగ్ పూర్తయ్యాక పెళ్లవడంతోనే ఉద్యోగరీత్యా బెంగళూరుకు వెళ్లిపోయాను. అక్కడి పనివేళలతో పాటు ఉరుకుల పరుగుల మీద ఉండేది జీవితం. వండుకొని తినడానికి టైమ్ ఉండేది కాదు. కెరియర్‌ను దృష్టిలో పెట్టుకొని ఇన్‌స్టంట్, ఫాస్ట్‌ఫుడ్స్ మీద బాగా ఆధారపడేవాళ్లం. కొన్నాళ్లకు నేను ప్రెగ్నెంట్ అని తెలిసి చాలా సంతోషించాం. మాకు పుట్టబోయే బిడ్డ కోసం చాలా కలలు కన్నాం. కానీ, అబార్షన్ కావడంతో చాలా బాధ అనిపించింది. మా జీవనశైలి సరిగా లేదని డాక్టర్ చెప్పడంతో ఆలోచనల్లో పడ్డాం.

పరిశోధన అంతా ఇంట్లోనే..

అప్పటి నుంచి సమతుల ఆహారం గురించి తెలుసుకోవడం, పుస్తకాలు చదవడం, ఇంట్లో ప్లాన్ చేసుకోవడం .. ఇది కూడా ఒక ప్రాజెక్ట్ వర్క్‌లా చేశాం. సేంద్రీయ ఉత్పత్తులకు పూర్తిగా మారిపోయాం. దీంతో పాటు గర్భవతులకు, చంటిపిల్లలకు కావాల్సిన పోషకాహారం ఇంట్లోనే తయారు చేయడం మొదలుపెట్టాం. బయట కొన్నవాటిలో కూడా ఏయే పదార్థాలలో ఎంత పోషకాహార సమాచారం ఉంటుందో చెక్ చేయడం అలవాటుగా చేసుకున్నాను.

అడిగినవారికి తయారీ..

మా పెద్దమ్మాయి పుట్టిన తర్వాత పాపకు ఇవ్వాల్సిన బేబీ ఫుడ్‌లో ఉండే రసాయనాల పరిమాణం చెక్ చేసినప్పుడు, చూసి ఆశ్చర్యమనిపించింది. నా పాపకు కెమికల్ ఫుడ్ ఎలా తినిపించాలా అని అనుకున్నాను. అందుకే, పాపకు అవసరమైనవన్నీ ఇంట్లోనే తయారుచేసుకునేదాన్ని. మెటర్నిటీ లీవ్ పూర్తయ్యాక ఆఫీసుకు వెళితే నేను ఫిట్‌గా ఉండటం చూసి, మా ఫ్రెండ్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నావు అని అడిగేవారు. నేను చెప్పే జాగ్రత్తలు విని, మాకూ అలాంటి ఫుడ్ తయారు చేసిమ్మని అడిగేవారు. చుట్టుపక్కల వాళ్లు అడిగినా చేసిచ్చేదాన్ని చిన్నపాప పుట్టిన తర్వాత పిల్లల పోషకాహారంపై దృష్టి పెట్టడం కొంత కష్టంగానే అనిపించింది. ఓ వైపు ఉద్యోగంలో ప్రయాణాలు కూడా ఉండేవి. పిల్లల పోషకాహారంపై ఆసక్తితో పాటు అనుభవం, న్యూట్రిషనిస్టులు, మెంటార్స్ అందరూ నా జాబితాలో ఉన్నారు. దీనినే బిజినెస్‌గా మార్చుకుంటే ఎలా వుంటుంది... అనే ఆలోచన వచ్చింది.



తన టీమ్‌తో శ్రీదేవి



వేరే రాష్ట్రం కావడంతో..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రిజైన్ చేశాను. నేనూ, మా వారు చిదానందం ఇద్దరం చేసిన పొదుపు మొత్తాలను మేం అనుకున్న యూనిట్‌కు తీసుకున్నాం. అయితే, బెంగళూరులో ఉండేవాళ్లం కాబట్టి, అక్కడే అనుకున్న యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటే లైసెన్స్ దగ్గర నుంచి ప్రతిదీ కష్టమయ్యేది. ఒక మహిళ బిజినెస్ పెట్టాలంటే ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో స్వయంగా ఎదుర్కొన్నాను. షాప్స్‌లో ప్రొడక్ట్స్ ఇవ్వాలనుకుంటే 'రెండు-మూడు నెలలు చేసి మానేస్తారా.. ఆ తర్వాత పరిస్థితి ఏంటి' అనేవారు. ప్రొడక్ట్స్ అమ్మడం ఇంత కష్టమా అనిపించింది. కానీ, ఏడాదిన్నరపాటు అక్కడే బిజినెస్ కొనసాగించాను.

నెలకు 20 లక్షల టర్నోవర్

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు యూనిట్ షిఫ్ట్ చేసి ఏడాది అవుతోంది. మొదట మేం అనుకున్న పెట్టుబడి కన్నా ఎక్కువే అయ్యింది. అయినా వదలకుండా నమ్మకంతో వ్యాపారాన్ని ముందంజలోకి తీసుకువచ్చాను. 'కచ్చితంగా చేసి చూపిస్తాను అనే ఆత్మవిశ్వాసమే' నా బిజినెస్‌కు పెట్టుబడి అని చెప్పగలను. నేను చూపాలనుకున్నది, చెప్పాలనుకున్నది కరెక్ట్ అయినప్పుడు ఎక్కడా ఆపకూడదు అనే పట్టుదలతో ఉన్నాను. అందుకే రెండున్నరేళ్లుగా ఈ బిజినెస్‌ను రన్ చేస్తున్నాను. ఇందులో మొత్తం 20 మందికి పైగా వర్క్ చేస్తుంటే, ప్రొడక్షన్ యూనిట్‌లో అంతా తల్లులు ఉండేలా నిర్ణయం తీసుకున్నాను. అమ్మలకు మాత్రమే బాగా తెలుసు పిల్లలకు ఎంత జాగ్రత్తగా, ఎలాంటి ఆహారం, ఎంత ప్రేమగా ఇవ్వాలనేది. ఆ ఆలోచనతోనే యూనిట్‌లో అమ్మలు ఉండేలా జాగ్రత్త తీసుకున్నాను. పిల్లల వయసును బట్టి రాగి జావ, మొలకెత్తిన గింజలు, మల్టీగ్రెయిన్స్, వెజిటబుల్స్‌తో తయారైన ఆర్గానిక్ ప్రొడక్ట్స్ తయారుచేస్తాం. నెలకు 20 లక్షలకు పైగా టర్నోవర్ చేస్తున్నాం. ఆన్‌లైన్ ఆర్డర్స్ ద్వారా విదేశాలకు కూడా మా ప్రొడక్ట్స్ వెళుతుంటాయి. ఒక మహిళ జాబ్ చేయడానికే ధైర్యం కావాలి. ఇక బిజినెస్ అయితే మరింత ధైర్యంతో పాటు ఇంటి నుంచి సహకారం కూడా ఉండాలి. అప్పుడే అనుకున్న వర్క్‌లో బాగా రాణిస్తాం'' అని వివరించింది శ్రీదేవి.

– నిర్మలారెడ్డి

పరస్పరం

స్త్రీలలో బ్రెస్ట్ కేన్సర్ ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. రేడియేషన్‌తో కూడిన మామోగ్రఫీ కన్నా స్పర్శతో బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించడాన్ని 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' అంటారు. స్పర్శ మీద ఎక్కువగా ఆధారపడ్డ అంధ మహిళలకు ఒక ఉపాధిగా స్పర్శతో కేన్సర్‌ను గుర్తించడంలో శిక్షణ ఇస్తున్నారు. ఢిల్లీలో ఇప్పటికే 18 మంది అంధ మహిళలు ఈ శిక్షణ పొందారు. ఇతర అంధ మహిళలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నారు. స్త్రీలు పరస్పరం మేలు పొందే ఈ విశేష కార్యక్రమాన్ని 'లైఫ్ సేవింగ్ హ్యాండ్స్' అంటున్నారు.



చూపు లేదు కాని కేన్సర్‌ని గుర్తిస్తారు

న్యూఢిల్లీకి చెందిన 31 ఏళ్ల మీనాక్షి గుప్తా ప్రతి ఉదయం మెట్రోలో ప్రయాణిస్తున్నప్పుడు అందరూ ఆమెను సాధారణ అంధురాలు అనుకుంటారు. కాని తాను పనిచేసే హాస్పిటల్‌కు ఆమె చేరుకున్నాక ఆ అంధురాలిలోని అసామాన్య నైపుణ్యం తెలిసి ఆశ్చర్యపోతారు. ఆమె 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' నిపుణురాలు. ఇలాంటి నిపుణులను 'మెడికల్ టెక్టయిల్ ఎగ్జామినర్' (ఎం.టి.ఇ) అంటారు. వీరు చేతి స్పర్శతో స్త్రీల వక్షోజాలలో వచ్చిన అతి చిన్న లంప్స్‌ను కూడా గుర్తించి కేన్సర్ బారిన పడకుండా కాపాడుతారు. బ్రెస్ట్ కేన్సర్‌ను స్త్రీలు ఎవరికి వారు స్పర్శ ద్వారా చెక్ చేసుకుంటూ లంప్స్‌ను గుర్తించవచ్చు. కాని అందరూ సరిగ్గా గుర్తించలేరు. చిన్న లంప్స్‌ను అసలు గుర్తించలేరు. కాని 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' నిపుణులు మాత్రం అతి చిన్న లంప్స్‌ను కూడా గుర్తించడంలో శిక్షణ పొందుతారు.

అంధ మహిళలే ఎందుకు?

'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్'ను జర్మనీకి చెందిన గైనకాలజిస్ట్ ఫ్రేన్ హాఫ్‌మేన్ కనుగొన్నాడు. బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించే మామోగ్రఫీలో రేడియేషన్ ఉంటుంది. ఖర్చు కూడా. కాని చేతులతో గుర్తించడంలో ఎటువంటి రేడియేషన్ ఉండదు. ఖర్చు కూడా ఉండదు. అందుకే చేతి స్పర్శ ద్వారా ఎలా బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించవచ్చో అతను కొన్ని పద్ధతులను ప్రతిపాదించాడు. ఇందులో శిక్షణకు అంధ మహిళలను ఎంచుకున్నాడు. ఎందుకంటే చూపు లేకపోవడం వల్ల అంధులు స్పర్శ మీద ఎక్కువగా ఆధారపడతారు. వారు తమ స్పర్శతో కచ్చితంగా లంప్స్‌ను గుర్తించగలరని ఊహించాడు. అతని ఊహ నిజమైంది. అంధ మహిళల స్క్రీనింగ్‌లో కేవలం 1 శాతం మాత్రమే తప్పు అంచనా వచ్చి మిగిలిన 99 శాతం నిర్ధారిత అంచనా వచ్చింది. దాంతో అతను ఒక సేవాకార్యక్రమంగా 'లైఫ్ సేవింగ్ హ్యాండ్స్' పేరుతో ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, కొలంబియా, మెక్సికో, ఇండియాలలోని ఆయా ప్రభుత్వ అంధుల పర్యవేక్షణ సంస్థలను కోరారు. మన దేశంలో 2017 నుంచి ఈ శిక్షణ జరుగుతోంది. ఇప్పటికి 18 మంది ఎం.టి.ఇలు శిక్షణ పొందారు. మరో 8 మంది ఇప్పుడు శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ పొందుతున్న అంధురాలు

9 నెలల శిక్షణ

ఢిల్లీలోని 'బ్లైండ్ ఇండియా సెంటర్ ఫర్ బ్లైండ్ విమెన్ అండ్ డిజేబిలిటీ స్టడీస్' (ఎన్.ఎ.బి.సి.బి.డబ్ల్యు)లో మెడికల్ టెక్టయిల్ ఎగ్జామినర్ (ఎం.టి.ఇ)లుగా శిక్షణను ఇస్తున్నారు. అంధ మహిళలు, చూపు లోపం పాక్షికంగా ఉన్నవారు ఈ శిక్షణను పొందవచ్చు. 9 నెలలు ట్రైనింగ్ ఉంటుంది. ఆరు నెలలు సెంటర్‌లో, మూడు నెలలు ఆస్పత్రిలో పని చేయాలి. ఈ ట్రయినింగ్‌లో ఇంగ్లిష్, కంప్యూటర్‌ను ఆపరేట్ చేయడం, మానవ శరీర నిర్మాణంలో ప్రాథమిక అవగాహన తదితరాలు నేర్పిస్తారు. 'అంధులు బ్రెస్ట్ కేన్సర్‌ను స్పర్శతో ఎలా గుర్తించగలరా అని ముందు సందేహించాను. కాని జర్మనీకి వెళ్లి చూశాక మన దేశంలో అంధ మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను' అన్నారు బ్లైండ్ ఇండియా సెంటర్ డైరెక్టర్ షాలినీ ఖన్నా.

క్యాంపులలో సేవలు

బ్లైండ్ ఇండియా సెంటర్ తరచూ బ్రెస్ట్ కేన్సర్ అవేర్‌నెస్ క్యాంపులను నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల్లో ఎం.టి.ఇలు తమ స్పర్శతో స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారు. '4 మిల్లీమీటర్ల చిన్న లంప్‌ను కూడా ఎం.టి.ఇలు గుర్తిస్తున్నారు' అని క్యాంప్ నిర్వాహకులు తెలియచేస్తున్నారు. వీరి నిర్ధారణ తప్పడం లేదు కనుక అంధ మహిళలు ఈ శిక్షణ తీసుకుని ఈ సేవలను కొనసాగిస్తూ ఉపాధి పొందాలని బ్లైండ్ ఇండియా సెంటర్ తెలియచేసింది.

బ్యూటిప్స్

వైటెనింగ్ జెల్



టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడినీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చిపాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పది నిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల తేమ అంది, చర్మం పట్టులా నిగారింపుతో మెరుపులీనుతూ కనిపిస్తుంది.



జుట్టు రాలడాన్ని తగ్గించే డికాషన్

మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. తరువాత చల్లారనిచ్చి వడగట్టి డికాషన్‌ను సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

యూత్ పల్స్

యువతలోని ఒక వర్గం నుంచి బలంగా వినిపిస్తున్న నినాదం... జాయిన్ ది జోమో క్లబ్! ఒకప్పుడు ఫోమో(ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) క్లబ్‌లో ఉన్నవారు కూడా జోమో (జాయ్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) లోకి వచ్చేస్తున్నారు. మెయిన్‌స్ట్రీమ్ ధోరణికి భిన్నంగా కలలు కనే 'జోమో' ట్రెండ్ యువతరం 'సక్సెస్‌తో సంతోషం వస్తుందో లేదోగాని సంతోషంతో మాత్రం తప్పనిసరిగా సక్సెస్ వస్తుంది' అంటోంది...



జోరుగా జోమోయిజం

రాజస్థాన్‌లోని కోట నగరం 'కోచింగ్ హబ్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచింది. తియ్యటి భవిష్యత్ కలలతో పాటు పీడకలలలాంటి ఒత్తిడి, భయం, ఆందోళన ఆ గాలిలోనే తేలియాడుతుంటాయి.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజిత్ కిశోర్ ఐఐటీ కోచింగ్ కోసం ఇక్కడికి వచ్చాడు. తండ్రికి చెరుకుకు సంబంధించిన ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఉంది. ఐఐటీ-కాన్పూర్‌లో చదివిన అజిత్ సోదరుడు అమెరికాలో సెటిల్ అయ్యాడు. ఈ నేపథ్యంలో తనకు మరో 'ఐఐటీ పుత్రుడు' కావాలనుకున్నాడు తండ్రి. ఫలితంగా అజిత్ కిశోర్ కోట నగరానికి అనివార్యంగా రావాల్సి వచ్చింది.

అజిత్ కిశోర్‌కు ఐఐటీ అంటే బొత్తిగా ఇష్టం లేదు. 'ఆసక్తి లేకపోవడం కాదు, అందుకు తగిన ప్రతిభాసామర్థ్యాలు నాలో లేవు. నాకు సంబంధం లేని విషయానికి నేనేందుకు బాధ పడాలి?' అంటాడు అజిత్.

తరచు కోచింగ్ క్లాసులు ఎగ్గొట్టే బిహార్‌లోని పట్నాకు చెందిన రక్షిత్ కుమార్ 'నాకు ఐఐటీ సీటు కచ్చితంగా రాదు. అయినా సరే, నటించక తప్పదు' అని నవ్వుతూ అంటాడు.

'దీనివల్ల టైమ్, డబ్బు వృథా కదా?' అని అడిగితే రక్షిత్ ఇలా జవాబు ఇస్తాడు...

'నేను చదువులో యావరేజ్ స్టూడెంట్‌ని. మా నాన్నకేమో నేను ఇంజినీర్ కావాలని పట్టుదల. ఫ్యాషన్ డిజైనర్ కావాలనేది నా కల. ఈ విషయాన్ని నాన్నకు చెబితే ఐఎఎస్ ఆఫీసర్ కొడుకు టైలర్ కావాలనుకుంటాడా? అని వెటకారంగా మాట్లాడారు. నిన్ను ఇంజినీర్‌గా చూడాలనేది నా కల. ఏం చేస్తావో, ఎలా చేస్తావో తెలియదు అని ఆర్డర్ జారీ చేశారు. కాబట్టి ఆయన మనసు నొప్పించకుండా ఇక్కడకు రావాల్సి వచ్చింది'

మధ్యప్రదేశ్ నుంచి కోట నగరానికి వచ్చిన అదితిశర్మ తండ్రి డెంటిస్ట్. తల్లి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.

'నా తల్లిదండ్రుల కలల బాధితురాలిని' నవ్వుతూ అంటుంది అదితి.

'ఎందుకలా?' అని అడిగితే...

సోషల్ మీడియాలో భాగం కాకపోతే, చురుగ్గా ఉండకపోతే అందరిలా ఎగ్జైట్‌మెంట్‌ను మిస్ అవుతాను, ఒంటరిని అవుతానేమో అనే భయం... ఫోమో. మరోవైపు జోమో మాత్రం అలాంటి భయాలను పక్కనపెడుతుంది. టెక్-ఫ్రీ బ్రేక్స్‌ను ఇష్టపడుతుంది.

- భావనా బర్మీ, క్లినికల్ సైకాలజిస్ట్

'నా తల్లిదండ్రులు చదువులో బ్రైట్. నేను మాత్రం బ్రైట్ స్టూడెంట్ కాలేకపోయాను. అందుకు నేనేమీ బాధ పడడం లేదు. చెఫ్ కావాలనేది నా కల' అంటుంది అదితి.

అదితి శర్మలాగే 'కోట మాత్రమే ప్రపంచం కాదు. దీనికి అవతల పెద్ద ప్రపంచం ఉంది. అక్కడ మనకు తగిన అద్భుత అవకాశాలు ఉంటాయి' అనుకునే విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు.

కోటలాంటి కోచింగ్ సెంటర్‌లకు ప్రసిద్ధిగాంచిన నగరాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. అదితిశర్మలాంటి విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు.

అదితి శర్మలాంటి వాళ్లను ఆకట్టుకుంటున్న ట్రెండ్... జోమో.

ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్-తప్పిపోతుందేమో అనే భయం) పాత విషయం అయిపోయింది. జోమో (జాయ్ ఆఫ్ మిస్సింగ్ ఔట్-తప్పిపోయినందుకు ఆనందం) అనేది కొత్త ట్రెండ్‌గా మారింది.

యూత్‌లో కొంత మంది నుంచి వినిపిస్తున్న 'జాయిన్ ది జోమో క్లబ్' నినాదాన్ని ఎలా చూడాలి? పలాయనవాదమా? కాలహరణమా?

'చాలామంది పిల్లలు తల్లిదండ్రులు ఆదేశించగానే ఓకే చెబుతారు. తాము సాధించగలం అనుకుంటారు. ఒకసారి వృత్తంలోకి వచ్చిన తరువాత పేరెంట్స్, ఉపాధ్యాయులు, ఇతరుల నుండి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వచ్చే ఒత్తిడితో సతమతమవుతారు. ఆ తరువాత పరిణామాలు ఎటో వెళతాయి. మొదటికే మోసం వస్తుంది. తల్లిదండ్రుల కలను నెరవేర్చలేకపోతున్నాను అనే బాధతో ఆత్మహత్యకు పాల్పడే వాళ్లు కూడా ఉన్నారు. దీని కంటే జోమో నయం కదా! జోమో బాయ్స్ అండ్ గర్ల్స్ తమ బలాలు, బలహీనతల విషయంలో చాలా స్పష్టంగా ఉంటున్నారు. ఇఫ్ ఐయామ్ హ్యాపీ ఐయామ్ సక్సెస్‌ఫుల్. సక్సెస్ అంటే అకాడమిక్, ప్రొఫెషన్ సక్సెస్ మాత్రమే కాదు' అంటూ జోమోవాదులను సమర్థించేవాళ్లు ఎంతోమంది ఉన్నారు.

'జోమో' కెరీర్‌కే పరిమితమైన ట్రెండ్ కాదు. సోషల్ మీడియాలోని అనేక అంశాలు ఈ ట్రెండ్ బలపడడానికి కారణం.

'సోషల్ మీడియాలో భాగం కాకపోతే, చురుగ్గా ఉండకపోతే అందరిలా ఎగ్జైట్‌మెంట్‌ను మిస్ అవుతాను, ఒంటరిని అవుతానేమో అనే భయం... ఫోమో. మరోవైపు జోమో మాత్రం అలాంటి భయాలను పక్కనపెడుతుంది. టెక్-ఫ్రీ బ్రేక్స్‌ను ఇష్టపడుతుంది' అంటుంది ఢిల్లీకి చెందిన సీనియర్ క్లినికల్ సైకాలజిస్ట్ భావనా బర్మీ.

రెండు సంవత్సరాల క్రితం ట్రావెల్ ఇండస్ట్రీలో 'జోమో' ట్రెండ్ గట్టిగా వినిపించింది, ఈ ట్రెండ్‌లో భాగంగా ఆఫ్ సీజన్, జనసమూహాలు ఎక్కువగా కనిపించని, పెద్దగా జనాదరణ లేని ప్రదేశాలను ఎంచుకునేవారు. స్థూలంగా చెప్పాలంటే ఇది ఒకే రంగానికి, ఒకే అంశానికి పరిమితమైన ట్రెండ్ కాదు.

ది జోమో కాక్‌టెయిల్



1. సెల్ఫ్ లవ్ 2. కృతజ్ఞత 3. ఉనికి 4. హద్దులు

ఇంటిప్స్

బిస్కెట్లు కరకరలాడాలంటే...

వర్షాకాలంలో కూడా బిస్కెట్లు మెత్తగా అవకుండా కరకరలాడాలంటే ఇలా చేసి చూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలిచొరబడకుండా పెడితే ఎక్కువ రోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండుమూడు వరుసల్లో టిష్యూ పేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.





- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలిచొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వ చేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో పదినిమిషాలు వేడిచేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వ చేసుకోవచ్చు.



సాకేత్-మార్టినెజ్ జోడీ శుభారంభం

మిఫెల్ టెన్నిస్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో భారత ప్లేయర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని పురుషుల డబుల్స్ విభాగంలో శుభారంభం చేశాడు. తన భాగస్వామి మార్టినెజ్ (వెనిజులా)తో కలిసి సాకేత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మెక్సికోలో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-మార్టినెజ్ ద్వయం 6-3, 2-6, 10-5తో ఎర్నెస్టో ఎస్కోబె డో-రోడ్రిగో మెండెజ్ (మెక్సికో) జోడీపై గెలిచింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట మూడు ఏస్‌లు సంధించింది.



తొమ్మిదో ర్యాంక్‌కు ప్రణయ్

గతవారం జపాన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన ప్రణయ్, సెమీఫైనల్లో ఓడిన లక్ష్య సేన్ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించారు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ ఒక స్థానం మెరుగుపర్చుకొని తొమ్మిదో ర్యాంక్‌కు... లక్ష్య సేన్ రెండు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ 19వ ర్యాంక్‌లో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 17వ ర్యాంక్‌లో, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

రెండో రౌండ్‌కు ప్రియాంక



బకూ (అజర్‌బైజాన్): అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో రెండో రౌండ్‌కు చేరుకుంది. మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్‌లో ప్రియాంక ర్యాపిడ్ ఫార్మాట్ టైబ్రేక్‌లో 1.5–0.5తో గెలుపొందింది. టైబ్రేక్ తొలి గేమ్‌ను 43 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న ప్రియాంక, రెండో గేమ్‌లో 45 ఎత్తుల్లో మరీనాను ఓడించి ఓవరాల్‌గా 2.5–1.5తో విజయం అందుకుంది. క్లాసికల్ ఫార్మాట్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి రెండు గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు ర్యాపిడ్ గేమ్‌లను నిర్వహించారు. రెండో రౌండ్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్‌కే చెందిన కోనేరు హంపితో ప్రియాంక తలపడుతుంది. ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి కథ తొలి రౌండ్‌లోనే ముగిసింది. లెవాన్ పాంట్‌సులెయ (జార్జియా)తో టైబ్రేక్ తొలి గేమ్‌లో హర్ష 75 ఎత్తుల్లో ఓడిపోయి, రెండో గేమ్‌ను 66 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని 0.5–1.5తో ఓటమి చవిచూశాడు.

ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం ప్రీక్వార్టర్ ఫైనల్ చేరగా... అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ తొలి రౌండ్‌లో... సిక్కి రెడ్డి-ఆరతి సారా సునీల్ జంట క్వాలిఫయింగ్‌లో నిష్క్రమించాయి. తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ 21–16, 21–17తో కేథరీన్ చోయ్-జోసెఫిన్ వు (కెనడా)లపై గెలిచారు. అశ్విని-తనీషా 11–21, 21–14, 17–21తో ఫెబ్రియానా కుసుమ-అమాలియా ప్రతవి (ఇండోనేసియా) చేతిలో... సిక్కి రెడ్డి-ఆరతి 14–21, 17–21తో సు యిన్ హుయ్-లీ చి చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు.

సిరీస్ కోసం భారీ స్కోరు


సామ్సన్

- భారత్ 351/5
- గిల్, ఇషాన్ అర్ధ సెంచరీలు
- సామ్సన్, హార్దిక్ మెరుపులు
- వెస్టిండీస్‌తో ఆఖరి వన్డే

తరూబా (ట్రినిడాడ్): ఎట్టకేలకు వెస్టిండీస్ గడ్డపై టీమిండియా బ్యాటింగ్ పవర్ ఆఖరి వన్డేలో బయటికొచ్చింది. సిరీస్ గెలుచుకొచ్చే ఆటతీరును కనబరిచింది. ఆతిథ్య ప్రత్యర్థి ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. సీనియర్లు లేకపోయినా... ఇకపై టీమిండియాకు తురుపుముక్కలు కానున్న బ్యాటర్లు బాధ్యత పంచుకున్నారు. ఓపెనర్లు శుబ్‌మన్ గిల్ (92 బంతుల్లో 85; 11 ఫోర్లు), ఇషాన్ కిషన్ (64 బంతుల్లో 77; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సంజూ సామ్సన్ (41 బంతుల్లో 51; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా (52 బంతుల్లో 70 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులతో అర్ధ సెంచరీలు సాధించి రాణించారు. ఈ సిరీస్‌లో తమని వణికించిన కరీబియన్ బౌలింగ్‌పై ఈ మ్యాచ్‌లో ఓ ఆటాడుకున్నారు. దీంతో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 351 పరుగుల భారీ స్కోరు చేసింది. విండీస్‌లో వెస్టిండీస్ జట్టుపై భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం.

టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్న విండీస్ గత మ్యాచ్‌లాగే భారత్‌ను కట్టడి చేయాలనుకున్న ఆశలకు ఓపెనింగ్ జోడీ నుంచే నిరాశ ఎదురైంది. దాదాపు 20 ఓవర్ల (19.4) పాటు గిల్, ఇషాన్‌లే ఆడేశారు. విండీస్ బౌలర్లను బాదేశారు. యథేచ్ఛగా పరుగులు సాధించారు. దీంతో తొలి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఇక్కడే ఇషాన్ అవుటయ్యాక వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ (8) తక్కువే చేశాడు. అయితే గిల్‌కు సామ్సన్ జతవ్వడంతో మళ్లీ పరుగులు.... విండీస్‌కు కష్టాలు... కొనసాగాయి. భారీ సిక్సర్లతో వేగంగా (39 బంతుల్లో) అర్ధసెంచరీ చేసిన సంజూ, సెంచరీపై కన్నేసిన గిల్ స్వల్ప వ్యవధిలో నిష్క్రమించారు. అప్పుడు భారత్ స్కోరు 244/3. ఈ దశలో కెప్టెన్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో బలమైన భాగస్వామ్యం నమోదు చేయడంతో 45.5 ఓవర్లలోనే భారత్ స్కోరు 300 దాటింది. సూర్య అవుటైనా... 45 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా


ఇషాన్, గిల్



చుక్కలు చూపించే సిక్సర్లతో స్కోరు వేగాన్ని అమాంతం పెంచాడు. షెఫర్డ్ 2 వికెట్లు తీశాడు. కీలకమైన ఈ మ్యాచ్‌కూ కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లిలకు విశ్రాంతిని కొనసాగించారు. అయితే తుదిజట్టులో ఉమ్రాన్ మాలిక్, అక్షర్ పటేల్ స్థానాల్లో రుతురాజ్, ఉనాద్కట్‌లను తీసుకున్నారు.

352 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 11 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (స్టంప్డ్) హోప్ (బి) కరియా 77; గిల్ (సి) కరియా (బి) మోతీ 85; రుతురాజ్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 8; సామ్సన్ (సి) హెట్‌మైర్ (బి) షెఫర్డ్ 51; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 70; సూర్యకుమార్ (సి) కరియా (బి) షెఫర్డ్ 35; రవీంద్ర జడేజా (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 351. వికెట్ల పతనం: 1-143, 2-154, 3-223, 4-244, 5-309. బౌలింగ్: సీల్స్ 8-0-75-0, మేయర్స్ 4-0-25-0, జోసెఫ్ 10-0-77-1, గుడకేశ్ మోతీ 10-1-38-1, షెఫర్డ్ 10-0-73-2, కరియా 8-0-58-1.

భారత్‌కు మూడు పతకాలు

రజతాలు నెగ్గిన వెంకటకృష్ణ, పల్లవి ● కాంస్యం సాధించిన హారిక


వెంకటకృష్ణ పల్లవి హారిక

గ్రేటర్ నోయిడా: సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. మంగళవారం భారత వెయిట్‌లిఫ్టర్లు రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు గెలిచా రు. భారత్ గెల్చుకున్న మూడు పతకాలూ ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్లు వెంకటకృష్ణ, సనపతి పల్లవి, హారిక బెల్లన అందించడం విశేషం. పురుషుల యూత్ 73 కేజీల విభాగంలో ఏలూరు జిల్లాకు చెందిన బి.వెంకటకృష్ణ రజత పతకం సాధించాడు. వెంకటకృష్ణ 271 కేజీలు (స్నాచ్‌లో 120+క్లీన్ అండ్ జెర్క్‌లో 151) బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. మహిళల జూనియర్ 64 కేజీల విభాగంలో వైజాగ్ అమ్మాయి పల్లవి రజత పతకం సొంతం చేసుకుంది. పల్లవి 196 కేజీలు (స్నాచ్ లో 87+క్లీన్ అండ్ జెర్క్‌లో 109) బరువెత్తి రెండో స్థానాన్ని దక్కించుకుంది. మహిళల యూత్ 59 కేజీల విభాగంలో హారిక కాంస్య పతకాన్ని కై వసం చేసుకుంది. హారిక మొత్తం 176 కేజీలు (స్నాచ్‌లో 78+క్లీన్ అండ్ జెర్క్‌లో 98) బరువెత్తి మూడో స్థానాన్ని సంపాదించింది.

సిఫ్ట్ కౌర్‌కు రెండు స్వర్ణాలు


స్వర్ణ పతకాలతో ఆశి, మానిని, సిఫ్ట్ కౌర్

చెంగ్డూ: ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం భారత షూటర్లు రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచారు. పంజాబ్ అమ్మాయి సిఫ్ట్ కౌర్ సమ్రా మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో, వ్యక్తిగత విభాగంలో పసిడి పతకాలు సొంతం చేసుకుంది. టీమ్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్, ఆశి చౌక్సీ, మానిని కౌశిక్‌లతో కూడిన భారత జట్టు 3527 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో సిఫ్ట్ కౌర్ 462.9 పాయింట్లతో విజేతగా నిలువగా, ఆశి చౌక్సీ 461.6 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకొని రజతం గెలిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ సింగ్ చీమా, వరుణ్ తోమర్, అన్‌మోల్ జైన్‌లతో కూడిన భారత జ ట్టు 1730 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 4 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 21 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.


రెండో సీడ్‌గా జ్యోతి సురేఖ, ధీరజ్





బెర్లిన్ (జర్మనీ): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్ మెరిశారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ ర్యాంకింగ్ రౌండ్‌లో మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ 701 పాయింట్లు... పురుషుల రికర్వ్ విభాగంలో ధీరజ్ 683 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచారు. ఫలితంగా నాకౌట్ దశలో రెండో సీడింగ్ పొందిన జ్యోతి సురేఖ, ధీరజ్‌లకు నేరుగా మూడో రౌండ్‌కు 'బై' లభించింది.

సినిమా



రవితేజ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 20న రిలీజ్ చేయనున్నట్లు గతంలో ప్రకటించారు మేకర్స్. అయితే ఈ సినిమా విడుదల ఆలస్యమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 'టైగర్ నాగేశ్వరరావు' విడుదలలో ఎలాంటి మార్పు లేదని, ముందుగా ప్రకటించినట్లు దసరాకి అక్టోబర్ 20నే విడుదల చేస్తామని చిత్రబృందం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. ''టైగర్ నాగేశ్వరరావు' చిత్రం అక్టోబర్ 20న విడుదల కావడం లేదంటూ కొన్ని శక్తులు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయి. ఆ వదంతులను నమ్మవద్దు. మీకు (ప్రేక్షకులు) అత్యుత్తమ సినిమా అనుభూతిని అందించడానికి మేము కృషి చేస్తున్నాం. అక్టోబరు 20 నుంచి బాక్సాఫీస్ వద్ద టైగర్ వేట ప్రారంభమవుతుంది'' అని మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి సహనిర్మాత: మయాంక్ సింఘానియా, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్ మది.

బర్త్ డే స్పెషల్


మృణాల్ ఠాకూర్

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఆ సినిమా ఘన విజయం సాధించడంతో తెలుగులో ఆమెకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ హీరోగా చేస్తున్న 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్) సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. కాగా ఆగస్టు 1న మృణాళ్ ఠాకూర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హాయ్ నాన్న' టీమ్ నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్.

సెట్స్‌లో... 'గీత గోవిందం' వంటి హిట్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్). 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెట్స్‌లో మృణాల్ బర్త్‌డేని సెలబ్రేట్ చేశారు. ఈ సెలబ్రేషన్స్‌లో విజయ్ దేవరకొండ, పరశురామ్, శిరీష్, హన్షిత పాల్గొన్నారు.

హాయ్ హాయ్ నాయికా...

నాయికా ప్రాధాన్యంగా సాగే చిత్రాలు చేయడం అంటే అంత ఈజీ కాదు. కథానుసారం ఫైట్లు చేయాలి.. పవర్‌ఫుల్ డైలాగులు చెప్పాలి.. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలకన్నా కాస్త ఎక్కువగానే ఎమోషన్ పండించాలి.. అవసరమైతే క్యారెక్టర్‌కి తగ్గట్టు సన్నబడాలి లేదా బరువు పెరగాలి లేదా నల్లటి మేకప్ వేసుకోవాలి. అన్నింటికీ మించి సినిమా మొత్తం ఆ నాయిక తన భుజాల మీద మోయాలి. 'లేడీ ఓరియంటెడ్' మూవీ అంటే పెద్ద సవాల్. అలాంటి సవాల్ వస్తే కాదనకుండా ఒప్పేసుకుంటారు కథానాయికలు. ప్రస్తుతం ముగ్గురు నాయికలు తొలిసారి 'హాయ్ హాయ్ నాయికా' అంటూ లేడీ ఓరియంటెడ్ మూవీకి సై అన్నారు.


అదితీరావ్ హైదరి

ఎమోషనల్ రెయిన్ బో


రష్మికా మందన్నా

రష్మికా మందన్నా క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ బ్యూటీ ఇప్పటివరకూ ఎక్కువగా కమర్షియల్ చిత్రాలే చేశారు. 'రెయిన్ బో' చిత్రంతో తొలిసారి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ వరల్డ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు రష్మికా మందన్నా. ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు శాంత రూబన్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ప్రధానంగా ఎమోషన్స్‌తో సాగుతుందట. ఇందులో మలయాళ నటుడు దేవ్ మోహన్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ కానుంది.

రోడ్ ట్రిప్

మనాలి, లడఖ్ లొకేషన్స్‌తో పాటు నార్త్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో రోడ్ ట్రిప్ చేస్తున్నారట హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. ఇది పర్సనల్ ట్రిప్ కాదు... ప్రొఫెషనల్ ట్రిప్ అని తెలిసింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ దర్శకత్వంలో రోడ్ ట్రిప్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ లేడీ ఓరియంటెడ్ మూవీలో అనుపమా పరమేశ్వరన్ మెయిన్ లీడ్ రోల్ చేస్తుండగా, మలయాళ యంగ్ బ్యూటీ దర్శన, సీనియర్ నటి సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు. ముగ్గురు మహిళల జీవితాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని టాక్. మరోవైపు ఈ సినిమా కంటే ముందే 'బటర్ ఫ్లై' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ చేశారు అనుపమా పరమేశ్వరన్. అయితే ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ అయ్యింది. ఇప్పుడు అనుపమ చేస్తున్న చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. సో.. వెండితెరపై అనుపమ కనిపించనున్న తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ఇదే అవుతుందనుకోవచ్చు.

వచ్చే నెలలో ఆరంభం


అనుపమా పరమేశ్వరన్

'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి తెలుగు సినిమాలతో నటిగా ప్రేక్షకులతో మంచి మార్కులు వేయించుకున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. ఈ బ్యూటీ సౌత్‌లో ఫస్ట్‌టైమ్ ఓ లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. దర్శక-నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ప్లాన్ చేస్తున్నారని, ఈ చిత్రంలోని మెయిన్ లీడ్ క్యారెక్టర్‌కు అదితీరావ్‌ని ఎంపిక చేశారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభించుకోనున్న ఈ సినిమా వచ్చే ఏడాదిలో విడుదల కానుంది.

త్రిష, అనుష్క, కాజల్ అగర్వాల్, తమన్నా, నయనతార, సమంత వంటి తారలు ఇప్పటికే పలు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు మరికొందరు ఈ తరహా చిత్రాలపై మొగ్గు చూపారు. వీరి స్ఫూర్తితో కొందరు యువకథానాయికలు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు సైన్ చేయడానికి రెడీ అవుతున్నారు.

సూపర్ చాన్స్..


అనిఖా

యంగ్ హీరోయిన్ అనిఖా సురేంద్రన్‌కు మంచి ఆఫర్ దక్కినట్లుగా కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డీ 50' (వర్కింగ్ టైటిల్)లో అనిఖా సురేంద్రన్‌కి ఓ లీడ్ రోల్ చేసే చాన్స్ దక్కిందట. ధనుష్ సినిమాలో ఓ లీడ్ యాక్ట్రస్‌గా అంటే అనిఖాకు సూపర్ చాన్స్ అనొచ్చు. ఇక అజిత్ హీరోగా నటించిన 'ఎంతవాడు కానీ', 'విశ్వాసం' వంటి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన అనిఖా, తెలుగులో వచ్చిన నాగార్జున 'ది ఘోస్ట్', 'బుట్టబొమ్మ' వంటి చిత్రాల్లో ఓ లీడ్ యాక్ట్రస్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

రీల్స్

శరత్‌బాబుకి అంకితం


ఆయుష్, శరత్‌బాబు

ఇటీవల (మే 22) కన్నుమూసిన సీనియర్ నటుడు శరత్‌బాబు ఫ్యామిలీ నుంచి హీరో వస్తున్నాడు. శరత్‌బాబు సోదరుడి కుమారుడు ఆయుష్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'దక్ష'. కాగా గతంలో ఆయుష్‌ని తన నటవారసుడిగా శరత్‌బాబు పేర్కొన్నారు. వివేకానంద విక్రాంత్ దర్శకత్వంలో తల్లాడ శ్రీనివాస్ నిర్మించిన 'దక్ష' ఈ నెల 25న విడుదల కానుంది. ''మా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మా ప్రొడ్యూసర్, డైరెక్టర్ రాజీ పడకుండా పూర్తి చేశారు. మా నాన్న (శరత్‌బాబు)గారికి ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాం'' అన్నారు ఆయుష్. అఖిల్, రవి రెడ్డి, అను, రియా, పవన్, నక్షత్ర తదితరులు నటించిన ఈ సస్పెన్స్ థ్రిల్లింగ్ చిత్రానికి సంగీతం: లలిత్.

కోట బొమ్మాళి పీఎస్‌లో..


శ్రీకాంత్

శ్రీకాంత్ మేక ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్‌పై 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రత్యేక పాత్రలో, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''రాజకీయాలు, పోలీసుల మధ్య జరిగే పరిణామాల నేపథ్యంలో 'కోట బొమ్మాళి పీఎస్' రూపొందుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి, సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్.

మెడికో థ్రిల్లర్


అశ్విన్

అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'వచ్చినవాడు గౌతం' అనే టైటిల్ ఖరారు చేశారు. మామిడాల ఎంఆర్ కృష్ణ దర్శకత్వంలో ఆలూరి సురేష్ నిర్మిస్తున్నారు. మంగళవారం (ఆగస్టు 1) అశ్విన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''మెడికో థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం అశ్విన్ ఫిజికల్‌గా మేకోవర్ అయ్యారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, సంగీతం: గౌర హరి.

ముక్కోణపు ప్రేమకథ


స్నేహా సింగ్, అభినవ్

అభినవ్ మదిశెట్టి, స్నేహా సింగ్ జంటగా నటించిన చిత్రం 'దిల్ సే'. మంకల్ వీరేంద్ర, రవికుమార్ సబ్బాని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 4న రిలీజ్ కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పి. కౌశిక్ రెడ్డి, నిర్మాత బెక్కం వేణుగోపాల్ అతిథులుగా హాజరయ్యారు. ''ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది'' అని మంకల్ వీరేంద్ర, రవికుమార్ సబ్బాని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽ 68	66,459	
నిఫ్టీ ▽ 20	19,734	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,280	▽	66
డోజోన్స్	35,571	△	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,666	▽	33
డాక్స్	16,240	▽	206
షాంఘై	3,291	△	15
నికాయ్	33,477	△	304

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	59,451 ▽	116
బంగారం (99.5 స్వచ్ఛత)	59,213 ▽	115
వెండి (కిలో)	74,288 △	428

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

జీఎస్‌టీ వసూళ్ల ఉత్సాహం

- జూలైలో వరుసగా ఐదవ నెల రూ.1.60 లక్షల కోట్లకు పైగా వసూళ్లు
- ఎగవేత నిరోధక చర్యల ఫలితం
- పెరిగిన వినియోగ వ్యయం

న్యూఢిల్లీ: ఎగవేత నిరోధక చర్యలు, అధిక వినియోగదారుల వ్యయాల ఫలితంగా జూలైలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 11 శాతం పెరిగి (2022 ఇదే నెలతో పోల్చి) రూ.1.65 లక్షల కోట్లకు చేరాయి. 2017 జూలై నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత, నెలవారీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లను అధిగమించడం వరుసగా ఇది ఐదవ నెల. ఆర్థికశాఖ ప్రకటన ప్రకారం వసూళ్ల తీరును క్లుప్తంగా పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,65,105 కోట్లు
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.29,773 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.37,623 కోట్లు



- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.85,930 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.41,239 కోట్ల వసూళ్లుసహా)
- సెస్ రూ.11,779 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.840 కోట్ల వసూళ్లుసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్లు అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లలో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు చొప్పున ఖజానాకు జమయ్యాయి.

88 శాతం పెద్ద నోట్లు వచ్చేశాయ్: ఆర్‌బీఐ

ముంబై: చెలామణీలో ఉన్న 88 శాతం రూ.2,000 నోట్లు 2023 జూలై 31వ తేదీ నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రకటనలో పేర్కొంది. వీటి విలువ రూ.3.14 లక్షల కోట్లుగా పేర్కొంది. అటు తర్వాత (జూలై 31 తర్వాత) వ్యవస్థలో ఉన్న పెద్ద నోట్ల విలువ రూ.0.42 లక్షల కోట్లని వెల్లడించింది. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.3.62 లక్షల కోట్ల విలువైన రూ.2,000 బ్యాంక్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఉపసంహరణ ప్రకటన చేసిన మే 19వ తేదీ నాటికి రూ.3.56 లక్షల కోట్లకు తగ్గాయి. సెప్టెంబర్ 30వ తేదీ వరకూ గడువు ఉన్నప్పటికీ, వాటికి అంతకుముందుగానే మార్చుకోవడానికి ప్రజలు ఉత్సుకత చూపినట్లు తాజా గణాంకాల ప్రకారం తెలుస్తోంది. 2016 నవంబర్‌లో అప్పటి పెద్ద నోట్ల రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన




ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణి విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణిలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణిలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8 శాతం మాత్రమే.

తయారీ.. వరుసగా 25వ నెలా వృద్ధిబాట

జూలైలో 57.7 వద్ద సూచీ

న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగం జూలైలో వరుసగా 25వ నెల వృద్ధి బాటన నిలిచినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పేర్కొంది. జూలైలో సూచీ 57.7 వద్ద పటిష్టంగా ఉంది. అయితే జూన్‌కన్నా (57.8) స్వల్పంగా తగ్గింది. సూచీ 50 శాతం ఎగువన ఉంటే, వృద్ధి ధోరణిగా ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన వరుసగా 25 నెలల నుంచి సూచీ వృద్ధి బాటనే పయనిస్తోంది. అమెరికా అలాగే బంగ్లాదేశ్, నేపాల్ వంటి ఇరుగుపొరుగు



దేశాల నుంచి కొత్త ఆర్డర్లు పెరిగినట్లు సూచీకి సంబంధించిన సర్వేలో వెల్లడైనట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్యానల్‌లోని దాదాపు 400 తయారీ సంస్థల పర్చేజింగ్ మేనేజర్స్‌కు పంపిన ప్రశ్నలు, అందిన సమాధానాల ప్రాతిపదికన సూచీ కదలికలు ఉంటాయి. 2005 మార్చిలో ఈ గణాంకాల సేకరణ ప్రారంభమైంది.

ఏటీఎఫ్ రేటు 8% పెంపు

వాణిజ్య ఎల్‌పీజీ ధర రూ. 100 తగ్గింపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా దేశీయంగా ప్రభుత్వ రంగ ఇంధన రిటైల్ సంస్థలు విమాన ఇంధన (ఏటీఎఫ్) రేటును ఏకంగా 8.5 శాతం పెంచాయి. అటు వాణిజ్య వంట గ్యాస్ ధరను సిలిండర్‌కు రూ. 100 మేర తగ్గించాయి. తాజా మార్పులతో ఢిల్లీలో ఏటీఎఫ్ రేటు కిలోలీటరుకు రూ. 7,728 పెరిగి రూ. 98,508కి చేరింది. దీంతో వరుసగా రెండో నెలా విమాన ఇంధనం రేటు పెరిగినట్లయింది. జూలై 1నే ఇది 1.65% మేర (కిలోలీటరుకు రూ. 1,477) పెరిగింది. అంతకు ముందు ఆయిల్ కంపెనీలు నాలుగు సార్లు తగ్గించాయి. ఇక 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 100 తగ్గి రూ. 1,680కి లభించనుంది. గృహావసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ రేటు యథాతథంగా రూ. 1,103 (14.2 కేజీల సిలిండర్) ఉంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) ప్రతి నెలా 1వ తేదీన వంట గ్యాస్, ఏటీఎఫ్ రేట్లను సవరిస్తాయి.

నెమ్మదించిన ఆటో అమ్మకాలు

- ఒక అంకె వృద్ధికి పరిమితమైన మారుతీ, హ్యుందాయ్
- ఎంఅండ్‌ఎం, టయోటా విక్రయాల్లో స్వల్ప వృద్ధి
- టూవీలర్స్‌కు కొనసాగిన డిమాండ్

ముంబై: దేశీయంగా ఆటో అమ్మకాలు జూలైలో నెమ్మదించాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్ కంపెనీల విక్రయాలు ఒక అంకె వృద్ధికి పరిమితమయ్యాయి. మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం జూలైలో మొత్తం 1,75,916 వాహనాలను విక్రయించగా, జూలైలో ఈ సంఖ్య స్వల్పంగా 3% పెరిగి 1,81,630 యూనిట్లకు చేరింది. ''ఈ జూలైలో మా ఎస్‌యూవీ అమ్మకాలు 42,620 యూనిట్లు. కేరళ ఓనమ్ పండుగ(ఆగస్టు 28)తో ప్రారంభం కానున్న పండుగ సీజన్ నుంచి ఆటో పరిశ్రమ అమ్మకాల్లో వృద్ధి ఆశించవచ్చు'' అని కంపెనీ మార్కెటింగ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

- హ్యుందాయ్ మోటార్ ఇండియా ఈ జూలైలో 66,701 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే ఏప్రిల్‌లో అమ్మిన 63,851 వాహనాలతో పోలిస్తే నాలుగు శాతం అధికం. ''స్పోర్ట్ యుటిలిటీ వెహికల్(ఎస్‌యూవీ)



వాహనాలకు డిమాండ్ లభించడంతో జూలైలో దేశీయంగా 60 వేలకు పైగా అమ్మకాలను సాధించగలిగాము'' అని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్ తెలిపారు.

- టాటా మోటార్స్ స్వల్పంగా అమ్మకాలు తగ్గాయి. గతేడాది జూలైలో 81,790 వాహనాలకు విక్రయించగా.., ఈ జూలైలో నాలుగు శాతం క్షీణతతో 80,633 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాల్లో 18% వృద్ధి సాధించింది. గతేడాది జూలైలో మొత్తం 56,148 యూనిట్లకు విక్రయించగా, ఈ జూలైలో 66,124 వాహనాలను అమ్మింది. ముఖ్యంగా ప్యాసింజర్ విభాగంలో 29 శాతం వృద్ధిని నమోదు చేసింది.
- ద్విచక్ర వాహన విక్రయాలకు డిమాండ్ కొనసాగడంతో చెప్పుకోదగిన స్థాయిలో విక్రయాలు జరిగాయి. బజాజ్ ఆటో(10% క్షీణత) మినహా రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 32%, 12%, 4% చొప్పున పెరిగాయి.

కంపెనీ	జూలై 2023	జూలై 2022	శాతాల్లో
మారుతీ సుజుకీ	1,81,630	1,75,916	(+)3
హ్యుందాయ్	66,701	63,851	(+)4
టాటా మోటార్స్	80,633	81,790	(+)1
ఎంఅండ్‌ఎం	66,124	56,148	(+)18
హోండా కార్స్	4,864	6,784	(-)28
ఎంజీ మోటార్స్	5,012	5,125	(-)2
టయోటా కిర్లోస్కర్	21,911	19,693	(+)11
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,19,747	3,54,670	(-)10
హీరో మోటోకార్ప్	3,91,310	4,30,684	(-)12
టీవీఎస్ మోటార్స్	3,25,977	3,14,639	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,117	55555	(+)32
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	5,877	5,982	(-)2
అశోక్ లేలాండ్	15,068	13,625	(+)11
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,570	5,360	(+)4
మహీంద్రా ట్రాక్టర్స్	25,175	23,307	(+)8

- మొత్తంగా వార్షిక ప్రాతిపదికన ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 3% స్వల్ప పెరుగుదల నమోదు చేశాయి. ఈ జూలైలో వీటి విక్రయాలు 3,52,492 యూనిట్లకు చేరాయి.

సూచీలకు స్వల్ప నష్టాలు

- ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులు
- 19,750 దిగువకు నిఫ్టీ

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్పంగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ ఐదు పాయింట్లు పెరిగి 66,533 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 270 పాయింట్ల పరిధిలో కదలాడి 66,388 వద్ద కనిష్టాన్ని, 66,658 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 68 పాయింట్లు నష్టపోయి 66,459 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 19,784 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,705 – 19,796 శ్రేణిలో కదలాడింది. చివరికి 20 పాయింట్లు పతనమై 19,734 వద్ద స్థిరపడింది. ఇంధన, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవచ్చని ఆశలతో ఐటీ స్టాకులకు డిమాండ్ లభించింది. అలాగే ప్రైవేటు బ్యాంకులు, మెటల్ షేర్లకూ గిరాకీ నెలకొనడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.93 కోట్ల ఈక్విటీలను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,036 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.26 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలతో ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. త్రైమాసిక ఫలితాలు, యూరోజోన్ జూలై తయారీ రంగ డేటా నిరాశపరచడంతో యూరప్ మార్కెట్లు బలహీనపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు లాభ, నష్టాల



మధ్య ట్రేడవుతున్నాయి. 'దేశీయ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ ఒక పరిమిత శ్రేణిలో స్థిరీకరణ దిశగా సాగుతోంది. వాహన కంపెనీల ఆగస్టు ఆటో అమ్మకాలు, అమెరికా తయారీ రంగ పీఎంఐ, ఉద్యోగ కల్పన డేటా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ద్రవ్య విధాన వైఖరి అంశాలు రానున్న రోజుల్లో సూచీలకు దిశా నిర్దేశం చేస్తాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- హీరో మోటోకార్ప్ షేరు మూడుశాతం పతనంతో కంపెనీకి ఒక్కరోజులోనే రూ.2,007 కోట్ల నష్టం వాటిల్లింది. మనీలాండరింగ్ విచారణలో భాగంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ కాంత్ ముంజల్ పాటు మరి కొందరి ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించినట్లు వార్తలు వెలుగులోకి వచ్చాయి. ట్రేడింగ్‌లో షేరు 5% పైగా క్షీణించి రూ.3203 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి మూడు శాతం నష్టంతో రూ.3103 వద్ద ముగిసింది.
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేరు 5% నష్టపోయి రూ.252 వద్ద ముగిసింది. జూన్ క్వార్టర్‌లో నికర లాభం 5% క్షీణించడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 6% పతనమై రూ.250.50 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.

భవిత
టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.
ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఐబీపీఎస్-4451 పీవో, ఎస్‌వో పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు /మేనేజ్‌మెంట్ ట్రైనీస్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టుల వివరాలు:** ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రైనీస్, స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టులు.
» **పోస్టుల సంఖ్య:** పీవో-3,049, ఎస్‌వో-1402
» **అర్హతలు:** పీవో పోస్టులకు ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన అర్హత ఉండాలి. ఎస్‌వో పోస్టులకు సంబంధిత విభాగంలో యూజీ, పీజీ, పీజీ డిప్లొమా తదితర అర్హతలు ఉండాలి. **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్(ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 01.08.2023
» **దరఖాస్తులకు చివరి తేది:** 21.08.2023
» **పూర్తి వివరాలకు:** https://www.ibps.in

తెలంగాణలో 1520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్((ఎంహెచ్ఎస్ఆర్‌బీ) కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్ విభాగంలో.. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1520
» **జోన్‌ల వారీగా ఖాళీలు:** జోన్1 కాళేశ్వరం-169, జోన్2 బాసర-225, జోన్3 రాజన్న-263, జోన్4 భద్రాద్రి-237, జోన్5 యాదాద్రి-241, జోన్6 చార్మినార్-189, జోన్7 జోగులాంబ-196.
» **అర్హత:** ఇంటర్మీడియట్ వొకేషనల్ ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థులు మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ట్రెయినింగ్ కోర్సు పూర్తిచేయాలి. మిడ్‌వైఫరీ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పని అనుభవం ద్వారా ఎంపికచేస్తారు. మొత్తం 100 మార్కులకు ఎంపిక ప్రక్రియ ఉంటుంది. రాతపరీక్ష ద్వారా 80 శాతం వెయిటేజీ ఉంటుంది. అభ్యర్థుల గత పని అనుభవాన్ని ఆధారంగా చేసుకుని మరో 20శాతం వెయిటేజీ కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.09.2023
» **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
» **వెబ్‌సైట్:** mhsrb.telangana.gov.in

ఆర్మీ వేల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీల్లో టీచింగ్ స్టాఫ్ పోస్టులు

ఆర్మీ వేల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దేశంలోని వివిధ కంటోన్మెంట్లు, మిలిటరీ స్టేషన్లలోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో..టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రెన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్) పోస్టులు.
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్/బీఈడీ /బీఈఎల్ఈడీ/పీజీ/డీఈఎల్ఈడీ ఉత్తీర్ణులవ్వాలి. సీటెట్, టెట్ అర్హత సాధించాలి.
» **వయసు:** 49 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 200మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వంతు రుణాత్మక మార్కు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2023
» **అడ్మిట్ కార్డులు విడుదల:** 20.09.2023.
» **పరీక్ష తేదీలు:** 30.09.2023 నుంచి 01.10.2023.
» **ఫలితాల విడుదల తేది:** 23.10.2023.
» **వెబ్‌సైట్:** www.awesindia.com

ఐఐఎస్ఈఆర్, బెర్హంపూర్‌లో 15 ఫ్యాకల్టీ పోస్టులు

బెర్హంపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-02, అసోసియేట్ ప్రొఫెసర్-02,అసిస్టెంట్ ప్రొఫెసర్-గ్రేడ్1-11.
» **విభాగాలు:** బయోలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమేటిక్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం 3 నుంచి 10 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,59,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**23.08.2023
» **వెబ్‌సైట్:** www.iiserbpr.ac.in

వాయుసేనలో అగ్నివీర్

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికోసం భారతీయ వాయుసేన అగ్నివీర్‌వాయు (01/2024) ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అగ్నిపథ్ స్కీం కింద భర్తీ చేసే ఈ పోస్టులకు మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మూడు దశల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపిన వారిని వాయుసేనలో అగ్నివీరులుగా తీసుకుంటారు. ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు వాయుసేనలో పనిచేసే అవకాశం లభిస్తుంది. అనంతరం 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారు. మిగతా వారు అగ్నిపథ్ స్కీములో భాగంగా ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలతో ఉద్యోగం నుంచి వైదొలుగుతారు..

» 2024(1) బ్యాచ్‌కు ప్రకటన విడుదల
» ఇంటర్‌తోనే ఎయిర్‌ఫోర్స్‌లో కొలువు

అగ్నివీర్‌వాయులో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో ఖాళీలున్నాయి. సైన్స్ విభాగంలో పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు నాన్‌సైన్స్ ఖాళీలకు పోటీ పడవచ్చు. ఇందుకోసం వీరు ప్రత్యేక పరీక్ష రాయాల్సి ఉంటుంది.

అర్హతలు

- **సైన్స్ విభాగం:** ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచ్‌ల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **నాన్ సైన్స్ విభాగం:** ఇంటర్మీడియెట్ ఏదైనా గ్రూప్‌తో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలి. ఏ అర్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. టెన్త్/ఇంటర్/ఒకేషనల్ ఇంగ్లిష్‌లో కనీసం 50శాతం మార్కులు సాధించడం తప్పనిసరి.
- **వయసు:** 17 1/2 నుంచి 21 ఏళ్ల లోపు ఉండాలి. అంటే.. 27.06.2003 నుంచి 27.12.2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎత్తు:** అన్ని విభాగాలకు పురుషులు 152.5 సెం.మీ.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతి వ్యత్యాసం 5 సెం.మీ. ఉండాలి.

ఎంపిక విధానం

మూడు దశల్లో నిర్వహించే అర్హత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందులో ఫేజ్-1 రాత పరీక్ష, ఫేజ్-2 ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు, ఫేజ్-3 మెడికల్ టెస్టులుంటాయి. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారిని మాత్రమే తుదిగా ధ్రువపత్రాలను పరిశీలించి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఫేజ్-1 రాత పరీక్ష

ఈ పరీక్షను ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. సైన్స్, నాన్ సైన్స్ రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష సమయం 85 నిమిషాలు ఉంటుంది. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్,రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. అలాగే తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ



ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 స్థాయిలో ఉంటాయి. ఎంపిక చేసుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్-20 ప్రశ్నలు, ఫిజిక్స్-25 ప్రశ్నలు, మ్యాథ్స్-25 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు.

ఫేజ్-2 ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

ఫేజ్-1 రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు మాత్రమే ఫేజ్-2కు అవకాశం లభిస్తుంది. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశ పత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికేట్లు, వాటి జిరాక్స్ సెట్, ఫోటోలు తదితరాలు తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుషులు 7 నిమిషాలు; మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటి నిమిషం వ్యవధిలో 10 పుష్ అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్ అప్స్, ఒక నిమిషంలో 15 స్క్వాట్స్ పూర్తిచేయగలగాలి. వీటన్నింటిలోనూ అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడా లేదా అనేది నిర్ణయించడానికి ఆబ్జెక్టివ్ తరహాలో ఈ రాత పరీక్ష ఉంటుంది.

ఫేజ్-3

అడాప్టబిలిటీ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణ కోసం ఎంపిక చేస్తారు.

10+2 స్థాయిలో ప్రిపరేషన్

సిలబస్ 10+2 సీబీఎస్ఈ స్థాయిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు సంబంధిత టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టితో చదవాలి. అలాగే మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లోని అంశాలను ఎంసెట్ స్థాయిలో ప్రిపేరవడం మేలు. దీంతోపాటు వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఫలితంగా ఇన్‌టైంలో పరీక్ష పూర్తిచేయగలుగుతారు. అంతేకాకుండా ఎక్కడ తప్పులు చేస్తున్నారో తెలుస్తుంది. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రీజనింగ్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి ఇటీవలి కాలంలో రక్షణశాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, ఈ విభాగంలో చోటుచేసుకున్న కీలకపరిణామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డులు, బుక్స్, ఎన్నికలు తదితర తాజా పరిణామాలపైనా దృష్టిపెట్టాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ:** 17.08.2023
- **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 13.10.2023
- **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

కొలువులో ఇలా

సేవానిధి

ప్రతినెల అందుకునే మొత్తంలో 30శాతం కార్పస్ ఫండ్‌కి జమచేస్తారు. ఇలా మొత్తం నాలుగేళ్ల కాలానికి సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండు కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని జతచేసి నాలుగేళ్ల తర్వాత వైదొలుగుతున్న సందర్భంగా అగ్నివీర్‌వాయుకు అందజేస్తారు. స్వయం ఉపాధి/వ్యాపారం కోసం వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమైన మొత్తాన్ని మాత్రమే అగ్నివీర్‌వాయుకు అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం దక్కదు.

25 శాతం మందికి శాశ్వత కొలువు

అగ్నివీర్‌వాయు స్కీంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకున్న వారిలో ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్టంగా 25శాతం మందిని మాత్రమే శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. సైన్స్ విభాగంలో అవకాశం వచ్చినవారు గ్రూప్-ఎక్స్(ఫిట్టర్) విధులు నిర్వర్తిస్తారు. వీరికి మొదటి నెల నుంచే రూ.33,100 వేతనంగా లభిస్తుంది.నాన్‌సైన్స్ అభ్యర్థులు గ్రూప్ వై(టెక్నీషియన్) సేవలు అందిస్తారు. వీరికి రూ.26,900 మూలవేతనం చెల్లిస్తారు. ఈ రెండు ట్రేడులవారికీ డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు అందుతాయి. ఎక్స్‌ట్రేడ్‌ల్లోని వారు మొదటి నెల నుంచే రూ.యాభై వేలకు పైగా, వై ట్రే డుల్లో చేరిన వారు సుమారు రూ.45,000 వేతనంగా అందుకోవచ్చు.

పదోన్నతులు

శాశ్వత కొలువు పొందిన తర్వాత సంబంధిత విభాగంలో విధుల్లో పనిచేసే వారు భవిష్యత్తులో ప్రమోషన్ల ద్వారా మాస్టర్ వారెంట్ ఆఫీసర్(ఎండబ్ల్యూవో) స్థాయి వరకు చేరుకోవచ్చు. సర్వీస్‌లో కొనసాగుతూ సంబంధిత పరీక్షల్లో అర్హత పొందిన వారు కమిషన్డ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యే అవకాశముంది. అలాగే ఉద్యోగం చేస్తూనే నిర్ణీత వ్యవధి గల ఉన్నత విద్యను కొనసాగించడానికి కూడా అనుమతిస్తారు. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అనంతరం పింఛను, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి.

ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో ప్రవేశం పొందిన వారికి 30 వార్షిక సెలవులు ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్‌లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్,రేషన్,డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు సర్టిఫికేట్ అందుతుంది. వీరికి పింఛను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ), ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా ఇవేవీ వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.



చిన్నారుల మోములో చిరునవ్వు

ముగిసిన ఆపరేషన్ 'ముస్కాన్'

సాక్షి, హైదరాబాద్: తప్పిపోయిన, అక్రమ రవాణాకు గురైన పిల్లల జాడ కనుగొనేందుకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–9 సోమవారంతో ముగిసింది. ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా మొత్తం 2,617 మంది చిన్నారుల మోములో తిరిగి చిరునవ్వులు తీసుకువచ్చాయి ప్రత్యేక పోలీసు బృందాలు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, బాండెడ్ లేబర్‌లు, సూక్ష్మ పరిశ్రమలు, భిక్షాటన, అక్రమ రవాణాకు గురైన పిల్లలను కనుగొని, వారిని తిరిగి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అప్పగించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా జూలై ఒకటి నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. నోడల్ ఏజెన్సీ అయిన ఉమెన్ సేఫ్టీ వింగ్ పర్యవేక్షణలో పోలీస్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, కార్మిక, ఆరోగ్యశాఖ సమన్వయంతో ఏర్పాటైన బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ కూడళ్లు, పరిశ్రమలు, ఇటుకల బట్టీలు, ఇతర కుటీర పరిశ్రమలు, మెకానిక్ షెడ్లు వంటి ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి. నెల రోజుల స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 2,617 మంది చిన్నారుల జాడను కనిపెట్టినట్టు మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ శిఖా గోయల్ తెలిపారు. చిన్నారులతో పనిచేయిస్తున్న 436 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్టు చెప్పారు.

కరెన్సీని కాదు.. కేలరీలను లెక్కించాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: 'మనం కరెన్సీని కాదు.. కేలరీలను లెక్కించడం చాలా ముఖ్యం' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మహిళా ఆరోగ్యంపై రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్త్రీలు, కౌమారదశలో ఉన్న బాలికల మానసిక, శారీరక శ్రేయస్సు ప్రధానమని పేర్కొన్నారు. బాల్యం నుంచే బాలికలకు యోగా, శారీరక వ్యాయామం, సంప్రదాయ ఆహార ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఎలాంటి ఆహారం ఇస్తున్నారో తెలుసుకోవాలంటే పిల్లల టిఫిన్ బాక్సులను తనిఖీ చేయాలని ఆమె సూచించారు. గతంలో తాను ఒకసారి అలా టిఫిన్ బాక్సులను పరిశీలించానని, చాలా బాక్సుల్లో బయటి నుంచి బర్గర్లు, చిప్స్, పఫ్స్, బిస్కెట్లు, స్నాక్స్ ఉండటం చూసి చాలా ఆశ్చర్యపోయానని తెలిపారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా మహిళల ఆరోగ్య అవసరాలపై ఇంకా స్పష్టత రాలేదని గవర్నర్ అభిప్రాయపడ్డారు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి మరిన్ని మొబైల్ మెడికల్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో మహిళలకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యాధుల కవరేజీని ఎక్కువగా పెంచారని ఆమె వెల్లడించారు.



తెలంగాణలో రూ. 4,849 కోట్ల జీఎస్టీ వసూలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జూలై నెలలో రికార్డు స్థాయిలో రూ.1,65,105 కోట్ల స్థూల జీఎస్టీ రాబడి నమోదైంది. అందులో సీజీఎస్టీ రూ.29,773 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.37,623 కోట్లు, ఐజీఎస్టీ రూ.85,930 కోట్లు (వస్తువుల దిగుమతిపై వసూలు చేసిన రూ.41,239 కోట్లతో సహా), రూ.11,779 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.840 కోట్లతో సహా) ఉన్నాయి. ఇక తెలంగాణలో జూలై నెలలో రూ.4,849 కోట్ల జీఎస్టీ వసూలు కాగా, ఏపీలో గతేడాదితో పోలిస్తే 5 శాతం వృద్ధితో ఏపీలో రూ.3,593 కోట్ల జీఎస్టీ వసూలైంది.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: దిగువ స్థాయిలోని గాలులు పశ్చిమ దిశ నుండి తెలంగాణ రాష్ట్రం వైపునకు వీస్తున్నాయి. దీంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా బుధవారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. గత 24 గంటల్లో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో 7 సెంటీమీటర్లు, మెదక్ జిల్లా పాపన్నపేటలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.



వయస్సు కోత.. అక్రమంగా ఆట

బ్యాడ్మింటన్ క్రీడలో తప్పుడు డేట్ ఆఫ్ బర్త్‌ల బాగోతం

- వాస్తవ వయస్సును తగ్గించేసి బీఏఐకి నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన ఆటగాళ్లు
- తల్లిదండ్రులు, కోచ్‌ల సహకారంతో గోల్‌మాల్!
- ముగ్గురి విషయంలో ధ్రువీకరించిన అధికారులు
- మరో 40 మందిపైనా సందేహాలు.. ఆకాశరామన్న లేఖ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

శ్రీరంగం కామేష్, సాక్షి ప్రతినిధి

బ్యాడ్మింటన్‌లో ఓ వయస్సు క్రీడాకారుడు అదే ఏజ్ గ్రూప్‌లో ఉండే మరో ఆటగాడితో పోటీ పడాలి. నిబంధనలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అలా జరిగినప్పుడే సరైన పోటీ అన్పించుకుంటుంది. వయస్సులో తేడాలున్నప్పుడు ఆటలోని అనుభవాన్ని బట్టి ప్రతిభా సామర్థ్యాల్లో సైతం తేడా ఉండేందుకు అవకాశం ఉంటుంది. పతకాలు, ర్యాంకుల్ని సైతం ప్రభావితం చేస్తుంది. ఇంతటి కీలకమైన వయస్సు నిబంధనకు తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకర్లు తూట్లు పొడిచారు. తమ పుట్టిన తేదీ విషయంలో భారీ స్కామ్‌కు పాల్పడ్డారు. తమ వాస్తవ వయస్సును తగ్గించేసి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు (బీఏఐ) తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారు. ఈ మేరకు అందిన ఆకాశరామన్న ఉత్తరం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ముగ్గురి విషయంలో ఈ అక్రమాలను నిర్ధారించారు. సమగ్ర ఆధారాలతో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. కానీ వారు ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు.

ఉత్తరం ఆధారంగా..

ఈ స్కామ్‌కు సంబంధించిన సమాచారాన్ని సిటీ సీసీఎస్ పోలీసులకు ఓ అజ్ఞాత వ్యక్తి లేఖ ద్వారా అందజేశారు. ఈ ఏడాది మార్చి 29న అందిన ఈ లేఖలో ఆరుగురు క్రీడాకారులపై ఆరోపణలున్నాయి. వీరు తమ అసలు వయస్సును దాచి పెట్టి నకిలీ సర్టిఫికెట్ల సృష్టించి బీఏఐకి సమర్పించారని, తద్వారా తమ కంటే చిన్న వారితో పోటీల్లో తలపడుతూ మెడల్స్, జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని అతను ఆరోపించారు. దీనివల్ల నిబంధనలు పాటించిన క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే బీఏఐకి అనేకమంది నుంచి ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవట్లేదని ఆరోపించారు.

సమగ్ర దర్యాప్తు చేసిన సీసీఎస్..

కేవలం ఈ ఆరుగురే కాకుండా దాదాపు 40 మంది బ్యాడ్మింటన్ ఆటగాళ్ల వయస్సు విషయంలో తమకు సందేహాలు ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తి ఆ లేఖలో పేర్కొన్నారు. వీరిలో చాలా మంది 2005–10 మధ్య పుట్టారని, అయితే జనన ధ్రువీకరణ పత్రాలకు బదులుగా కొందరు వైద్యులు ఇచ్చిన బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు దాఖలు చేసి తమ వయస్సు తగ్గించుకున్నారని పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రీడాకారులకు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది కోచ్‌లు, వారి తల్లిదండ్రులతో పాటు ఈ వైద్యుల సహకారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ లేఖను సిటీ పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు.

ముగ్గురి విషయంలో ఆధారాలు లభ్యం...

సీసీఎస్ ప్రత్యేక బృందానికి తొలి దశలోనే ముగ్గురు క్రీడాకారులకు సంబంధించిన సమగ్ర ఆధారాలు లభించాయి. బీఏఐ జాబితాలో అండర్–17 కేటగిరీలో 1176 పాయింట్లతో మూడో ర్యాంకులో ఉన్న రోహన్‌కుమార్ ఆనంద్‌దాస్ రాజ్‌కుమార్ తాను పుట్టిన తేదీని 2007 జనవరి 29గా పేర్కొంటూ బీఏఐకి సర్టిఫికెట్లు సమర్పించి టోర్నమెంట్లలో ఆడాడు. వాస్తవానికి రోహన్ పుట్టిన తేదీ 2005 అక్టోబర్ 29గా పోలీసులు నిర్ధారించారు. ఇదే కేటగిరీలో 92 పాయింట్లతో 44వ ర్యాంక్‌లో ఉన్న దవు వెంకట శివ నాగరామ్ మౌనీష్ తన పుట్టిన తేదీని 2007 జనవరి 29గా పేర్కొన్నారు. అయితే ఇతని అసలు పుట్టిన తేదీ 2006 జూన్4 అని దర్యాప్తులో తేలింది. అండర్–15 కేటగిరీలో 188 పాయింట్లతో 32వ ర్యాంక్‌లో ఉన్న భూక్యా నిషాంత్ తన పుట్టిన రోజును 2010 అక్టోబర్ 12గా పేర్కొనగా.. ఇతడి వాస్తవ పుట్టిన తేదీ 2007 జనవరి 12గా తేలింది. అయితే వీళ్లంతా మైనర్లు కావడంతో తమంతట తాముగా ఇలాంటి చర్యలకు పాల్పడలేరని, వాళ్ల కోచ్‌లు లేదా తల్లిదండ్రుల సహకారం, ప్రోద్బలంతోనే ఇలా చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. వారినే ఈ వ్యవహారంలో బాధ్యుల్ని చేయాలని భావిస్తున్నారు.

ఏమాత్రం స్పందించని అసోసియేషన్..

ముగ్గురి బాగోతం బట్టబయలు కావడంతో ఇలాంటి వాళ్లు మరికొందరు ఉండి ఉంటారని పోలీసులు అనుమానించారు. అయితే ఈ వ్యవహారాన్ని అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలన్నా, బాధ్యుల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఫిర్యాదు తప్పనిసరి. ఈ నేపథ్యంలో అన్ని వివరాలతో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ఈ ఏడాది మే 25న ఓ లేఖ (నం.65/పీఈ/క్యాంప్/డీసీపీ/డీడీ/సీసీఎస్/డీడీ/2023) రాశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని తమకు తెలియజేయాల్సిందిగా డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ కోరారు. కానీ అసోసియేషన్ ఇప్పటివరకు స్పందించక పోవడంతో వారికి తెలిసే ఈ స్కామ్ జరుగుతోందా? అనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఈ స్కామ్ దేశ వ్యాప్తంగా జరుగుతూ ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆరో ఉగ్రవాది దొరికాడు!



సల్మాన్ నివాసం

- జవహర్‌నగర్‌లో ఎస్కేప్.. రాజేంద్రనగర్‌లో అరెస్టు!
- మే నెల నుంచి పరారీలో ఉన్న మహ్మద్ సల్మాన్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, భోపాల్ సహా అనేక నగరాల్లో విధ్వంసానికి కుట్ర పన్నిన హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) ఉగ్రవాద సంస్థకు చెందిన మరో ఉగ్రవాది సల్మాన్‌ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మాడ్యుల్‌కు చెందిన ఐదుగురిని భోపాల్ ఏటీఎస్ పోలీసులు ఈ ఏడాది మే రెండో వారంలో పట్టుకుని తీసుకువెళ్లారు. ఆపై ఈ కేసు దర్యాప్తు నిమిత్తం ఎన్‌ఐఏకు బదిలీ అయింది. అప్పట్లో తప్పించుకున్న జవహర్‌నగర్ వాసి మహ్మద్ సల్మాన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇతడి కోసం సుదీర్ఘ కాలం నిఘా ఉంచిన ఎన్‌ఐఏ ప్రత్యేక బృందం ఎట్టకేలకు రాజేంద్రనగర్ ప్రాంతంలో అరెస్టు చేసింది. దీంతో మధ్యప్రదేశ్, హైదరాబాద్‌లో కలిపి ఈ కేసులో ఇప్పటివరకు పట్టుబడిన ఉగ్రవాదుల సంఖ్య 17కు చేరింది. టెర్రర్ మాడ్యుల్‌లో ఓ కళాశాలలో హెచ్‌ఓడీగా పని చేసిన ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం కీలకమని నిర్ధారించిన విషయం విదితమే. గోల్కొండలోని ఓ ప్రార్థన స్థలంలో సలీంకు దినసరి కూలి మహ్మద్ హమీద్‌తో పరిచయమైంది. ఇతడిని ఉగ్రవాద బాట పట్టించిన సలీం మరికొందరిని తన మాడ్యుల్‌లో చేర్చుకోవాలని భావించాడు. ఈ విషయం హమీద్‌కు చెప్పగా... అతడు తన చిన్ననాటి స్నేహితుడైన జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌ను తీసుకువచ్చి పరిచయం చేశాడు. వీరితో పాటు మొత్తం ఐదుగురితో సలీం మాడ్యుల్ ఏర్పాటు చేశాడు. ఈ ముష్కరులను పట్టుకోవడానికి మధ్యప్రదేశ్ ఏటీఎస్, రాష్ట్ర నిఘా వర్గాలు నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు భోపాల్‌లోనూ ఏకకాల దాడులు చేశాయి. ఫలితంగా అక్కడ 11 మంది, నగరంలోని గోల్కొండ, హఫీజ్ బాబానగర్, జగద్గిరిగుట్టల్లో సలీం, హమీద్ సహా ఐదుగురు చిక్కారు. జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ పోలీసులు దాడి చేసే సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. పోలీసులు వచ్చిన విషయం తెలిసిన సల్మాన్ పక్కింటి వాళ్లు అతడికి ఫోన్ చేసి చెప్పడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న సల్మాన్ కోసం ముమ్మరంగా గాలించిన ఎన్‌ఐఏ రాజేంద్రనగర్ ప్రాంతంలో పట్టుకుంది. ఇతడి నుంచి నిషేధిత సాహిత్యం సీజ్ చేసింది. కోర్టులో హాజరుపరిచిన అధికారులు భోపాల్ తరలించడానికి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. బుధవారం అక్కడకు తరలించిన తర్వాత న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.



కళ్లకలక విస్తరిస్తోంది. సీజనల్ వ్యాధుల బాధితులు ఆస్పత్రి బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కళ్ల కలకపై ఆందోళన వద్దు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు భరోసా

సాక్షి, హైదరాబాద్: కళ్ల కలక ఇన్ఫెక్షన్ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అసరం లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. వానాకాలంలో వైరల్ ఫీవర్లతోపాటు సోకే ఈ తరహా ఇన్ఫెక్షన్ల వల్ల ప్రమాదకర పరిస్థితులేమీ సంభవించబోవని వైద్య నిపుణులు చెబుతున్నా రన్నారు. పలు జిల్లాల్లో కళ్ల కలక కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మంగళవారం సచివాలయం నుంచి అన్ని విభాగాల ఉన్నతాధికారులు, అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు సహా అన్ని జిల్లాల వైద్యాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

తెలుగులోనూ ఏఎన్ఎం పరీక్ష...: ఎంపీహెచ్ఏ ఫిమేల్ (ఏఎన్ఎం) పరీక్ష నిర్వహణ విషయంలో ఏఎన్ఎంల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోవాలని, వారి కోరిక మేరకు పరీక్షను ఇంగ్లిష్‌తోపాటు తెలుగులోనూ నిర్వహించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. దీంతోపాటు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వారికి ఉచితంగా శిక్షణ ఇప్పించాలని, అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలన్నారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారికి తగిన వెయిటేజ్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిని ఆదేశించారు.

పెద్దారెడ్డి ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారు?

- దివాకర్ ట్రావెల్స్ అక్రమ వాహనాలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: బీఎస్–3 వాహనాలను బీఎస్–4గా మార్చి నడుపుతున్నారన్న ఫిర్యాదుపై ఎందుకు విచారణ చేయలేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు పలువురు ఉన్నతాధికారులు, సీబీఐతో పాటు టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది. టీడీపీ నేతలు జేసీ దివాకర్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన దివాకర్ ట్రావెల్స్ బీఎస్–3 వాహనాలను బీఎస్–4గా మార్చి నడపడంపై తాను 2020 అక్టోబర్ 12న రవాణా శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదంటూ ఏపీలోని తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏపీలో తన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి అక్రమాలు తేలడంతో పలు వాహనాలను సీజ్ చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం వాహనాలను అక్రమంగా నడుపుతున్నారని వివరించారు. ఇది సుప్రీం ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జేసీ ప్రభాకర్‌రెడ్డిపై విచారణ జరిపి కేసు నమో దు చేసేలా అధికారులను ఆదేశించాలని.. కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం ప్రతివాదులైన రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రవాణా శాఖ కమిషనర్, డీజీపీ, సీబీఐతోపాటు జేసీ ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేస్తూ విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేశారు.

సివిల్స్ మెయిన్స్ షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2023 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. సెప్టెంబర్ 15, 16, 17, 23, 24 తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి.. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. కాగా, గత మే నెలలో ప్రిలిమ్స్ నిర్వహించగా, జూన్‌లో ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే.



సభకు హాజరైన ఏబీవీపీ కార్యకర్తలు

జైజై తెలంగాణ.. బైబై కేసీఆర్



మాట్లాడుతున్న యజ్ఞవల్క్య శుక్లా

- ఏబీవీపీ కదనభేరీలో వక్తల పిలుపు.. విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారు
- ల్యాండ్, లిక్కర్, లీకేజీ మాఫియా రాజ్యమేలుతోంది

కంటోన్మెంట్ (హైదరాబాద్): రాష్ట్రంలో విద్యారంగాన్ని బీఆర్ఎస్ సర్కార్ భ్రష్టుపట్టించిందని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి యజ్ఞవల్క్య శుక్లా ధ్వజమెత్తారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ విద్యార్థి కదనభేరీ కార్యక్రమం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ వేదిక నుంచి "జైజై తెలంగాణ బైబై కేసీఆర్"పిలుపునిస్తున్నామన్నారు. ఉద్యమ సమయంలో కార్పొరేట్ కాలేజీలకు వ్యతిరేకంగా పోరాడిన కేసీఆర్ ఇప్పుడు ఆ కార్పొరేట్ కళాశాలలకే అండగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లపాటు పాలించమని రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌కు అధికారమిస్తే ఆయన మాత్రం భారీగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, లిక్కర్ క్వీన్ చేయలేని పనిని కేసీఆర్ మనువడు హిమాన్షు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. పేపర్ లీకులతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. మరో జాతీయ ప్రధాన కార్యదర్శి అంకిత పవార్ మాట్లాడుతూ..తెలంగాణలో లాండ్, లిక్కర్, లీకేజీల మాఫీయా రాజ్యమేలుతోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీసం బాత్‌రూమ్‌లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ పాలనలో ఎనిమిది వేల స్కూల్స్ మూతపడ్డాయని ఏబీవీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆశిష్ చౌహాన్ వెల్లడించారు.

కేసీఆర్ పాలన అంతం కోసం..

నాడు ఆంధ్ర పాలన అంతం కోసం ఓయూలో విద్యార్థులు రణభేరీ మోగించారని, నేడు కేసీఆర్ పాలన అంతానికి కదనభేరీ మోగిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ పేర్కొన్నారు. ఏబీవీపీ డిమాండ్‌లతో కూడిన లేఖను ఆమె విడుదల చేశారు. విద్యార్థి పరిషత్ బహిరంగ లేఖ లో ఇచ్చిన డిమాండ్లను నెలరోజుల్లోనే నెరవేర్చక పోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు శ్రీనాథ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోకెల్లా అత్యంత కఠినమైన పరీక్షలు.. టుడేస్ గ్రాఫిక్



1. చైనా	- గావ్‌కావ్	(కాలేజీల్లో ప్రవేశాల కోసం)
2. భారత్	- ఐఐటీ-జేఈఈ	(ఐఐటీల్లో ప్రవేశాల కోసం)
3. భారత్	- యూపీఎస్సీ	(అఖిల భారత సర్వీసుల్లో చేరికకు)
4. ఇంగ్లాండ్	- మెన్సా	(ఐక్యూ సామర్థ్యం మదింపునకు)
5. యూఎస్/కెనడా	- జీఆర్ఈ	(ఆయా దేశాల్లో ఉన్నత విద్య కోసం)
6. యూఎస్/కెనడా	- సీఎఫ్ఏ	(చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ కోర్సు)
7. యూఎస్	- సీసీఐఈ	(సిస్కో సర్టిఫైడ్ ఇంటర్నెట్‌వర్క్ ఎక్స్‌పర్ట్)
8. భారత్	- గేట్	(ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరికకు)
9. యూఎస్	- యూఎస్ఎంఎల్ఈ	(మెడిసిన్ ప్రాక్టీస్ చేసేందుకు లైసెన్స్ పరీక్ష)
10. యూఎస్	- కాలిఫోర్నియా బార్ ఎగ్జామ్	(లా ప్రాక్టీస్ చేసేందుకు లైసెన్స్ పరీక్ష)

- సాక్షి, సెంట్రల్ డెస్క్

'నోరెళ్లబెట్టే' రికార్డులు



గిన్నిస్‌లోకి ఎక్కేవారి టాలెంట్ చూసి అందరూ నోరెళ్లబెడుతుంటారు.. కానీ అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన ఓ మహిళ నోరెళ్లబెట్టడంలోనే ఏకంగా రెండు గిన్నిస్‌లు సాధించి అందరినీ అవాక్కు చేస్తోంది!! గేయ రచయిత, కమెడియన్, పాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమంతా రామ్స్‌డెల్ (33) 2021లో తన నోటిని 2.56 అంగుళాల మేర తెరిచి ప్రపంచంలోకెల్లా అతిభారీగా నోరు తెరిచిన వ్యక్తిగా గిన్నిస్ రికార్డు సృష్టించింది. అంతటితో సరిపుచ్చుకోకుండా తన నోటికి మరోసారి పనిచెప్పింది..! 2022 నవంబర్ 29న గిన్నిస్ ప్రతినిధుల సమక్షంలో తన నోటిని ఏకంగా 4.07 అంగుళాల వెడల్పుగా తెరిచి ఈ రికార్డునూ కొల్లగొట్టింది. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణను గిన్నిస్ ప్రతినిధులు తాజాగా ఆమెకు అందజేశారు. ఇదే విషయాన్ని ఆమె టిక్‌టాక్ వేదికగా నెటిజన్లతో పంచుకుంది. తన టాలెంట్‌ను మరోసారి చూపుతూ ఆమె పోస్టు చేసిన వీడియోను నెటిజన్లు ఏకంగా 38 లక్షలసార్లు వీక్షించడం మరో విశేషం.



అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం

ఆదిలాబాద్ జిల్లాలో పంచాయితీ తీర్పు

ఇచ్చోడ: అప్పు చెల్లించేవరకు ఇంటికి తాళం వేసి ఉంచాలన్న పంచాయితీ పెద్దల తీర్పు కారణంగా బాధిత కుటుంబం రాత్రంతా చీకట్లోనే ఇంటి ముందు జాగరణ చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన రాజేందర్ అనే ఆసామి వద్ద అదే గ్రామానికి చెందిన తాత్ర శీను పాలేరుగా పనిచేసేందుకు మూడునెలల క్రితం ఒప్పందం చేసుకున్నాడు. నెలకు రూ.7 వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకుని రూ.34 వేలు అడ్వాన్స్ తీసుకున్నాడు. గత జూలై 30వ తేదీ వరకు (దాదాపు మూడు నెలలపాటు) పనిచేశాడు. అయితే ఎడ్లజత సరిగా లేక, వాటితో వేగలేక తాను పనిచేయలేకపోతున్నానని యజమానికి పలుమార్లు చెప్పాడు. కానీ, రాజేందర్ స్పందించకపోవడంతో శీను సోమవారం పనికి వెళ్లలేదు. రాజేందర్ ఫిర్యాదు మేరకు సర్పంచ్ భర్త కన్నమయ్యతోపాటు గ్రామానికి చెందిన కుమ్మరి సాయన్న, కాళ్ల భూమయ్య పంచాయితీ పెట్టారు. శీను పనికి రాకుంటే తీసుకున్న డబ్బులు వెంటనే ఇవ్వాలని తీర్పు చెప్పారు. కొంత సమయం ఇవ్వాలని బాధితుడు ప్రాధేయపడినా వారు పట్టించుకోలేదు. డబ్బులు చెల్లించేవరకు ఇంటికి తాళం వేస్తామని చెప్పారు. పంచాయితీ పెద్దల తీర్పు మేరకు ఇంటికి తాళం వేయడంతో శీను భార్య గంగమణి, తల్లి పోసాని, కుమారులు మల్లేశ్, నవీన్‌తోపాటు కోడలు లక్ష్మి ఇంటి ఆవరణలోనే సోమవారం రాత్రంతా జాగరణ చేశారు. బాధితుడు శీను మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులతో శీను

ట్రాన్స్‌జెండర్లు సమాజంలో భాగమే..

- దేశంలోనే మొదటిసారిగా వారి ఉజ్వల భవిష్యత్ కోసం 'ప్రజ్వల'కృషి
- మీర్‌పేట పీఎస్‌లో వికల్ప్ సెంటర్ ప్రారంభించిన డీజీపీ



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

మీర్‌పేట: ట్రాన్స్‌జెండర్లు సమాజంలో భాగమని, ధైర్యంగా తలెత్తుకుని నిలబడాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారం, ఉపాధికల్పన కోసం హైదరాబాద్‌లోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 'వికల్ప్'కౌన్సెలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతి కోసం దేశంలోనే మొదటిసారిగా ప్రజ్వల సంస్థ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అభినందించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ఈ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డాక్టర్ సునీతాకృష్ణన్ సహకారంతో గతంలో దాదాపు 2,500 మంది సెక్స్ వర్కర్లను గుర్తించి, వారికి పునరావాసం కల్పించామని తెలిపారు. రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ వికల్ప్ కేంద్రం ద్వారా నేరాలు తగ్గుతాయన్నారు. డాక్టర్ సునీతాకృష్ణన్ మాట్లాడుతూ భిక్షాటన ద్వారా జీవనోపాధి పొందుతున్న ట్రాన్స్‌జెండర్లను గుర్తించి స్వయంఉపాధి కల్పించేందుకే వికల్ప్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల సహకారంతో సెంటర్‌కు తీసుకొచ్చి విద్యార్హత, ఆసక్తి మేరకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఇందుకోసం 15 కంపెనీలతో మాట్లాడామని వెల్లడించారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.